Dahshat Gardi Aur Islami Taleemat
(Telugu)

ధార్మిక అధ్యయనం, మార్గదర్శన కేంద్రం, (CRSG) అలీగఢ్ సమర్పణ

టెర్రరిజం ఇస్లామీయ బోధనలు

మూలం
ముఫ్తి ముహమ్మద్ ముష్తాక్ తిజార్వి

అనువాదం
అబ్దుల్ వాహెద్

విషయ క్రమం

ముందుమాట- డాక్టర్ ముహమ్మద్ అబ్దుల్ హక్ అన్సారీ	4
టెర్రరిజం అంటే ఏమిటి?	5
అర్థతాత్పర్యాలు	6
ఇస్లామీయ టెర్రరిజం?	13
పర్యాయపదాలు	15
మూలవాదం(**Fundamentalism**)	15
ఏకసత్తాక విధానం(**Totalitarianism**)	16
తిరోగమన వాదం (**Medievalism**)	17
నాగరికతల ఘర్షణ ఊహాగానాలు	19
టెర్రరిజం - ఇస్లాం	21
నిర్దోషుల హత్య	23
దౌర్జన్యానికి దౌర్జన్యపరుని పట్ల ప్రతీకారం	26
ప్రజాభిప్రాయాన్ని ఆకర్షించడానికి దౌర్జన్యం	29
దహనకాండ	35
దోపిడి	35
లాకప్ మరణాలు	36
క్రూర వ్యవహార శైలి	36
హతుల చిత్రవధ	37
అపహరణలు	38
ఆత్మాహుతి దళాలు	38
సాయుధ సంఘర్షణ-ఇస్లాం	43
వ్యక్తిగత స్థాయి	44
సామూహిక స్థాయి	49
రాజ్యస్థాయి	57
టెర్రరిజం- ఇస్లామీయ ఉద్యమాలు	61
ఇస్లామీయ ఉద్యమ నేతల భావాలు	62
రాషిదల్ గనోషీ ఏమన్నారంటే	63
ఇస్లామీయ ఉద్యమం - హింస	65
సాయుధ సంఘర్షణ- ప్రభావాలు	66
భవిష్యత్తు	67

ముందుమాట

టెర్రరిజం అంటే ఏమిటి? ఈ నేరానికి పాల్పడేవారెవరు? – కేవలం కొందరు వ్యక్తులు, గ్రూపులు, సంస్థలు, లేదా సంఘాలు మాత్రమే ఈ నేరానికి పాల్పడుతాయా, లేక జాతులు, ప్రభుత్వాలు కూడా ఈ నేరానికి పాల్పడుతాయా, లేక జాతిపరమైన, భాషపరమైన, సంస్కృతిపరమైన ఆధిక్యత గలదని ప్రకటించే జాతులు కూడానా!

సెప్టెంబర్ 11వ తేదీన న్యూయార్క్, వాషింగ్టన్ నగరాలలో జరిగిన సంఘటనల తర్వాత పాశ్చాత్య ప్రపంచానికి చెందిన వివిధ వర్గాలు టెర్రరిజానికి ముస్లిములతో ప్రత్యేక సంబంధమున్నట్లు చెప్పే ప్రయత్నం చేస్తున్నాయి. కొందరు మరీ దుర్మార్గంగా టెర్రరిజాన్ని ఇస్లామ్‌తో ముడిపెడుతున్నారు. ప్రాచ్య, పాశ్చాత్య దేశాలకు చెందిన అనేకమంది బాధ్యతాయుత ప్రభుత్వాధినేతలు, రాజకీయ నేతలు, మేధావులు ఈ ఆరోపణను కొట్టివేసినప్పటికీ ఇస్లామ్‌ను శాంతి బోధించే మతంగా చాటినప్పటికీ, నేడు కూడా దుష్టవర్గాలు, ప్రచార సంస్థలు ఈ అసత్యాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఈ పుస్తకం ఈ సమకాలీన సమస్యలనే చర్చిస్తుంది. టెర్రరిజం గురించి, దాని వివిధ రూపాల గురించి ఇస్లాం ఏం చెబుతోందన్నది ఈ పుస్తకం స్పష్టపరుస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లో బలప్రయోగం, ఆయుధ ప్రయోగం ధర్మబద్ధ మవుతుంది? దానికి ఉన్న పరిమితులు, షరతులు ఏవి? తదితర వివరాలను ముందు ఉంచుతుంది. వివిధ దేశాల్లో ముస్లిములు తమ న్యాయబద్ధమైన హక్కులు పొందడానికి కృషి చేస్తున్నారు. లేదా ఇస్లాం పునరుజ్జీవనానికి ప్రయత్నిస్తున్నారు. ఈ వర్గాలకు సంబంధించి తలెత్తే ప్రశ్నలను కూడా ఈ పుస్తకం స్పర్శిస్తుంది. ఈ పుస్తక పఠనం తర్వాత సత్యప్రేమికులయిన వారికి ఇస్లామీయ భావాలు అర్థం చేసుకోవడం కష్టం కాదని నమ్ముతున్నాము.

పుస్తక రచయిత ముఫ్తీ ముహమ్మద్ ముష్తాక్ తిజార్వీ "ధార్మిక అధ్యయనం, మార్గదర్శన కేంద్రం" (CRSG) అలీగఢ్‌లలో సేవలు అందిస్తున్న ప్రముఖ వ్యక్తి. ఆయన ఈ పుస్తక రచనలో అపారశ్రమను పరిశ్రమను వెచ్చించారు. ఇహలోకంలో పాఠకుల ఆదరణకు, పరలోకంలో దైవం తలిస్తే పుణ్యఫలానికి అర్హులు.

అలీగఢ్,
1 అక్టోబర్ 2001

డాక్టర్ అబ్దుల్ హక్ అన్సారీ
డైరెక్టర్ **(CRSG)**

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

టెర్రరిజం అంటే ఏమిటి?

టెర్రరిజం అన్న పదానికి అర్థతాత్పర్యాలు, ఆచరణాత్మక అన్వయం చాలా సంక్లిష్టమైనవి. ఈ విషయమై నిఘంటువు ఉపయోగపడదు. సాధారణంగా ఇది భేదాభిప్రాయమున్న పదం. ఒక పని ఒకరికి టెర్రరిజం అయితే ఇంకొకరికి దేశభక్తి అవుతుంది. కొందరు దాన్ని ధార్మిక విధిగా భావిస్తే మరికొందరు దాన్ని అపరాధంగా పరిగణిస్తారు.

కేవలం భయం భయోత్పాతం సృష్టించడాన్నే టెర్రరిజంగా భావించినట్లయితే ఈ పదాన్ని నిర్వచించడం ఇంత కష్టమయ్యేది కాదు. కాని ఈ పదాన్ని నిర్వచించేటప్పుడు చారిత్రక కారణాలను, రాజకీయ పరిధుల్ని, కొన్ని సందర్భాలలో సాంప్రదాయిక సాంస్కృతిక వారసత్వాలను ప్రక్కన పెట్టడం జరగదు. అందువల్ల దీని నిర్వచనంలో శాస్త్రీయత లోపిస్తుంది. దాన్ని నిర్వచించడం కష్టమవుతుంది. లండన్‌కు చెందిన ఒక పత్రిక 'అల్‌కుద్స్' 23 ఫిబ్రవరి సంచికలో ఒక జిహాద్ ఫత్వా ప్రచురించబడింది. ఫత్వా ప్రచురిస్తూ పత్రిక ఒక నోట్ రాసింది. ఈ ఫత్వా ఉసామా బిన్ లాదిన్ ఈజిప్టు, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల ఇస్లామీయ మిలిటెంట్ నాయకుల సంతకాలతో పత్రిక ఆఫీసుకు ఫాక్స్ ద్వారా పంపబడిందని తెలిపింది. ఆ ఫత్వాలో యూదులకు, క్రైస్తవులకు ప్రతిగా జిహాద్ చేయాలని ఉంది. మొదటి చూపులోనే ఈ ఫత్వా సందేహాస్పదమైనదని తెలుస్తుంది. కాని ప్రాచ్య శాస్త్ర నిపుణుడైన పాశ్చాత్య దురభిమాని, ప్రాక్ పాశ్చాత్య సంబంధాల గురించి అనేక పుస్తకాలు రాసిన ప్రముఖ రచయిత బర్నార్డ్ లేవిస్ ప్రసిద్ధ అమెరికన్ పత్రిక Foreign Affairs లో నవంబర్, డిసెంబర్ 1998 సంచికలో ఈ విషయమై సమీక్షిస్తూ – ఖైబర్ యూదులను, నజ్రాన్ క్రైస్తవులను హజ్రత్ ఉమర్ (రజి) ఆదేశంతో దేశాన్నుంచి బహిష్కరించారనీ, వాస్తవానికి ఈ రెండు జనవాసాల ప్రజలు నివాసపరంగా, సంప్రదాయపరంగా అరబ్బులేననీ, దీర్ఘకాలంగా అరబ్బు భూభాగంలో నివసిస్తూ వచ్చిన ప్రజలనీ వివరించాడు. అంతేకాదు బర్నార్డ్ లేవిస్, సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబీ కూడా

ఉదారస్వభావుడయినప్పటికీ రీనాల్డ్(Renold)ను హతమార్చాడని పేర్కొన్నాడు. అయితే రినాల్డ్ సాయుధ బృందాలపై దారిదోపిడికి పాల్పడేవాడనీ, రెండుసార్లు మక్కాపై దాడి చేశాడని కూడా ఒప్పుకున్నాడు. కాని ఈ సంఘటనలను ఏకరువు పెట్టిన బర్నార్డ్ లేవిస్, క్రైస్తవులు బైతుల్ మక్దిస్‌ని ఆక్రమించుకున్న సందర్భంగా మస్జిద్ అక్స ప్రాంగణంలో డెబ్బైవేల మంది ముస్లిములను వధించిన సంఘటన మరచిపోయాడు.

అర్థతాత్పర్యాలు

తెలుగులో ఉగ్రవాదం అని అనువదించే ఇంగ్లీషు పదం టెర్రరిజం Terrorism లాటిన్‌లోని Trerror నుంచి వచ్చింది. టెర్రర్ అంటే భయోత్పాతం సృష్టించడం, భయోత్పాతాలు సృష్టించడాన్ని టెర్రర్ అంటారు. టెర్రరిజం ఒక పారిభాషిక పదం. నిఘంటువుల్లో దీనికి ఖచ్చితమైన అర్థం లేదు. అయితే దీనికి సంబంధించిన వివరణలు ఇచ్చారు. ఆ వివరణల్లో రెండు వివరణలు ముఖ్యమైనవి. మొదటిది: భయకంపితులు చేయడం, రాజకీయ ఎత్తుగడగా, విధానంగా ఏదైనా వర్గాన్ని లోబరచుకోడానికి బెదిరించడం. రెండవది: శాంతియుతమైన ప్రజలపై రాజకీయ ఉద్దేశాలతో హింసాత్మక దాడులు చేయడం.

టెర్రరిజానికి సమగ్రమైన నిర్వచనం ఏదీ లేకపోవడానికి మరో కారణం ఏమంటే ఈ పదం వాస్తవానికి పాత్రికేయ భాషకు చెందినది. ఈ పదాన్ని సాధారణంగా మీడియాలోనే ఉపయోగిస్తారు. చట్టాలలో దీని ఉపయోగం కనబడదు. ఈ పదాన్ని వాడడం వెనుక రాజకీయ ప్రయోజనాల ప్రేరణ ఉంటుంది. అందువల్ల ఈ పదాన్ని సైద్ధాంతికంగా, శాసనపరంగా నిర్వచించడం కష్టం. 'ఎన్‌సైక్లోపేడియా ఆఫ్ వరల్డ్ టెర్రరిజం' లోని వ్యాసకర్త ఇలా వ్రాసాడు, నిఘంటువులో టెర్రర్ (Terror)కు అర్థం లభిస్తుంది కాని టెర్రరిజం (Terrorism) అర్థం దొరకదు. ఫ్రాన్స్ విప్లవం సందర్భంగా పరస్పర నిందారోపణల్లో మొదటిసారిగా ఈ పదాన్ని వాడడం జరిగింది. అంటే ప్రథమంగా ఈ పదాన్ని తిట్టుగా ఉపయోగించారు. తిట్టుకు నిఘంటు అర్థం అన్వేషించడం వ్యర్థం. ఎన్‌సైక్లోపేడియా బ్రిటానికాలో వ్యాసకర్త ఈ పదాన్ని నిర్వచిస్తూ –

A systematic use of terror or unpredictable violence against governments, public, or individuals to attain a political objectives.

"రాజకీయ లక్ష్య సాధనకుగాను క్రమబద్ధమైన పద్ధతిలో ప్రభుత్వాలకు లేదా ప్రజలకు లేదా వ్యక్తులకు వ్యతిరేకంగా భయబీభత్సాలు, అనూహ్యమయిన హింసా విధానాలను వినియోగించడం ఈ నిర్వచనంలో టెర్రరిజాన్ని రాజకీయ లక్ష్య సాధనకు అవలంబించే మార్గంగా పేర్కొనడం జరిగింది. అమెరికాలోని ఓక్లహామా నగరంలో జరిగిన ప్రేలుడు దాని క్రిందికి వస్తుంది. ఈ ప్రేలుడు వల్ల దాదాపు రెండు వందల మంది సజీవ ఖననం జరిగింది. ఈ నీచమైన పనికి పాల్పడిన వాడు అమెరికాలోని ఒక క్రైస్తవ సైనికుడు. భయోత్పాతాలు సృష్టించడం తప్ప మరో ఉద్దేశ్యం యేదీ దీని వెనుక లేదు. అమెరికాలోని 30 రాష్ట్రాలలో ఇలాంటి వాళ్ళు లక్షలాది మంది క్రియాశీలురై ఉన్నారని విచారణల్లో తెలిసింది. వీరు నిష్కారణంగా టెర్రరిస్టు చర్యలకు పాల్పడుతుంటారని కూడా తేలింది. FBI రిపోర్టు ప్రకారం 1982-92 మధ్య కాలంలో 'ప్యూర్టో రికన్స్' (Puerto Ricans) గ్రూపు 72 టెర్రరిస్టు దాడులు చేసింది. యూదుల గ్రూపు 16 దాడులు, కాస్ట్రో వ్యతిరేక గ్రూపు 12 దాడులు, వామపక్ష ఉగ్రవాదులు 23 దాడులు, రైట్‌వింగ్ వాళ్ళు 6 దాడులు చేశారు.

1945లో జపాన్‌పై అమెరికా అణుబాంబు ప్రయోగించి 72 వేల మందిని చంపినందుకు ప్రతీకారంగా ఏమైనా చేయడానికి సిద్ధపడే సంస్థ రెడ్ ఆర్మీ. ఇటీవల అమెరికాపై జరిగిన టెర్రరిస్టు దాడుల విషయంలో ఉసామా బిన్ లాదిన్‌పై అను మానాలు వ్యక్తమయినప్పటికీ ఇతర ఉగ్రవాద సంస్థల ప్రమేయం గురించి కూడా **F.B.I.** పరిశీలించింది. రెడ్ ఆర్మి ప్రమేయం ఈ దాడుల వెనుక ఉంటే ఆశ్చర్యం లేదు. యూదుల తర్వాత ఇలాంటి అతిపెద్ద దాడిని, పథకం ప్రకారం అమలు చేయగల సత్తా ఎవరికయినా ఉంటే వాళ్లు జపాను వాళ్ళే. కాబట్టి టెర్రరిజాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సముచితం కాదు. బ్రిటన్‌కు చెందిన జర్నలిస్టు విక్టోరియా షాఫేల్డ్ (Victoria Schofield) ఈ పదాన్ని నిర్వచిస్తూ - "నిఘంటు పరంగా ఈ పదానికి అర్థం ఏదైనా ప్రభుత్వాన్ని కూల్చడానికి హింసా దౌర్జన్యాలకు

పాల్పడడం" అని చెబుతూ ఆమె మరో నిర్వచనం ఇలా ఇచ్చింది. – "ప్రజలను భయపెట్టి వారి ఇష్టానికి విరుద్ధంగా వారిని పరిపాలించడం". ఈ నిర్వచనాలు లోపభూయిష్టమైనవి. మొదటి నిర్వచనం యుద్ధానికి వర్తిస్తుందేమో కాని టెర్రరిజానికి కాదు. ఆ యుద్ధం కూడా ఒక టెర్రరిజం కానవసరం లేదు. టెర్రరిజానికి వ్యతిరేకంగా కూడా యుద్ధం జరుగుతుంది. ఇక రెండవ నిర్వచనం మహా అయితే రాజ్య ఉగ్రవాదం (State Terrorism)ను సూచిస్తుంది. అయితే రాజ్యహింసకు సంబంధించిన వివిధ పార్శ్వాలు, విభిన్న కోణాలు వేరే ఉన్నాయి. ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ వరల్డ్ టెర్రరిజంలో వ్యాసకర్త పదకొండు పేజీలను కేవలం ఈ పదాన్ని నిర్వచించడానికే వినియోగించాడు. నాలుగు విభిన్న వర్గాలు ఈ పదాన్ని అవి (1) శాస్త్రవేత్తల(Academy) నిర్వచించినతీరు అతను ప్రస్తావించాడు. (2) మేధావులు (3) ప్రభుత్వాలు (4) ప్రజలు అకాడమిక్స్ లేదా శాస్త్రవేత్తల, మేధావులు ఉద్దేశ్యంలో టెర్రరిజం అంటే –

Terrorism is an anxiety inspiring method of repeated violent action, employed by (sem) clandestine individual, group, or state actors for idiosyncretic, criminal or political reasons, where by in contrast to assasinations - the direct targets of violence are not the main targets. The immediate human victims of violence are generally chosen randomly or selectively from a target population and serve as message generators. Threat and violence based communication process between terrorist, victims and main targets are used to manipulate the main targets, turning it into a target of terror, a target of demands or a target of attention depending on whether intimedation, coercion or propaganda is primarly sought.

(Encyclopaedia of world terrorism Vol.I, p.18)

"తరచూ హింసాత్మక చర్యలకు పాల్పడడం ద్వారా భయోత్పాతాలు సృష్టించడాన్ని టెర్రరిజం అంటారు. హింసాత్మక చర్యలకు పాల్పడేది రహస్యమైన లేక బహిరంగమైన వ్యక్తులు అయినా, సంస్థలు అయినా, ప్రభుత్వాలు అయినా, వాటి వెనుక ఉద్దేశ్యం వ్యక్తిగత అహంభావం తృప్తి చెందడమైనా లేక నేరానికి

సంబంధించినదయినా లేక రాజకీయమైనది. అయినా, వ్యక్తిగత హత్యకు విరుద్ధంగా- ప్రత్యేక బాధితులు ఈ హింసాత్మక చర్యల అసలు లక్ష్యం కాకపోయినా ఒక ప్రత్యేక జనాభాలో కొందరు వ్యక్తులో లేదా ఎంచుకోబడిన వారో హింసాత్మక చర్యలకు గురవుతారు. ఈ ఘటనలు సందేశాన్ని చేరవేసేవిగా ఉపయోగపడతాయి. టెర్రరిస్టు కార్యకలాపాలకు పాల్పడే వారికి, బాధితులకు, అసలు లక్ష్యంగా ఉన్న వ్యక్తులకు మధ్య నడిచే, భయోత్పాతాలపై ఆధారపడిన ఈ సమాచార చేరవేత వెనుక ఉద్దేశ్యం అసలు లక్యంగా ఉన్న వ్యక్తులను ఆకర్షించడం భయవిహ్వలురు చేయడంగాని, లేదా డిమాండ్లు సాధించడంగాని ఏదైనా కావచ్చు. దాని ద్వారా కోరుకున్నది బలవంతం లేదా ఒత్తిడి చేయడమా లేక కేవలం ప్రాపగాండ చేయడం మాత్రమేనా అన్న అంశంపై ఇది ఆధారపడి ఉంటుంది."

ఈ విషయమై ప్రభుత్వాల వైఖరి స్పష్టంగా లేదు. బహుశా ప్రభుత్వాలు తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించడాన్ని ఇష్టపడవు కూడా. 1977లో టెర్రరిజంపై యూరోపు దేశాల కన్వెన్షన్ జరిగింది. కాని అక్కడ కూడా టెర్రరిజాన్ని నిర్వచించడం సాధ్యపడలేదు. కేవలం కొన్ని నేరాల జాబితాను ప్రకటించి, ఆయా నేరాలకు పాల్పడిన వారిని టెర్రరిస్టుగా పరిగణించడం జరిగింది.

1985లో పశ్చిమ జర్మనీ ప్రభుత్వం అధికారికంగా ఓ నిర్వచనాన్ని ప్రకటించింది - "రాజకీయ లక్ష్యాలు సాధించడానికి, హింసాత్మక చర్యలకు పాల్పడడం, అంటే ప్రజల ధన ప్రాణాలపై దాడి చేయడం, హత్యలు, జాతి నిర్మూలన, అపహరణ బాంబు ప్రేలుళ్ళకు పాల్పడడం".

1980లో అమెరికా గూఢచార సంస్థ సి.ఐ.ఏ. టెర్రరిజాన్ని క్రింది విధంగా నిర్వచించింది.

The threat or use of violence for political purposes by individuals or groups, whether to or inopposition to established government authority. When such actions are intended to shock or intimidate a long group wider than the immediate victims. ***(Encyclopaedia of world Terrorism)***

"వ్యక్తులయినా, గ్రూపులయినా, రాజ్యాధికారానికి వ్యతిరేకంగా లేదా

రాజ్యాధికారంపై రాజకీయ ప్రయోజనాల కోసం భయోత్పాతాలను ఉపయో గించడం అలాంటి చర్యల ద్వారా తక్షణ బాధితులకన్నా చాలా పెద్ద సమూహాన్ని దిగ్భ్రాంతికి గురిచేయడం లేదా భయోత్పాతాలకు గురిచేయడం టెర్రరిజం."

1974లో బ్రిటిష ప్రభుత్వం టెర్రరిజాన్ని క్రింది విధంగా నిర్వచించింది.

For the purpose of the legislation terrorism is the use of violence for political ends and includes any use of violence for the purposes of putting the public or any section of public, in fear."

"చట్టం దృష్టిలో టెర్రరిజం అంటే – రాజకీయ లక్ష్యాలతో హింసాత్మక పద్ధతులు ఉపయోగించడం ప్రజలను లేదా ప్రజలలో ఓ వర్గాన్ని భయోత్పాతాలకు గురిచేసే చర్యలన్నీ ఈ పరిధిలోకి వస్తాయి."

ఇలాంటి నిర్వచనాలను ఇంకా అనేక ప్రభుత్వాలు ఇచ్చాయి. స్వయంగా అమెరికాలో ఎఫ్.బి.ఐ. తన సొంత నిర్వచనాన్నిచ్చే ప్రయత్నం చేసింది. ఈ నిర్వచనాలన్నింటిలోనూ 'రాజకీయ ప్రయోజనాల కోసం' అన్న మాటలు కీలక మైనవి. అంటే రాజకీయ ప్రయోజనాల కోసం భయోత్పాతాన్ని సృష్టించే టెర్రరిజం గురించి మాత్రమే ప్రభుత్వాలు పట్టించుకోవాలి. టెర్రరిజం ఇతర రూపాలను పట్టించుకోనవసరం లేదు అన్నట్లు ఉన్నాయి ఈ నిర్వచనాలు.

ఎన్సైక్లోపీడియా ఆఫ్ వరల్డ్ టెర్రరిజంలో వ్యాసరచయిత పేర్కొన్న మూడవ మార్గం ప్రజాభిప్రాయం. అయితే ప్రజాభిప్రాయం క్రింద మీడియాలో టెర్రరిజం అన్న పదం ఉపయోగించిన వైనాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకొన్నాడు. వ్యాస రచయిత అభిప్రాయం ప్రకారం మీడియాలో క్రింది నిష్పత్తిలో వివిధ నేరాలను టెర్రరిజంగా పేర్కొనడం జరిగింది.

ఏదైనా ఉద్దేశ్యంతో మనుషుల్ని అపహరించడం	80%
బాంబు ప్రేలుళ్ళు	75%
హైజాకింగ్	70%
విధ్వంసక చర్య	60%
హత్యలు చేయించడం, చేయడం	70%

కిడ్నాపింగ్ / మనుషుల్ని అపహరించడం	70%
గెరిల్లా యుద్ధం	65%
హింసించడం	45%

పై నిష్పత్తిని రాసిన తర్వాత ఆ వ్యాస రచయిత ఈ నేరాలను సాధారణంగా టెర్రరిజంగా పరిగణిస్తారని అయితే టెర్రరిజానికి సంబంధంలేని విధంగా కూడా ఈ నేరాలు జరుగొచ్చని ఉదాహరణకు సంపన్న కుటుంబానికి చెందిన వ్యక్తిని కిడ్నాప్ చేసి డబ్బు డిమాండ్ చేయడం టెర్రరిజం కాదని, అలాగే ఒక ప్రాంతం నుంచి పారిపోడానికి విమానాన్ని హైజాక్ చేస్తే అది టెర్రరిజం కాదని రాశాడు. ఆ వ్యాస రచయిత స్వయంగా టెర్రరిస్టుల అభిప్రాయాన్ని కూడా పేర్కొన్నాడు.

It is clear that so called terrorism is the logical and just resistance of the people against state terrorism, capitalism, racism, sexism and imperialism."

"టెర్రరిజంగా పేర్కొనబడే చర్య నిజానికి రాజ్య ఉగ్రవాదానికి పెట్టుబడిదారి, జాత్యాహంకారాలకు, లైంగిక వేధింపునకు, సామ్రాజ్యవాదాలకు విరుద్ధంగా పెల్లుబుకే న్యాయబద్ధమైన, హేతుబద్ధమైన ప్రతిఘటన."

వ్యాస రచయిత ఈ పదానికి సమగ్ర నిర్వచనం ఇంకా లభించలేదని అంగీకరించాడు. అయితే నిర్వచనం కన్నా ముందు కొన్ని ప్రశ్నలకు జవాబులు అన్వేషించడం అవసరం. ఉదాహరణకు ఒక శక్తి ఏదైనా ప్రాంతాన్ని బలవంతాన ఆక్రమించుకొంటుంది. ఆ శక్తికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు బలప్రయోగానికి పూనుకొంటే అలా చేయడాన్ని ఏమనాలి? ఉదాహరణకు పాలస్తీనాపై యూదుల దురాక్రమణ అన్యాయం, అక్రమం. పాలస్తీనీయులు యూదులను తమ డిమాండ్ల కోసం నిర్బంధించడం లేక ప్రేలుళ్ళకు పూనుకోవడం, ఆత్మాహుతి దాడులు చేయడం వంటి చర్యలు చేపడితే ఈ చర్యలు టెర్రరిజం అవుతాయా? యూదులు నిరాటంకంగా, నిరంతరం కొనసాగిస్తున్న హింసా దౌర్జన్యాలు, దాడులను టెర్రరిజంగా పరిగణించడం జరుగదా? ఇదే విధంగా అమెరికా వియత్నాంలో 33 లక్షల మంది సాధారణ ప్రజలను చంపింది. అమెరికాపై ఈ ప్రజలు ప్రతీకార చర్యలు చేపడితే ఆ చర్యలు టెర్రరిజం అవుతాయా? అమెరికా జరిపిన హత్యాకాండ కూడా ఈ పరిధిలోకి వస్తుందా?

ఈరాన్‌పై అమెరికా మూడు సార్లు బాంబింగ్ చేసింది. పార్లమెంటు భవనాన్ని ధ్వంసం చేసింది. ఒకసారి అయిదు వందల మంది ప్రయాణీకులు ఉన్న ఒక విమానాన్ని కూల్చింది. ఈ చర్యలు టెర్రరిజం కాదా? ఇదే విధంగా అమెరికా కేవలం అనుమానంతో అనేక దేశాలపై దాడులు చేసింది. ఇది టెర్రరిజం కాదా? అంతేకాదు, అనేక దేశాలలో, స్వాతంత్ర్య పోరాటాల సందర్భంగా ప్రారంభంలో పోరాట నాయకులను టెర్రరిస్టులనే పిలిచేవారు. తర్వాతి కాలంలో ఈ నేతలే జాతికి హీరోలు అయ్యారు. దీనికి ఏమనాలి?

కాబట్టి, టెర్రరిజానికి సంబంధించి అనేక రూపాలు మన ముందుకు వస్తున్నాయి. టెర్రరిజం వ్యక్తిగత స్థాయిలోనూ ఉండవచ్చు. ఉదాహరణకు ఎవరైనా దుర్మార్గపు లక్ష్యాలను సాధించడానికి భయోత్పాత వాతావరణాన్ని సృష్టించవచ్చు. దీనికి మంచి ఉదాహరణ అమెరికాలోని ఓక్లహామాలో జరిగిన సంఘటన. అక్కడ ఒక అమెరికన్ బాంబుప్రేలుళ్ళు జరిపి రెండు వందల మంది అమాయకులను హతమార్చాడు. పాలస్తీనాలో మస్జిద్ ఖలీలుల్లాహ్ సంఘటన కూడా ఇలాంటిదే. అక్కడ నమాజు చేస్తున్న వారిపై కొందరు యూదులు గుడ్డిగా కాల్పులు జరిపారు. దక్షిణ భారత దేశంలో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కూడా ఈ కోవలోకే వస్తాడు. అతడు దాదాపు నూటయాభై మంది అమాయకులను పొట్టన పెట్టుకున్నాడు. కొన్ని సందర్భాలలో టెర్రరిజం రాజ్యపరమైనది కూడా కావచ్చు. ఉదాహరణకు 'అరాకాన్' ముస్లిములపై బర్మా ప్రభుత్వం జరిపిన సైనిక చర్య. చెచెన్యాపై రష్యా టెర్రరిజం కూడా అలాంటిదే. కొన్ని సందర్భాలలో టెర్రరిజం జాతిపరమైనది కావచ్చు. ఫిజిలో భారతీయ మూలవాసులపై స్థానికులు జరిపిన దౌర్జన్యాలు లేదా ఆస్ట్రేలియాలో ఆర్యేతరులపై దౌర్జన్యాలు లేదా పాలస్తీనాలో స్థానిక అరబ్బులపై, క్రైస్తవులపై యూదుల దౌర్జన్యాలు ఈ కోవలోకే వస్తాయి.

టెర్రరిజం మరో రూపం. మత విభేదాల పునాదులపై ఉనికిలోకి వస్తోంది. ఉదాహరణకు బోస్నియాలో సెర్బియన్ క్రైస్తవులు పాల్పడిన జాతి సంహారం. టెర్రరిజం వర్ణ విభేదాల ఆధారంగా కూడా ఉండవచ్చు. అమెరికాలో నల్లజాతి వారిపై తెల్లజాతి దౌర్జన్యాలు అలాంటివే.

టెర్రరిజం రెండు దేశాల మధ్య కూడా సంభవించవచ్చు. ఉదాహరణకు

ఐర్లాండ్, బ్రిటన్‌ల మధ్య, లేదా వియత్నాం, అమెరికాల మధ్య. అలాగే పాలస్తీనా, ఇస్రాయీల్ మధ్య మాదిరిగా వర్గ ప్రాతిపదికన కూడా కావచ్చు. ఒకే మతానికి చెందిన రెండు వర్గాల మధ్య కూడా ఉండొచ్చు. ఉత్తర ఐర్లాండ్‌లోని కేథలిక్, ప్రొటెస్టెంటు వర్గాలు దీనికి ఉదాహరణ. టెర్రరిజం ఒక దేశ అంతర్గత వ్యవహారంగా కూడా ఉండొచ్చు. ప్రభుత్వంపై ప్రజల సాయుధ తిరుగుబాటు మాదిరిగా. **(తర్జుమానుల్ ఖుర్ఆన్ : జూన్ 1995)**

ఇస్లామీయ టెర్రరిజం?

టెర్రరిజానికి సంబంధించిన కొన్ని మౌలిక విషయాలను పైన తెలుసుకొన్నాము. ఇందులో కొన్నింటికి సంబంధించిన చిహ్నాలు చరిత్ర గర్భంలో కలిసిపోయాయి. మరి కొన్నింటికి సంబంధించి రోజుకో కొత్త వార్త వినవస్తుంది. వీటిలో అన్నింటికన్నా ముఖ్యమైనది మతపరమైన టెర్రరిజం. మతపరమైన టెర్రరిజం అన్నది కేవలం యూరపు సమస్యగా ఉండేది, ముఖ్యంగా క్రైస్తవ వర్గాల మధ్య కనబడేది, కాని నేడు మతపరమైన టెర్రరిజం అంటే ఇస్లామీయ టెర్రరిజం అని భావించడం జరుగుతోంది. కాని, వాస్తవానికి ఇస్లాంలో టెర్రరిజానికి ఎలాంటి చోటు లేదు. ఇస్లాం శాంతిని ప్రబోధించే ధర్మం. శాంతి సందేశమే ఇస్లాం సందేశం. ఇస్లామీయ టెర్రరిజం నిజంగానే ఒక ప్రపంచ వ్యాప్త ప్రమాదం అని స్వయాన పాశ్చాత్య దేశాలలో కూడా అంగీకారం లేదు. ఈ ఆరోపణను చాలా మంది పాశ్చాత్య మేధావులు ఒక భ్రమగా కొట్టివేస్తున్నారు. కాని సాధారణంగా ముస్లిమేతరుల మనోమస్తిష్కాలపై అలుముకొని ఉన్న అభిప్రాయం, మీడియా యధాశక్తి ప్రచారం చేస్తున్న అభిప్రాయం ప్రకారం ఇస్లాం ఒక పెద్ద ప్రమాదం. ఇస్లాంకు క్రైస్తవానికి మధ్య భయానక యుద్ధం జరుగవచ్చు. ఒక ప్రత్యేక వర్గం ఇలాంటి అభిప్రాయాలు వ్యాపింపజేసేందుకు ప్రయత్నిస్తుంది. దురదృష్టవశాత్తు వర్గానికి ప్రపంచ మీడియా మద్దతు కూడా లభిస్తోంది. అందువల్ల మీడియాలో కనబడే రాతలు అవి వాస్తవాలు అయినా, వారి బుద్ధికి తోచిన మాటలు అయినా ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం పొందుతాయి. తార్కిక వాదనలతో లేదా ఒకటి అరా సంఘటనలను సర్వసామాన్యం చేసి పేర్కొంటూ లేదా ఏదైనా ఫిలాసఫీని

సృష్టించి లేదా కేవలం కలం బలంతోనో లేక పాత్రికేయ చాతుర్యాలతో ఇస్లాం, క్రైస్తవాల మధ్య ఎల్లప్పుడు వైరమే అన్న భావాన్ని ప్రచారం చేస్తున్నారు.

ఈరాన్ ఒక చిన్న దేశం. ఆ దేశానికి దాని సమస్యలు దానికి ఉన్నాయి. ఈరాన్ గురించి అమెరికా విదేశాంగ మంత్రి క్రింది అభిప్రాయాన్ని ప్రకటించారు.

Iran is the foremost state sponserer of terrorism in the world★

"ప్రపంచంలో టెర్రరిజాన్ని ప్రోత్సహించేదేశాలలో ఈరాన్‌దే ప్రథమ స్థానం."

ఇంతకు టెర్రరిజాన్ని పోషించే పెద్ద దేశం ఈరాన్ అని ఎలా చెప్పగలరన్నది తెలుసుకోవలసిన విషయం. వరల్డ్ ట్రేడ్ సెంటర్ వద్ద ప్రేలుడు జరిగినపుడు అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్‌పై విమర్శలు వచ్చాయి. మధ్యాసియాలో పెరుగుతున్న టెర్రరిజం, ముఖ్యంగా లెబనాన్‌లో హిజ్బుల్లా టెర్రరిజం దీనికి కారణమనీ, అమెరికా అధ్యక్షుడు బుష్ మధ్యప్రాచ్యంలో టెర్రరిజాన్ని అదుపు చేయలేనందువల్లే ఇదంతా జరిగిందని విమర్శలు వచ్చాయి. **(America and Political Islam P.47)**

ఇస్లామీయ దేశాలు అణుశక్తి లేని దేశాలు. ప్రపంచ స్థాయిలో అణుయుగం రూపొందడానికి ప్రత్యేక కారణాలున్నాయి. ఇస్లాంకు దానితో ఎలాంటి సంబంధమూ లేదు. అణ్వాయుధ పాటవం ఉన్న దేశాలన్నీ, దాదాపుగా, ఇస్లాం వ్యతిరేక వైఖరి కలిగి ఉన్న దేశాలే. కాని, అమెరికాలో, హెంటింగ్‌టన్, గణాంక వివరాలతో, పాశ్చాత్య దేశాలు అణ్వాయుధాలను సమకూర్చుకోడానికి ఇస్లామే కారణమని రుజువు చేసే ప్రయత్నం చేశాడు. ఆయన మాటల్లో –

పాశ్చాత్య ప్రపంచంలో, ఇస్లామ్‌నే అణుశక్తి వృద్ధికీ టెర్రరిజానికీ, యూరప్‌లో ప్రవాసులు అవాంఛనీయంగా పెరుగడానికీ కారణంగా భావించబడుతుంది.

(Clash of civilizations, P.215)

అఫ్ఘానిస్తాన్ అత్యంత దయనీయ స్థితిలో ఉన్న దేశం. కాని మీడియాలో అక్కడ టెర్రరిజం ఉన్నట్లు చేసిన దుష్ప్రచారం కారణంగా యావత్తు ప్రపంచం

★ **Fawaz Agerges : America and political Islam Cambridge University Press, 1999 P. 45)**

ఆ భయంతో వణుకుతోంది. ఈ చిత్రం వెనుక వారు చేసిన మంచి పనులు కూడా కప్పిపెట్టడం జరిగింది. ఉదాహరణకు, మానవాళికి తీవ్ర నష్టం కలుగజేసే గంజాయి సాగును తాలిబాన్లు పూర్తిగా నిర్మూలించారు. అఫ్ఘానిస్తాన్ పౌరుడెవరో చెప్పాడని కట్టుకథ. ఏది వచ్చినా తక్షణం మీడియా యావత్తు ఆ ప్రకటనను ఎగరేసుకెళ్ళి ప్రచురించింది. కాని ఆ ప్రకటనకు ఖండన వస్తే మీడియాలో సాధారణంగా దానికి చోటే లభించలేదు. ఒకవేళ ప్రచురించినా అప్రధానంగా మూలన వేశారు.

సెప్టెంబరు 11న అమెరికాలో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి తర్వాత అనుమానంతో ఉసామా బిన్ లాదిన్ వైపు వ్రేలెత్తి చూపారు. అమెరికా తాలిబాన్లపై ఉచ్చు బిగించడం ప్రారంభించింది. ఉసామాకు ఈ దాడికి సంబంధం లేదని తాలిబాన్ల విశ్వాసం. ఉసామాకు ఈ దాడితో సంబంధం ఉందని అమెరికా భావిస్తున్నట్లయితే గట్టి సాక్ష్యాధారాలు చూపాలనీ, అమెరికా ఉసామాను న్యాయస్థానంలో విచారించాలని భావిస్తుంటే ఏదన్నా తటస్థ దేశంలో విచారించాలని న్యాయస్థానం నిర్ణయాన్ని అంగీకరిస్తామని వాళ్ళు చెప్పారు. కాని అమెరికా దేనికి ఒప్పుకోలేదు. ఎట్టి పరిస్థితిలోనూ సజీవంగానో, శవంగానో ఉసామా కావలసిందేనని పట్టుబట్టింది.

పర్యాయపదాలు

ఇస్లామీయ టెర్రరిజం అన్నది ప్రజల మనోమస్తిష్కాలపై అలుముకొనేలా చేయడానికి పాశ్చాత్య మేధావులు అవలంబించిన వివిధ మార్గాల్లో పర్యాయపదాల వాడకం ఒకటి. పర్యాయపదాలంటే నిఘంటు ప్రకారం పర్యాయపదాలని అర్థం కాదు. పాశ్చాత్య పాత్రికేయ మేధావులు సృష్టించిన పదాలు. వీళ్ళు సృష్టించిన ఇస్లామీయ టెర్రరిజానికి పర్యాయపదాలుగా వీటిని వాడుతున్నారు. ఈ పదాల్లో మొదటిది 'ఫండమెంటలిజం'.

మూలవాదం (Fundamentalism)

చారిత్రకంగా చూస్తే మూలవాదం లేక ఛాందసవాదం పాశ్చాత్య

దేశాలలోనే ప్రారంభమయ్యింది. క్రైస్తవ ఛాందసవాదానికి, స్వేచ్ఛా భావాలకు మధ్య పాశ్చాత్య దేశాల్లో ఘర్షణలు జరిగాయి. ఇస్లాంలో ఇలాంటి ఘర్షణలు లేనేలేవు. అందువల్ల ఇస్లామ్‌లో ఛాందసవాదం లేదా నవ్యతావాదం అనే భావనలు ఏవీ లేవు. కాని పాశ్చాత్యులు ముస్లిములపై ఛాందసవాదాన్ని అంటగట్టారు. నిజానికి 'ఫండమెంటలిజం' అన్న పదానికి అర్థం మౌలిక సిద్ధాంతాలకు కట్టుబడి ఉండడం (తెలుగులో పత్రికలు చేసే 'చాందసవాదం' అన్న అనువాదం సరి అయినది కాదు). పందొమ్మిదవ శతాబ్దం చివరలో కొందరు మతోన్మాదులను ఉద్దేశించి ఈ పదాన్ని వాడడం ప్రారంభమయ్యింది. ఈ మతోన్మాదులు బైబిల్‌లోని ప్రతి అక్షరంలోని బాహ్య అర్థాన్ని యథాతథంగా స్వీకరించేవారు. ప్రయోగాత్మక విజ్ఞాన శాస్త్రాన్ని గణిత శాస్త్ర వాస్తవాల వెలుగులో స్పష్టంగా రుజువయినా యదార్థాలను నిరాకరించేవారు.[1] కాని ముస్లిములు ఇలాంటి మతోన్మాదాన్ని ఎన్నడూ ప్రదర్శించ లేదు. ముస్లిములు పవిత్ర ఖుర్‌ఆన్‌ను దైవగ్రంథంగా విశ్వసిస్తారన్నది నిజమే. కాని దివ్యగ్రంథంలోని ప్రతి మాటలోని బాహ్యపరమైన అర్థాలను మాత్రమే వర్తింప జేయడం జరుగదు. దివ్యఖుర్‌ఆన్‌లోని భావాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తారు. దివ్యఖుర్‌ఆన్‌లోని పదాలు మానవ బుద్ధి వివేకాలు, అనుభవేక వాస్తవాలు అన్నింటి ద్వారా ప్రయోజనం పొంది దివ్యఖుర్‌ఆన్ బోధనలను అర్థం చేసుకొంటారు. అయి నప్పటికీ పాశ్చాత్య మేధావులు 'ఫండమెంటలిజం' అన్న పదాన్ని దాని అసలు నేపథ్యం నుంచి తొలగించి ఇస్లామ్ అనుయాయులకు అంటగట్టారు. ఈ పదాన్ని ముస్లిములకు అంటగట్టి, ముస్లిములు పద్నాలుగు వందల సంవత్సరాల పూర్వం నాటి మాటలను పట్టుకు వేళ్ళాడుతున్నారనీ, ఆధునిక జ్ఞాన విజ్ఞానాలు, ఆధునిక భావాలు, స్వేచ్ఛా సమానత్వాలు, స్త్రీ పురుష సమానత్వం ప్రజాస్వామ్యం వగైరాలకు శత్రువులని నిరూపించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఏకసత్తాక విధానం (Totalitarianism)

టొటాలిటేరియనిజం అంటే ప్రజాస్వామ్య వ్యతిరేక మానవత్వ విరుద్ధమైన

1. ***Prof. Gordon Conway: Islamophobia: Achallenges for us all, The Runnymade Trust, 1997, P.7)***

విలువలను పాటించడం. సర్వాధికారాలు ఒకే వ్యక్తి చేతిలో ఉండాలనడం. ఈ పదాన్ని కూడా టెర్రరిజానికి పర్యాయపదంగా ముస్లిములను అప్రతిష్టపాలు చేయడానికి ఉపయోగిస్తున్నారు. నిజానికి వాస్తవాలు దీనికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి. ఈ పదంలోని చెడు పార్శ్వాలన్నింటినీ మీడియా ముస్లిములకే ఆపాదిస్తుంది. బర్నార్డ్ లీవిస్ ఈ విషయాన్ని క్రింది విధంగా పేర్కొన్నాడు.

One man one vote, once ఒకే వ్యక్తి, ఒకే ఓటు, ఒకే సారి.

(America and Political Islam' P. 21)

బర్నార్డ్ లీవిస్ గొప్ప మేధావి. ఇస్లామీయ ప్రపంచం క్రైస్తవాల మధ్య సంబంధాల గురించి రాస్తూ ఆయన ప్రవక్త (సఅసం) కాలంలోని చిన్న చిన్న సంఘటనలను కూడా సూక్ష్మదృష్టితో పరిశీలించిన వ్యక్తి. కాని, పక్షపాత స్వభావం వల్ల ఇస్లాంలోని భావస్వేచ్ఛ, రాజకీయ స్వేచ్ఛ, రోమనుల వంశపారంపర్య పాలనకు విరుద్ధంగా ఇస్లాంలోని సలహా మండలి వ్యవస్థ, ఖిలాఫత్ వ్యవస్థ ఆయనకు కనబడలేదు.

తిరోగమన వాదం (Medievalism)

మిడివలిజాన్ని అనువదించడం కష్టం. దీని అనువర్తన భావం రీత్యా తిరోగమన వాదంగా పేర్కొనవచ్చు. పాశ్చాత్య దేశాలలో మధ్యయుగాన్ని మానవ హక్కులు మంటగలిసిన కాలం, స్త్రీలపై అణచివేత దౌర్జన్యాల కాలంగా పరిగణిస్తారు. నిస్సందేహంగా పాశ్చాత్య దేశాల చరిత్ర అంతా అలాగే ఉంది. కాని అచ్చంగా అదే కాలం ప్రాచ్య దేశాల్లో ముస్లిములు ఉచ్ఛదశలో ఉన్న కాలం. ఈ పదాన్ని (మిడీవలిజం) ప్రయోగించి ముస్లిములను ఎత్తిపొడుస్తారు. ముస్లిములు తిరోగమన వాదులని, మధ్యయుగం నాటి వ్యవస్థను తిరిగి స్థాపించాలనుకొంటున్నారని, ప్రగతి సాధించి ముందడుగు వేయడాన్ని ఇష్టపడరనీ, తిరోగమనంతో తిరిగి దౌర్జన్యపరమైన మధ్యయుగానికి వెళ్ళాలని భావిస్తారని, స్వేచ్ఛకు శత్రువులనీ, లైంగిక వివక్షను సమర్ధిస్తారని నిందిస్తారు.

టెర్రరిజానికి ఈ పర్యాయ పదాలనే కాక మరికొన్ని పదాలను కూడా ఇదే అర్థంలో ఉపయోగించడం జరుగుతోంది. కొన్ని ఇస్లామీయ విలువలను

కూడా వక్రీకరించి ఈ భావంలో చూపడానికి ప్రయత్నిస్తుంటారు. జిహాద్, ఖలీఫా, ఇస్లామీజం ఇస్లామీయ ఉద్యమాలు వగైరా ప్రయోగాలు ఇలాంటివే. ఇస్లామిజం అంటే సాంప్రదాయిక ఇస్లాంను కాదని, నవ్య రీతిలో ఇస్లాం పేరిట ప్రారంభమయ్యే ఉద్యమంగా వారు స్వయంగానే నిర్ణయించారు. దీని ఉద్దేశ్యం కేవలం అధికారాన్ని సాధించడం మాత్రమే. కెనడాకు చెందిన మిడిల్ ఈస్ట్ ఫోరమ్ డైరెక్టర్ 'డేనియల్ పైప్స్' (Danial Pipes) అత్యంత ఉగ్రశ్రేణిలో ఈ విషయమై రాసిన మాటలు "పాశ్చాత్య విలువలు, సంప్రదాయాలు, ఫిలాసఫీ, రాజకీయ సంస్థలు అన్నింటిని ఇస్లామ్ప్రియులు పూర్తిగా నిరాకరిస్తారు. అయితే పాశ్చాత్య దేశాల నుంచి టెక్నాలజీ పొందాలని చూస్తారు. ముస్లిమేతరులపై ముఖ్యంగా యూదులు, క్రైస్తవులంటే వారికి తీవ్ర వైరం. ఇస్లామ్ ప్రియుల భావాలు, ఆలోచనలు, సిద్ధాంతాలు, ఆచరణల ద్వారా ఈ విషయం తరచూ తెలియవస్తోంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఇస్లామ్ ప్రియులు ఇస్లాంను ఒక ఆచరణాత్మక సిద్ధాంతంగా మార్చేశారు. ఇస్లామిజం అన్న పదం ఒక ప్రయోజనకరమైన పదం. ఇరవయ్యో శతాబ్దంలోని అనేక వ్యవస్థలు, ఇజాల మాదిరిగా ఒక వ్యవస్థను లేదా ఇజాన్ని సూచిస్తుంది. మార్క్సిజం, ఫాసిజంల తర్వాత ఇస్లామిజం ప్రస్తావన వస్తుంది. ఇది ప్రస్తుత కాలంలోని అనేక ఇతర భావనలు, సిద్ధాంతాల మాదిరిగా ఇస్లామీయ ఆలోచనలపై ఆధారపడిన భావనలను ప్రకటిస్తుంది. ఈ భావనలు, పాశ్చాత్య రాజకీయ ఆర్థిక భావనల మాదిరిగా ఇస్లాంలో కొత్త ఊపిరిని పోస్తాయి - ఇస్లామిస్టులు అధికారంలోకి వస్తే... ఆయుధాలు విస్తృతమవుతాయి, టెర్రరిజం, అన్యాయంగా అక్రమంగా దౌర్జన్యాల ఇతర పద్ధతులు సర్వసాధారణమైపోతాయి. క్లుప్తంగా చెప్పాలంటే ఇలాంటి గూండా రాజ్యాలు ఇవి: ఈరాన్, సూడాన్, అఫ్గానిస్తాన్. ముస్లిములకు ముస్లిమేతరులకు అందరికీ ఓ వాస్తవమైన ప్రమాదం ఇస్లాం.[1]

ఇస్లామీయ ఉద్యమాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తారు. అమెరికా, ఫ్రెంచి రష్యా విప్లవాల మాదిరిగా పరిగణిస్తుంటారు.[2] క్రూసేడు యుద్ధాలకు

---

1. డేనియల్ పైప్స్ : "ఇస్లాం కె లిబాద్ మేం" ఉర్దూ అనువాదం ముహమ్మద్ అయ్యూబ్ మునీర్, తర్జుమానుల్ ఖుర్ఆన్, జనవరి 2000.

2. S.P. Huntington : Clash of civilizations, viking India, New Delhi 1996, P. 159)

పర్యాయపదంగా జిహాద్‌ను పేర్కొంటుంటారు. జిహాద్ అంటే పవిత్ర యుద్ధం అని అనువదిస్తుంటారు. ముస్లిముల కార్యకలాపాల్లో బల ప్రయోగం జరిగే అవకాశం ఏ మాత్రం కనబడినా దాన్ని జిహాద్‌గా నిర్ధారిస్తుంటారు.

ఒక్కోసారి ఊహాజనిత వ్యాఖ్యలు, ప్రకటనలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చోపచర్చలు ప్రారంభమవుతాయి. ఒక్కోసారి ఈ ప్రకటనల ఆధారంగానే మానవాళిని యుద్ధ అగ్ని గుండంలో తోయడానికి ప్రయత్నాలు జరుగుతుంటాయి.[3]

నాగరికతల ఘర్షణ ఊహాగానాలు

ఇస్లామ్‌ను పాశ్చాత్య దేశాల ప్రత్యర్థిగా నిరూపించడానికి మీడియా సృష్టించిన పారిభాషిక పదాలలో నాగరికతల ఘర్షణ కూడా ఒకటి. కొందరు పాశ్చాత్య మేధావుల ప్రకారం ఇస్లాం ఒక అపరిచిత నాగరికత పాశ్చాత్య సంస్కృతితో కలిసి మనజాలదు. ఇలాంటి అభిప్రాయాలను శాస్త్రీయంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. సాంస్కృతిక ఘర్షణ సిద్ధాంతం పైకి తార్కికమైనదిగా కనబడు తోంది. కాని, వాస్తవ స్థాయిలో నిర్ధారణ జరగడం కష్టం. హంటింగ్‌టన్ ఈ సిద్ధాంతాన్ని నిరూపించడానికి సర్వేలు, గణాంకాలపై ఆధారపడ్డాడు. అందులో కొన్ని సర్వేలు కేవలం మేధాపరమైన కాలక్షేపం తప్ప మరేమీ కాదు. కొన్ని గణాంకాలు పూర్తిగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయి. వాస్తవాల వెలుగులో వాటికి ఎలాంటి ప్రాముఖ్యం లేదు. కొన్ని అంశాలయితే హంటింగ్‌టన్ బుద్ధి కల్పనలూ ఉన్నాయి. ఉదాహరణకు ఇస్లాంను కన్‌ఫ్యూషస్‌తో ముడిపెట్టడం వ్యర్థ ఊహాగానం. దీనికి సంబంధించిన ఆధారాలు ఏవీ లేవు. అలాగే అణ్వాయుధ శక్తి పెరగడానికి కారణం ఇస్లాం అని చూపించే ప్రయత్నం కూడా కేవలం ఊహా జనితం. సాంస్కృతిక ఘర్షణ అన్న సిద్ధాంతం తప్పుడు సిద్ధాంతం అని మా

---

3. 23 ఏప్రిల్ 1998లో ఉసామా బిన్ లాదిన్ జారీ చేశాడని ప్రచురించిన జిహాద్ ఫత్వా వాస్తవం కాదని ఇంతకు ముందే వివరించడం జరిగింది. అయినప్పటికీ ఈ ఉత్తుత్తి ప్రకటన ఆధారంగా వరల్డ్ ట్రేడ్ సెంటర్ పేలుడును ఉసామాపై ఆరోపించడం జరిగింది. ఉసామాపై అనుమానానికి కారణం అతడు జారీ చేసిన జిహాద్ ఫత్వా అని సి.ఎన్.ఎన్. మొదటి రోజునే స్పష్టంచేసింది.

ఉద్దేశ్యం. సంస్కృతులు ఘర్షణ పడవు. క్రూరత్వాలు ఘర్షిస్తాయి. ప్రయోజనాలు ఘర్షిస్తాయి. అహాలు ఘర్షిస్తాయి. ఘర్షణ సాధారణంగా రాజ్యాల మధ్య జరుగుతుంది. పాలకుడు స్వప్రయోజనాలకు ప్రజల మనోభావాలను రెచ్చగొట్టిన సందర్భాలలోనే ప్రజల స్థాయిలో ఘర్షణ ఏర్పడుతుంది. సంస్కృతులు సాధారణంగా ఇచ్చిపుచ్చుకొనే ధోరణి కలిగి ఉంటాయి. ఇస్లామీయ చరిత్ర నుంచి, ఇతర జాతుల చరిత్ర నుంచి ఇలాంటి అనేక ఉదాహరణలు చూపించవచ్చు. ఇంకా చెప్పాలంటే స్వయంగా పాశ్చాత్య సంస్కృతి ఇస్లాం నుంచి ప్రయోజనాలు గ్రహించింది. ఆధునిక ఇస్లామీయ భావ నిర్మాణంలో పాశ్చాత్య భావాల ప్రభావం ఉంది. పాశ్చాత్య మీడియా అనేక విధాలుగా ఇస్లాం వ్యతిరేక వాతావరణాన్ని నెలకొలిపే ప్రయత్నాలు చేస్తోంది. ఎక్కడన్నా ముస్లిములు పాశ్చాత్యులు పనికిరాని పాత ఆయుధాలను కొనుగోలు చేస్తే వెంటనే ఇస్లామీయ ప్రపంచంలో భయానక టెర్రరిజం వృద్ధి చెందుతోందని గగ్గోలు మొదలవుతుంది. కాగా స్వయంగా పాశ్చాత్య దేశాలు పీకల వరకు భయంకర ఆయుధాల కుప్పల్లో మునిగి ఉన్నాయి. కాని, ఈ విషయమై ఎవ్వరూ గగ్గోలు పెట్టరు. నేడు ప్రపంచంలోని క్రైస్తవం, యూద మతం, బౌద్ధం, హిందూ మతాల వద్ద ఆటంబాంబులు ఉన్నాయి. కాని ఈ బాంబులను ఆయా మతాల బాంబులని ఎవరూ పిలువరు. కానీ, 54 ముస్లిం దేశాలలో కేవలం పాకిస్తాన్ వద్ద అణుపాటవం ఉంటే దాన్ని ఇస్లామిక్ బాంబుగా వర్ణిస్తారు.

కొందరు పాశ్చాత్య మేధావులు ఇస్లామీయ ఉద్యమాలను పాశ్చాత్య భావాలతో యుద్ధానికి సమానంగా భావిస్తుంటారు. ఈ ఉద్యమాలు పెంపొందడాన్ని యుద్ధ ప్రారంభంగా పరిగణిస్తుంటారు. ఉదాహరణకు హంటింగ్టన్ రాసిన మాటలు –

"ఈరాన్ విప్లవం తర్వాత పాశ్చాత్య దేశాలకు, ఇస్లాంకు మధ్య ఒక సాంస్కృతిక యుద్ధం ప్రారంభం కావడంలో ఆశ్చర్యం లేదు."

(Clash of Civilizations, P. 216)

ఇలాంటి ప్రకటనలు విశ్లేషణల వెనుక ఉద్దేశ్యం ఒక్కటే – ఇస్లాం శాంతికి శత్రువు, టెర్రరిస్టు మతం అన్న అభిప్రాయాలు ప్రచారం చేయడం, వాస్తవాల దృష్ట్యా ఈ విశ్లేషకులకు ఎలాంటి ప్రాముఖ్యం లేదు.

హంటింగ్‌టన్ పాశ్చాత్య ప్రపంచానికి ప్రతినిధి కాదు. ఆయన్ను వ్యతిరేకించే వాళ్ళు, న్యాయంగా మాట్లాడేవాళ్ళు పాశ్చాత్య దేశాల్లో చాలామంది ఉన్నారు. వారు ఇస్లాం క్రైస్తవాల మధ్య సుహృద్భావ సంబంధాలను అభిలషిస్తారు. అందుకుగాను ఆచరణాత్మకంగా కూడా కృషిచేస్తున్నారు. ఉదాహరణకు జాన్ ఎస్పొసిటో **(John Esposito)** పాశ్చాత్య దేశాల్లో ప్రముఖ మేధావి. క్రైస్తవ, ముస్లిం సుహృద్భావ సంబంధాలు కోరే వ్యక్తి. జార్జి వాషింగ్టన్ యూనివర్శిటీలో ముస్లిం క్రైస్తవ సంబంధాల విభాగానికి డైరెక్టర్. ఈయన అభిప్రాయాలు ఈ కోవకు చెందినవే. వాటికన్ 1965/1966లో జరిగిన రెండవ కౌన్సిల్ మీటింగ్‌లో ఇస్లాంను ఇబ్రాహీమ్ ధర్మాలలో చేర్చుకొంది. క్రైస్తవం ధార్మిక పునాదులపై ఇస్లాంతో సయోధ్య కోరుతుందనడానికి ఇది నిదర్శనం.

యూరప్‌లోని ప్రొటెస్టెంట్, కేథలిక్ చర్చిల సంస్థలు **(CCE & KEN)** "ఇస్లాం ఇన్ యూరప్" కమిటీని ఏర్పరచాయి. ఈ కమిటీ 1994లో రిపోర్టు సమర్పించింది. మార్చి 1995లో జెనివాలో ఈ అంశంపై సెమినార్ జరిగింది. ఇస్లాం క్రైస్తవాల మధ్య సౌహార్ద సంబంధాల కోసం అనుసరించదగ్గ విధానాల విషయమై ఈ సెమినార్‌లో చర్చ జరిగింది.[1] ఈ సౌహార్ద సంబంధాలు, పరస్పర సహకారాలకు సంబంధించిన ఇలాంటి అనేక ఉదాహరణలు ఉన్నాయి. కాని, మీడియా సాధారణంగా వీటిని నిర్లక్ష్యం చేస్తుంది. ఈ సంఘటనలకు లభించవలసినంత ప్రచారం లభించదు. పైగా, మీడియా సాధారణంగా ఘర్షణ, భేదాభిప్రాయాలకు మరింత ఆజ్యం పోసే వైఖరినే అవలంబిస్తోంది.

టెర్రరిజం - ఇస్లాం

మీడియా, ముఖ్యంగా పాశ్చాత్య మీడియా ఏ విధంగా ముస్లిములను అప్రతిష్టపాలు చేస్తుందో ఆధారరహితమైన అసంబద్ధమైన తప్పుడు కథనాలను ఇస్లామ్‌కు ముడిపెట్టి ఇస్లాంపై ముస్లిములపై బురదజల్లే నిరంతర ప్రయత్నం ఏ విధంగా చేస్తుందో వెనుకటి పేజీల్లో చర్చించాము. మీడియా అవలంబిస్తున్న ఈ

---

1. **The Declaration on the Relation of the church to non christian Religion (See Encounters Vol 5 No.2 September 1999)**

వైఖరి వెనుక ఉన్న కారణాల్లో కేవలం భౌతికమైనవి కొన్ని కాగా మరికొన్ని కారణాలు పాశ్చాత్య సంస్కృతీ ప్రయోజనాలకు, దాని సంప్రదాయాలకు సంబంధించినవి. వీటిలో ఏ ఒక్క కారణం కూడా ఇస్లాంకు ముస్లిములకు సంబంధించినది కాదు. మానవాళి ప్రయోజనాలకు లేదా మానవ విలువల ప్రోత్సాహానికి, పెంపుదలకు సంబంధించినవి కూడా కావు.

టెర్రరిజానికి సంబంధించి ఇస్లాం భావాలు స్పష్టంగా ఉన్నాయి. టెర్రరిజాన్ని లేదా దౌర్జన్యపరమైన అత్యాచారాలను యే విధంగానూ ఇస్లాం అనుమతించదు. ఇస్లాం ప్రకారం దౌర్జన్యానికి ప్రతీకారం చేసే హక్కు ఉంది. అయితే ఎంత దౌర్జన్యం జరిగిందో అంత మాత్రమే ప్రతీకారం. ఆ హద్దు దాటితే బాధితుడు దౌర్జన్యపరుడయి పోతాడు.

దివ్యఖుర్‌ఆన్‌లో –

"మీతో పోరాడే వారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి." **(అల్ బఖర : 190)**

మరో చోట –

"మీపై ఎవరన్నా దౌర్జన్యం జరిపితే మీరూ వారిపై అదే మేరకు చెయ్యిచేసుకోండి. అయితే అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి."

(అల్ బఖర : 194)

ఒక విషయం ఆలోచించవలసి ఉంటుంది. దౌర్జన్యాన్ని క్షమించండని ప్రబోధించే ధర్మంలో ఎలాంటి దౌర్జన్యానికయినా ఎలా అనుమతి లభిస్తుంది? అందువల్ల ఈ విషయమై ఇస్లాం భావాలు స్పష్టంగా ఉన్నాయి. టెర్రరిజం అన్నది ఒక వ్యక్తి ఒక సమూహంపై పాల్పడినా లేక ఒక సమూహం వ్యక్తులపై పాల్పడినా లేక రాజ్యం ప్రజలపై లేదా ప్రజలు రాజ్యానికి వ్యతిరేకంగా చేసినా, లేక మెజారిటీ మైనారిటీకి వ్యతిరేకంగా లేదా మైనారిటీ మెజారిటీపై జరిపినా ఏ రూపంలో ఉన్నా, ఎలాంటి వ్యక్తిగత, సామూహిక టెర్రరిజం అయినా ఇస్లాం దాన్ని అధర్మంగా, అక్రమంగా పరిగణిస్తుంది.

వ్యక్తుల హక్కులను పరిరక్షించే బాధ్యత ఇస్లాం ప్రభుత్వంపై మోపుతుంది.

మత, వర్గ విచక్షణ లేకుండా ప్రజల హక్కులు పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత. చివరకు, యుద్ధం చేస్తున్న శత్రుదేశ పౌరుడయినా రాజ్యంలోకి వచ్చి శరణు కోరితే అతడిని రక్షించడం కూడా ప్రభుత్వ బాధ్యత. రాజ్యంలోని ముస్లిమేతర పౌరుల రక్షణ, శరణు కోరిన పరాయిదేశ ముస్లిమేతర పౌరుల రక్షణ ప్రభుత్వ బాధ్యత అని దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా ప్రకటించింది. ఇది ఇస్లామీయ సంవిధానం లోని అంతర్భాగం.

ప్రస్తుత కాలంలో జరుగుతున్న హింసాహత్యాకాండలు టెర్రరిజంగా, సంస్కృతుల ఘర్షణగా, మతోన్మాదంగా పిలువబడుతున్న ఈ సంఘటనలను పరిశీలిస్తే ఇవి సాధారణంగా మూడు విధాలుగా కనబడతాయి.

1. నిర్దోషుల హత్య
2. ఒక చోట జరిగిన దౌర్జన్యాలకు గాను మరోచోట ఉన్న వ్యక్తులపై ప్రతీకారం తీర్చుకోవడం.
3. ప్రజల దృష్టిని మరల్చుకోవడానికి సంబంధం లేనివారిపై దౌర్జన్యాలు చేయడం.

ఇస్లాం వీటన్నింటినీ ధర్మ విరుద్ధంగా పరిగణిస్తుంది. ఈ మూడు రూపాలు, ఇలాంటి ఇతర చేష్టలు ఇస్లాం ప్రకారం దౌర్జన్యాలు అత్యాచారాల, అక్రమాల క్రింద పరిగణించబడతాయి.

నిర్దోషుల హత్య

అధర్మమయిన ఏ హత్యనయినా ఇస్లాం వ్యతిరేకిస్తుంది. ఇస్లాం దృష్టిలో ఒక వ్యక్తిని హతమార్చడం ప్రపంచ మానవాళిని హతమార్చడంతో సమానం.

దివ్యఖుర్‌ఆన్‌లో –

"హత్యకు బదులుగా గానీ, లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకు గాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే, ఒకే మానవుడి ప్రాణాలు కాపాడిన వాడు మొత్తం మానవుల ప్రాణాలు కాపాడినట్లే." **(అల్ మాయిద : 32)**

ఇస్లాం ప్రకారం ఒక వ్యక్తి రక్తం చిందడం యావత్తు మానవాళిని హత మార్చడంతో సమానం. ఇదే విధంగా ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడడం పూర్తి మానవాళిని రక్షించడంతో సమానం. కల్లోలం, అల్లర్లు, టెర్రరిజం ఈ చేష్టలలో మానవ ప్రాణాల పవిత్రత మంటగలుస్తుంది. అందువల్ల ఈ చేష్టలను ఇస్లామ్ హత్యలకన్నా తీవ్ర నేరాలుగా పేర్కొంటుంది. ఇస్లాం దృష్టిలో మూడు మహా పాపాలలో నిష్కారణంగా హత్యచేయడం కూడా ఒకటి.

ఒక హదీసు ప్రకారం – "దైవం దృష్టిలో అన్నింటికన్నా పెద్ద పాపం అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం, మానవ హత్య, తల్లిదండ్రులకు అవిధేయత చూపడం." (బుఖారి)

మరో హదీసులో – ఒక ముస్లిమును హతమార్చడం అల్లాహ్ దృష్టిలో ప్రపంచ మానవత దిగజారడం కన్నా తీవ్రమైనది.

హదీసులోని పదాలు – ప్రపంచం దిగజారిపోవడం అన్నది అల్లాహ్ దృష్టిలో ఒక ముస్లిమును హతమార్చడం కన్నా తేలిక అయినది. (తిర్మిజి)

ఇంకో హదీసు ప్రకారం – భూమ్యాకాశాలు కలిసి ఎవరన్నా విశ్వాసిని చంపితే అల్లాహ్ అందరినీ నరకంలో పడవేస్తాడు.

"హజ్రత్ అబూహురైరా ఉల్లేఖనం : దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా అన్నారు – ఆకాశం, భూమి కలిసి ఎవరన్నా విశ్వాసి హత్యలో పాలు పంచుకొంటే అల్లాహ్ వాటన్నింటినీ అగ్నిలో పారవేస్తాడు." (తిర్మిజి)

దివ్యఖుర్‌ఆన్‌లో ఇలాంటి అనేక ఆయతులున్నాయి, ఇంకా అసంఖ్యాకమైన హదీసు ఉల్లేఖనాలు ఉన్నాయి. ప్రాణహానికీ పాల్పడడం ఇస్లాంలో నిషిద్ధం అని వీటివల్ల రుజువు అవుతోంది. ఏ వ్యక్తికి అయినా, ఏ ధార్మిక, రాజకీయ విశ్వాసాలు గల వ్యక్తికి అయినా మరో వ్యక్తిని హత్య చేసే అధికారం లేదు. అలాగే యే ముఫ్తీ (ధర్మశాస్త్రవేత్త) ఇచ్చిన ఫత్వా అయినా, లేదా యే రాజకీయ నాయకుని అభిలాష నయినా హత్యకు ధర్మసమ్మతమైన కారణంగా భావించే వీలు లేదు. కేవలం ధర్మం, న్యాయం ప్రాతిపదికన మాత్రమే ప్రాణహానిని ఇస్లాం ధర్మసమ్మతం చేసింది.

దివ్యఖుర్ఆన్‌లో -

"అల్లాహ్ పవిత్రమైనదిగా నిర్ణయించిన ఏ ప్రాణాన్ని సత్యం ఆధారంగా తప్ప హతమార్చకండి." **(అల్ అన్ఆమ్ : 151)**

ఈ అధికారం - అంటే ధర్మం, న్యాయం ఆధారంగా ఒకరికి ప్రాణనష్టం కలిగించే అధికారం కేవలం ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఏ వ్యక్తికీ లేదా యే సంస్థకూ ఇలాంటి అధికారం లేదు. ప్రభుత్వం అయినా న్యాయస్థాన నిర్ణయం తర్వాతనే మరణ శిక్షను అమలు చేయగలుగుతుంది. న్యాయం, ధర్మం ఆధారంగా ప్రాణహాని అన్నది ఇస్లాంలో మూడు విధాలుగా మాత్రమే సాధ్యం.

ఒక హదీసు ప్రకారం: "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, నేను (ముహమ్మద్ (సఅసం), అల్లాహ్ ప్రవక్తనని సాక్ష్యం చెప్పే యే ముస్లిముని అయినా ఈ మూడు కారణాల వల్ల తప్ప హత్య చేయడం ధర్మసమ్మతం కాదు, 1) వివాహితుడు అయిన వ్యభిచారిని, 2) హత్యకు ప్రతీకారంగా, 3) ధర్మభ్రష్టుడై సముదాయానికి దూరమైన వాడిని (బుఖారి, ముస్లిం)

పైన పేర్కొన్న మూడు పరిస్థితులలో తప్ప మరే పరిస్థితిలోనూ ప్రాణహాని ధర్మసమ్మతం కాదు. ఈ మూడు పరిస్థితులలోనూ షరీఅత్ ఆదేశాన్ని అమలు చేసే హక్కు కేవలం ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఏ వ్యక్తికో లేదా ఏ సంస్థకో ఆ హక్కు లేదు. అంతేకాదు పైన పేర్కొన్న పరస్థితుల్లో యే వ్యక్తికయినా మరణ శిక్ష విధించే నిర్ణయం ప్రభుత్వం తనకు తానే తీసుకోవడానికి కుదరదు. ప్రభుత్వం కూడా న్యాయస్థానంలో నిందితునిపై కేసుపెట్టి విచారణ జరపాలి, న్యాయస్థానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తే ఆ శిక్షను ప్రభుత్వం అమలు చేస్తుంది. న్యాయస్థానం మరణశిక్ష విధించనట్లయితే ప్రభుత్వానికి కూడా ఆ వ్యక్తి ప్రాణాన్ని హరించే హక్కు లేదు.

"విచారణ సందర్భంగా కేసు విషయంలో అనుమానం ఏర్పడితే లేదా ప్రతీకారం విషయంలో హతుని వారసులు హత్యాపరిహారానికి అంగీకరిస్తే లేదా హంతకుని క్షమిస్తే అలాంటి పరిస్థితిలో ప్రాణాన్ని హరించే అనుమతి లేదు." (అబూదావూద్)

హంతకునికి మరణ శిక్ష అన్నది మానవ ప్రాణాన్ని హరించడమే అయినప్పటికీ అంతిమ పరిణామం రీత్యా ఇది మానవాళికి జీవనదాయకం. ఎందుకంటే సమాజంలో ఒక హంతకుని ఉనికి మొత్తం సమాజంలో శాంతికి, సమాజ పవిత్రతకు, దాని రక్షణకు భంగంగా రూపుదాల్చుతుంది. అందుకే దివ్యఖుర్ఆన్‌లో ప్రతీకారన్యాయాన్ని జీవనంగా పేర్కొనడం జరిగింది.

"ప్రతీకార న్యాయం మీ సమాజానికి ఊపిరి. ఈ శాసనోల్లంఘనానికి మీరు దూరంగా ఉంటారని ఆశించ బడుతోంది." (అల్ బఖర : 179)

హంతకునికి మరణశిక్ష ఫలితం రీత్యా సమాజానికి భద్రతనిస్తుంది. మానవ హక్కులంటూ అన్ని రకాల నేరస్తులకు నేరాలకు పాల్పడే స్వేచ్ఛనిచ్చే సమాజాలలో నేరాలకు అడ్డు అదుపు ఉండదు. అలాంటి సమాజంలో నేరాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా పెరుగుతున్నాయి. మానవ ప్రాణాల పవిత్రత మంటగలుస్తోంది.

దౌర్జన్యానికి దౌర్జన్యపరుని పట్ల ప్రతీకారం

ఒక ప్రాంతంలో జరిగిన దౌర్జన్యానికి మరో ప్రాంతంలో ప్రజలపై ప్రతీకారం తీర్చుకోవడం కూడా టెర్రరిజం, తీవ్రవాదాల పరిధిలోనిదే. ఇది కూడా అనేక రూపాలుగా ఉంటుంది. ఉదాహరణకు, ఒక ప్రాంతంలో ధార్మిక, భాషాపరమైన లేదా భౌగోళికమైన గుర్తింపు ఆధారంగా ఒక వర్గంపై మరో వర్గం దౌర్జన్యానికి పాల్పడడం. బాధిత వర్గం ఆ ప్రాంతంలో బలహీనంగా ఉంది, కాని మరో ప్రాంతంలో ఆ వర్గానికి చెందిన వారు బలంగా ఉండడం, దౌర్జన్యపర వర్గానికి చెందినవారు బలహీనంగా ఉండడం జరిగితే బాధిత వర్గానికి చెందినవారు ఎదుటి వర్గంపై ప్రతీకారానికి దిగడం ఇలాంటిదే. ఉదాహరణకు ఢిల్లీలో ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో హిందువులు సిక్కులపై హత్యాకాండ జరిపితే, ప్రతీకారంగా పంజాబ్‌లోని సిక్కులు హిందువులపై ప్రతీకారం తీర్చుకోవడం. లేదా అఫ్ఘనిస్తాన్‌లో విగ్రహాలు విధ్వంసం చేయబడ్డాయని భారత దేశంలో ముస్లిములపై ప్రతీకారం తీర్చుకోవడం ఉగ్రవాదమే అవుతుంది. ఈ విధంగా ఉగ్రవాదం అనేక రూపాల్లో ఉండొచ్చు. ఒకే ప్రాంతంలో అంతర్గతంగా జరుగొచ్చు. తమిళ జనాభా అధికంగా ఉన్నచోట్ల శ్రీలంక మూల వాసుల సమస్య అలాంటిదే. కశ్మీరులో హిందువుల

సమస్య కూడా అలాంటిదే. ఈ ఉగ్రవాదం అంతర్జాతీయమైనది కూడా కావచ్చు. ఇటీవల అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి జరిగినప్పుడు ఈ దాడికి పాల్పడిన అనుమానితుల్లో ఉసామా బిన్ లాదిన్ పేరు కూడా ఉంది. అందువల్ల అనేక క్రైస్తవ దేశాల్లో ముస్లిముల ధన ప్రాణాలపై, ఆస్తులపై ఆరాధానాలయాలపై దాడులు జరిగాయి. ఒక్క అమెరికాలోనే రెండు వందల యాభై దాడులు జరిగాయి. కెనాడా, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో కూడా ఇలాంటి దాడులు జరిగాయి. ఇలాంటి ఉగ్రవాదాలన్నింటినీ ఇస్లాం తీవ్రంగా ఖండిస్తుంది. దివ్యఖుర్‌ఆన్‌లో -

"బరువు మోసేవాడెవడూ ఇతరుల బరువును మోయడు." (అన్నజ్మ్ : 38)

ఇస్లాం ప్రకారం దౌర్జన్యానికి పాల్పడిన వారిపై మాత్రమే సమంగా ప్రతీకారం తీర్చుకోనే అధికారం ఉంది. ఈ హక్కు కూడా సర్వసాధారణమైంది కాదు. దౌర్జన్యపరుడిపై కాక, అతడితో మతపరంగా భాషాపరంగా, జాతిపరంగా సంబంధం ఉన్న ఇతరులపై ప్రతీకారం తీర్చుకొనే అనుమతి లేదు. ఇస్లామీయ షరిఅత్ యే వర్గానికి కూడా తోటి మనుషులపై అనవసరంగా దుర్మార్గం, దౌర్జన్యాలకు పాల్పడే హక్కును ఇవ్వదు. నిజానికి ఎలాంటి పరిస్థితుల్లో అయినా దుర్మార్గం దౌర్జన్యాలు ధర్మసమ్మతం కాదు. కేవలం ప్రతీకారం తీర్చుకునే హక్కు ఉంది. అదీ, దౌర్జన్యపరుడిపై మాత్రమే. అన్యాయం, అక్రమాలు ఏదో ఒక రూపంలో సదా కొనసాగుతూ వస్తున్నాయి. ప్రస్తుత కాలంలో ఇవి మరింత విస్తృతమయ్యాయి. మతం పేర, వర్ణం పేర, జాతి పేర, భాష పేర, ప్రాంతం పేర ఇలా అనేక విధాలుగా దౌర్జన్యాలు చెలరేగుతున్నాయి. అరబ్బుల్లో ఇస్లాంకు పూర్వం 'సార్' పేరిట ఈ దౌర్జన్యం కొనసాగేది. 'సార్' అంటే ఎవరైన ఒక వ్యక్తిని హత్య చేస్తే, హంతకుని తెగకు చెందిన యే వ్యక్తితోనయినా హతుని తెగకు చెందిన యే వ్యక్తి అయినా ప్రతీకారం తీర్చుకోగలిగేవాడు. ఈ విధంగా సాధారణంగా నిర్దోషులే హతమయ్యేవారు. దైవప్రవక్త (స) దీన్ని నిషేధించారు.

"అజ్ఞానం కాలం నాటి హత్యాప్రతీకారాలన్నీ నేడు రద్దయ్యాయి. మొట్టమొదట నా సొంత వంశానికి సంబంధించిన ప్రతీకారం నేను రద్దు చేస్తున్నాను. రబిఅ బిన్ హారిస్ కుమారుడు పాలుత్రాగే బిడ్డను బనీహుజేల్ చంపాడు. నేను దానిని క్షమిస్తున్నాను" అని ప్రకటించారు ప్రవక్త (స). (సీరత్ ఇబ్నె హష్షామ్)

'సార్' ను నిషేధించడం అంటే అర్థం, తెగపరమైన సంబంధం ఆధారంగా యే వ్యక్తినయినా నిష్కారణంగా హతమార్చడానికి వీలులేనట్లే. దేశపరమైన, జాతిపరమైన, భాషాపరమైన, ప్రాంతపరమైన, మతపరమైన సంబంధాల ఆధారంగా కూడా నిష్కారణంగా యే వ్యక్తినయినా హతమార్చడం ధర్మసమ్మతం కాదు. ఈ విషయమై దివ్యఖుర్ఆన్‌లోని రెండు ఆయతులు కూడా మరింతగా వివరణ ఇస్తున్నాయి. ఒక ఆయతులో: ఏదన్నా బహు దైవారాధిక జాతితో మీకు (ఇస్లామీయ రాజ్యానికి) ఒప్పందం కుదిరితే, ఆ బహుదైవారాధిక జాతి తన ప్రాంతంలోని ముస్లిములపై దౌర్జన్యాలకు పాల్పడగా, ఆ ముస్లిములు సహాయం కోరినప్పుడు కూడా ఒప్పందం కుదుర్చుకున్న ముస్లిములు ఒప్పందాన్ని భంగపరచి అక్కడి ముస్లిముల సహాయానికి వెళ్ళడం ధర్మసమ్మతం కాదు.

దివ్యఖుర్ఆన్ మాటల్లో:

> **"ఒకవేళ వారు ధర్మవ్యవహారాల్లో మీ సహాయం కోరితే వారికి సహాయం చేయడం మీ విద్యుక్త ధర్మం. కాని, మీరు ఒప్పందం కుదుర్చుకున్న జాతికి వ్యతిరేకంగా కాదు."** **(అల్ అన్ఫాల్:72)**

ఇక్కడ ఖుర్ఆన్ ఉద్దేశం ప్రకారం నిస్సందేహంగా మతం జాతీయతకు పునాది. ఆ విధంగా ముస్లిములందరూ ఒకే శరీరం వంటి వారే. కాని, ప్రపంచ వ్యవస్థను కాపాడడానికి, చేసుకొనే ఒప్పందాలు, నియమ నిబంధనలను ఈ జాతీయత కోసం ఉల్లంఘించడం కుదరదు. ముస్లిములు ఎక్కడైనా బాధితులుగా ఉంటే వారికి తప్పక సహాయపడాలి. కాని దౌర్జన్యం చేస్తున్న ప్రజలు ముస్లిముల రాజ్యంతో ఒప్పందం కుదుర్చుకొన్న వాళ్ళయితే, ఆ ఒప్పందం అమలులో ఉన్నంత కాలం బాధిత ముస్లిములకు సహాయపడడానికి వీలులేదు. ఇక్కడ సహాయం అంటే సైనికమైన, ఆయుధపరమైన సహాయం అని అర్థం అన్నది సుస్పష్టం. అలాంటి సహాయం కాకుండా , తమ తోటి మతస్తుల కోసం దైవాన్ని ప్రార్థించడం, దౌర్జన్యం చేస్తున్న వారితో చర్చలు సంప్రదింపులు జరిపి దౌర్జన్యాన్ని మాన్పించే ప్రయత్నం చేయడం, సాధ్యపడితే అక్కడి ముస్లిములను తమ ప్రాంతంలోకి రప్పించడం, లేదా అటువంటి నైతిక, భౌతిక సహాయం అందజేయడంలో తప్పులేదు. అలా చేయడం తప్పనిసరి కూడాను. ఒక హదీసు ప్రకారం:

"ఒప్పందం చేసుకున్న వారిని చంపినవాడు స్వర్గ సువాసనను కూడా ఆఘ్రాణించలేడు. నిజానికి స్వర్గ సువాసన సుదూరాన కూడా ఆఘ్రాణించవచ్చు" (బుఖారి)

ఇదే విధంగా 'జిమ్మి'ల (ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతర పౌరులు) ప్రాణ రక్షణ బాధ్యత కూడా విస్పష్టంగా ఉంది. హదీసు ప్రకారం:

"మన బాధ్యతలో ఉన్నవాని (జిమ్మి) రక్తం మన రక్తం వంటిదే, అతడి హత్యాపరిహారం మన రక్తహత్యాపరిహారం వంటిదే."

పై హదీసుల వల్ల స్పష్టమయ్యే వాస్తవం ఏమిటంటే, ఇస్లామీయ రాజ్యంలోని ఈ వ్యక్తులపై ఎలాంటి నేరారోపణ రుజువుకానట్లయితే కేవలం వారి మతసంబంధాల ఆధారంగా లేదా దేశంలోని నేరాల పేరిట ఈ వ్యక్తులకు ఎవ్వరూ ఎలాంటి నష్టమూ చేకూర్చడానికి వీలులేదు. ఇస్లామీయ చరిత్ర దీనికి ప్రస్ఫుట సాక్ష్యం. ముస్లిములతో పోరాడుతున్న జాతికి చెందిన ప్రజలు ముస్లిముల ప్రాంతాలలో నివసిస్తున్న వారికీ ముస్లిములు ఎన్నడూ నష్టం చేకూర్చలేదు. దీనికి అనేక నిదర్శనాలు ఉన్నాయి. ఉదాహరణకు ముస్లిముల సైన్యాలు సిరియా, ఈజిప్ట్‌లలోని క్రైస్తవులతో యుద్ధాల్లో మునిగి ఉన్నప్పుడు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ముస్లిముల పాలనలో ఉండేవారు. కాని వారిని ఎప్పుడూ ముట్టుకోలేదు. అలాగే క్రూసేడు యుద్ధాల సందర్భంగా కూడా పాలస్తీనా, సిరియా, తదితర దేశాలలోని క్రైస్తవులు ముస్లిములతో శాంతి క్షేమాలతో సహజీవనం చేశారు. యుద్ధం చేస్తున్న జాతి ప్రజల మతానికి చెందిన వారయిన కారణంగా వారిపై ఎలాంటి ఆగ్రహం వెలిబుచ్చడం జరుగలేదు.

ప్రజాభిప్రాయాన్ని ఆకర్షించడానికి దౌర్జన్యం

టెర్రరిజంలోని ఈ ప్రత్యేక రూపం ఆధునిక కాలానికి సంబంధించినది. వివిధ దేశాలలోని విభిన్న జాతులు సామూహిక ఒప్పందాల ద్వారా పరస్పర సహాయ సహకారాలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ చట్టాలు రూపుదిద్దుకొన్నాయి. అప్పుడు కొన్ని బలాధిక్యత గల జాతులు ఆయా ఒప్పందాల ద్వారా బలహీన జాతులకు అన్యాయం చేస్తున్న సమస్య పుట్టుకొచ్చింది. ఆ పరిస్థితిలో

బలహీన జాతులు తమ డిమాండ్లు సాధించడానికి, లేదా ప్రజల దృష్టిని తమ సమస్యల పట్ల ఆకర్షించడానికి ఈ పద్ధతిని అవలంబించాయి. ఈ పద్ధతిలో అమాయకుల హత్యలు, విమానాల అపహరణ, రాయబారుల హత్యలు, కిడ్నాపులు వగైరా అన్నీ చేరి ఉన్నాయి. ఇస్లాం వీటన్నింటినీ దౌర్జన్యాలుగా, ఉగ్రవాదాలుగా నిర్ణయిస్తుంది.

రాయబారులను హతమార్చడం నిషిద్ధం అని ఒక హదీసు స్పష్టంగా పేర్కొంది. దైవప్రవక్త (స) ఒక రాయబారితో, రాయబారులను హతమార్చడం ధర్మసమ్మతం అయి ఉంటే, నేను నిన్ను హతమార్చి ఉండేవాడిని అన్నారు. ఇస్లామీయ ధర్మశాస్త్ర నియమాల ప్రకారం యుద్ధ కాలంలోనూ రాయబారి వస్తే అతడికి పూర్తి రక్షణ కల్పించాలి. (జాదుల్ మాద్)

విమానాలను అపహరించడం, కిడ్నాపులు చేయడం ఈ రెండు కూడా చిత్రవధ (కత్లుస్సబ్ర్) వంటివే. హింసించి, హింసించి చంపడాన్ని ఇస్లాం పూర్తిగా నిషేధించింది. హదీసు ప్రకారం:

"కత్లుస్సబ్ర్‌ని ప్రవక్త (స) నిషేధించారు" (అబూదావూద్)

కత్లుస్సబ్ర్ అంటే, చిత్రవధ, హింసించి హింసించి మరీ చంపడం, ఇస్లాంకు పూర్వం అరబ్బుల్లో సర్వసాధారణమై ఉండేది. కొన్ని జాతుల్లో ఈ దురాచారం దీర్ఘకాలంగా కొనసాగుతూ వచ్చింది. కాని, ఇస్లాం పద్నాలుగు వందల సంవత్సరాల క్రితమే దీనిని నిషేధించింది. చివరకు జంతువులను హింసించడాన్ని కూడా వారించింది.

కిడ్నాపులు, జాతి నిర్మూలన వంటివి కూడా ఇలాంటివే. ఇక్కడ ఒక వాస్తవాన్ని తప్పక గమనించాలి. యుద్ధాలు అయినా, పోరాటాలు అయినా నియమనిబంధనలు లేకుండా లేవు. ఇస్లాంలో ఈ విషయమై కూడా నియమావళి స్పష్టంగా ఉంది. ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడుపడితే అప్పుడు, ఎవరిపైన అయినా సరే యుద్ధం చేయడానికి వీలులేదు. యుద్ధానికి స్పష్టమైన నియమనిబంధనలు ఉన్నాయి. వాటిని పాటించడం తప్పనిసరి.

ప్రాణహాని గురించి సైద్ధాంతిక విషయాలు పైన చర్చించాము. ఇది

అధర్మమైంది. కేవలం సత్యం న్యాయం ప్రాతిపదిక మాత్రమే ధర్మ సమ్మతమవుతుంది. అంటే ధర్మం అనేది హత్యాప్రతీకారంగానో లేదా యుద్ధం సందర్భాలలోనో సమ్మతమవుతుంది. అంటే హంతకునికి మరణశిక్ష, హత్యాప్రతీకారం, హంతకుడు ఇతరుల ప్రాణాల పవిత్రతను మంటగలిపి తనను హత్య చెయ్యడాన్ని న్యాయ సమ్మతం చేసుకొన్నాడు. ఇక యుద్ధం విషయానికి వస్తే కొన్ని షరతులతో ధర్మ సమ్మతం అవుతుంది. యధేచ్ఛగా యుద్ధానికి పూనుకోవడం ధర్మసమ్మతం కాదు. ఇందులో అన్నింటి కన్నా ముఖ్యమైన షరతు నాయకత్వ సంస్థాపన. నాయకుడు లేకుండా యుద్ధం ధర్మసమ్మతం కాదు. హదీసు ప్రకారం: "నాయకుడు డాలు వంటివాడు. అతడి వెనుకనే యుద్ధం జరగాలి." (ముస్లిమ్)

ధర్మవేత్తలు ఈ హదీసుకు వివరణ ఇలా ఇచ్చారు: "జిహాద్ విషయం నాయకుడిపై అతని అనువర్తనా శక్తిమీద ఆధారపడి ఉంటుంది."

నాయకుడు లేకుండా ఎవరైనా సరే తాముగా స్వయంగా ప్రపంచ లెక్కలు తేల్చుకొనే పనికి పూనుకోవడం, లేదా వ్యక్తుల ప్రాణాలను, స్వేచ్ఛను హరించడానికి పూనుకోవడం సత్యబోధన, ధర్మస్థాపన కాదు. ఇలా చేయడం కల్లోలాన్ని ఉపద్రవాన్ని సృష్టించడమే అవుతుంది.

నాయకుడికి యుద్ధానికి పూనుకొనే అధికారం, లేక ఎవరైనా వ్యక్తి పైన నేరం రుజువయితే అతడిని హతమార్చే అధికారం ఉన్నాయి. అయినప్పటికీ సంధి కుదిరిన తరువాత లేదా ఏదైనా బలమైన కారణం ఉంటేనే తప్ప నాయకుడికి అయినా సరే ప్రాణహానికి ఆదేశించే అధికారం ఉండదు.

దివ్యఖుర్ఆన్ ప్రకారం -

"కనుక మీరు ఈ అవిశ్వాసులతో తలపడినప్పుడు వారి మెడలు ఖండించడమే మీరు చేయవలసిన మొదటి పని. మీరు వారిని పూర్తిగా అణచి వేసిన తర్వాత ఖైదీలను గట్టిగా బంధించండి. ఆ తర్వాత (మీకు ఇలా చేసే అధికారం ఉంది) వారికి మేలయినా చేయండి లేదా వారి నుంచి పరిహారం తీసుకొని వదలి వేయండి. యుద్ధంలో తమ ఆయుధాలు క్రిందపడవేసే వరకు (ఇలా జరుగాలి)." (ముహమ్మద్ : 4)

ఈ ఆయతు ద్వారా తెలిసే విషయమేమిటంటే, యుద్ధం ముగిసిన తర్వాత ఎవరి ప్రాణం అయినా తీయడం ధర్మసమ్మతం కాదు. ఇబ్నె ఉమర్ (రజి) ఈ ఆయతు దృష్ట్యా హజ్జాజ్ బిన్ యూసుఫ్ ఆదేశాన్ని రద్దు చేశారు. ఆ ఆదేశంలో హజ్జాజ్ బిన్ యూసుఫ్ ఒక వ్యక్తికి మరణశిక్ష విధిస్తూ ఆదేశించారు.

(అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం-పేజి.231)

దివ్యఖుర్ఆన్‌లో మరో ఆయతు ప్రకారం:

"గ్రంథ ప్రజలలో అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించని వారితో, అల్లాహ్, ఆయన ప్రవక్త నిషిద్ధంగా నిర్ణయించిన దానిని నిషిద్ధంగా భావించనివారితో, ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోని వారితో యుద్ధం చేయండి. వారు స్వయంగా తమ చేతులతో జిజియా ఇచ్చేవరకు, లోబడి ఉండే వరకు (వారితో పోరాడండి)." (తౌబా : 29)

ఈ ఆయతులో శత్రువులు లోబడి జిజియా చెల్లించడానికి సిద్ధమవ్వడాన్ని యుద్ధ సమాప్తి ప్రకటనగా పేర్కొనడం జరిగింది. ఎందుకంటే జిజియా చెల్లించిన తర్వాత శత్రువును చంపడం నిషిద్ధం. హజ్రత్ అలీ (రజి) ఈ విషయమై ఇలా వ్యాఖ్యానించారు:

"వాళ్ళు తమ సంపద మా సంపదలా (భద్రం) అయిపోవాలని, తమ రక్తం మా రక్తంలా (పవిత్రం) అయిపోవాలని జిజియా చెల్లించారు."

తౌబా సూరాలోని పై ఆయతును విశదీకరిస్తూ అల్లామా కాషానీ ఇలా రాశారు:

"జిజియాకు అంగీకరించే వరకు అల్లాహ్ యుద్ధాన్ని అనుమతించారు. అనుమతి ముగిసిన తక్షణం ప్రాణపవిత్రత పునస్థాపితమవుతుంది."

ఒక ఆయతులో-

"ఒకవేళ అతడు (హతుడు) మీతో ఒడంబడిక చేసుకొన్న ముస్లిమేతర జాతికి చెందిన వాడయితే అతని వారసులకు హత్యాపరిహారాన్ని చెల్లించాలి. ఇంకా ఒక ముస్లిం బానిసను విడుదల చేయాలి." (అన్నిసా : 92)

ఈ ఆయత్ ప్రకారం ఒప్పందంలో ఉన్న జాతి వారినెవరినయినా హత మార్చితే హత్యాపరిహారం తప్పనిసరి అవుతుంది. పైగా ఒక బానిసకు స్వేచ్ఛనీయ వలసి ఉంటుంది. దీనికి కారణం, అతడు దైవాదేశం రీత్యా ధర్మసమ్మతం కాని విధంగా ఒక వ్యక్తి ప్రాణాలు తీశాడు. హతుడు తమతో యుద్ధం చేసిన జాతి వాడయినప్పటికీ, అవిశ్వాసి అయినప్పటికీ, ఇప్పుడు ఒప్పందం తర్వాత అతడి ప్రాణాలు, ముస్లిముల ప్రాణాల మాదిరిగానే పవిత్రమైనవి. అతడి ప్రాణాలు తీయడం ఒప్పందం వల్ల సంక్రమించిన ఆ పవిత్ర తను మంటగలుపడం అవుతుంది. అందువల్ల ఈ నేరానికి శిక్ష తప్పదు. ఇమామే రజీ ఈ సందర్భంలో ఒక అంశం ఆవిష్కరించారు. ఆ వ్యక్తి మరో వ్యక్తిని చంపినందు వల్ల, హత్యకు బదులుగా అతడిపై హత్యాపరిహారం తప్పనిసరి అవుతుంది. అతడు ఒప్పందంలో ఉన్న జాతి వ్యక్తిని చంపాడు. అంటే, అల్లాహ్ నిషేధించిన పని చేశాడు. అందువల్ల అతడు ఒక విశ్వాసి అయిన బానిసను విడుదల కూడా చేయవలసి ఉంటుంది. సంధి ఒప్పందం అమలులోకి వచ్చిన వెంటనే మానవ ప్రాణాల పవిత్రత పునః స్థాపితమవుతుంది. యుద్ధం సందర్భంగా న్యాయసమ్మతమైన ప్రాణహాని మరలా నిషిద్ధమవుతుంది. పాలకుడి ఉన్నతాధికారుల అభిలాష కోరికలు కూడా దీనిని మరలా న్యాయసమ్మతం చేయలేవు. ఇది యుద్ధానికి సంబంధించిన పరిస్థితి. ఇస్లాం వ్యక్తులకు కూడా ఆత్మరక్షణ హక్కు ఇచ్చింది. ఒక వ్యక్తిపై మరో వ్యక్తి లేదా వర్గం దౌర్జన్యానికి పాల్పడటం కూడా పోరాటానికి ఒక రూపం. ఆ పరిస్థితిలో ఆ వ్యక్తికి తన ప్రాణాలను రక్షించుకొనే లేదా మానమర్యాదలను పరిరక్షించుకొనే అధికారం ఉంది. కొన్ని సందర్భాలలో ఈ హక్కులు వదులుకోవలసి ఉంటుంది. ఒక వ్యక్తి దాడులకు గురవుతున్నంత కాలం అతనికి ఈ హక్కు ఉంటుంది. ప్రాణ రక్షణకు ఎంతవరకు అవసరమో ఆ మేరకే ఈ హక్కు ఉంటుంది. ఈ సందర్భంగా దౌర్జన్యపరుడు హతమైనప్పటికీ ఆ హత్య ధర్మసమ్మతమే. దౌర్జన్యపరుడు దాడికి దిగినప్పుడు అతనికి ప్రతిగా ఆత్మరక్షణ హక్కు ఉంటుంది. కాని, దౌర్జన్యపరుడు హింసాదౌర్జన్యాలు మానుకొంటే, లేదా ఎవరైనా మూడవ వ్యక్తి కల్పించుకొని హింసా దౌర్జన్యాలను ఆపివేస్తే ఈ రక్షణ హక్కు అంతమవుతుంది.

పై వివరణల ద్వారా తెలిసే విషయమేమిటంటే ప్రాణహాని అన్నది యుద్ధా

లలో యుద్ధం చేసే వర్గంతో లేదా ఆత్మరక్షణ సందర్భంగా మాత్రమే ధర్మసమ్మతం. అంటే హతుడు యుద్ధం చేస్తున్న (**Belligerent**) వారిలోని వాడయినప్పటి పరిస్థితి ఇది. అలా కానట్లయితే ఆ ప్రాణహాని ధర్మసమ్మతం కాదు.

"ప్రవక్త (స) స్త్రీలను, పిల్లలను చంపడాన్ని నిషేధించారు." (తిర్మిజి)

"బాలలను, క్రుశించిపోయిన వృద్ధులను, చంపరాదు."

మూడవ హదీసులో: "వృద్ధులు, బలహీనులు, బాలలు, శిశువులు, స్త్రీలను హతమార్చరాదు" అన్నారు ప్రవక్త (స). (అబూదావూద్)

ఇలాంటి హదీసులు ఇంకా చాలా ఉన్నాయి. ఈ హదీసుల వల్ల తెలుస్తున్న దేమంటే, "యుద్ధంలోనూ యుద్ధానికి దూరంగా ఉన్న వారిపై చెయ్యి చేసుకోవడం తగదు." (వహబ జహేలీ, ఆసారుల్ హరబ్ ఫిల్ ఇస్లామ్)

ఈ విషయమై దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది:

"అదే విధంగా మీ వద్దకు వచ్చి యుద్ధం పట్ల విముఖతను వ్యక్తం చేసి మీతోగాని, లేదా స్వజాతి వారితోగాని యుద్ధం చేయడానికి ఇష్టపడని కపటులకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. అల్లాహ్ గనుక సంక ల్పించి ఉంటే వారికి మీపై ఆధిక్యాన్ని ఇచ్చి ఉండేవాడు. నిశ్చయంగా వారు మీతో పోరాడి ఉండేవారే. కాబట్టి వారు మీ నుంచి వైదొలిగిపోతే, యుద్ధం చేయడం మానివేస్తే, సంధి కొరకు శాంతి కొరకు చేయి జాపితే అప్పుడు వారిపై దాడి చేయడానికి అల్లాహ్ మీకు యే కారణాన్ని వదలలేదు." (అన్నిసా-90)

దివ్యఖుర్ఆన్‌లోని ఈ ఆయత్ ద్వారా స్పష్టంగా తెలుస్తున్న విషయమేమి టంటే, యుద్ధంతో సంబంధంలేని, నిష్పక్షపాతంగా ఉండే వారిపైన ఏ విధంగానూ సరే హింసాదౌర్జన్యాలకు పాల్పడడం ఇస్లాంలో ధర్మసమ్మతం కాదు. టెర్రరిజానికి సంబంధించి పైన పేర్కొన్న రూపాలే కాక మరికొన్ని ఇతర రూపాలు కూడా నేడు అమలులో ఉన్నాయి. చరిత్రలో ఇలాంటి కొన్ని టెర్రరిస్టుల చేష్టల దృష్టాంతాలు మాత్రమే కనబడతాయి. ఉదాహరణకు దహనకాండ, దోపిళ్ళు, నరసంహారం, బాంబుప్రేలుళ్ళు వినాశం సృష్టించడం, లాకప్ మరణాలు, హతుల చిత్రవధ,

పరాజితుల పట్ల క్రూరంగా వ్యవహరించడం, జాతి నిర్మూలన, ధార్మిక నేతలపై దౌర్జన్యాలు వగైరా. వీటన్నింటినీ ఇస్లాం నిషేధించింది.

దహనకాండ

దహనకాండకు ఇస్లాం ముమ్మాటికీ అనుమతి ఈయదు. యుద్ధ సమయం లోనూ దీనికి అనుమతి లేదు. సాధారణంగా సమాజంలో దహనకాండను సృష్టించడం వంటి సంఘటనలు ఇస్లామీయ షరిఅత్‌కు వ్యతిరేకమైనవి. ఇవి కల్లోలం వంటి చర్యలు. నిప్పుపెట్టి ఎవరినయినా సరే చంపడం ధర్మసమ్మతం కానేకాదు. హదీసుల ప్రకారం అగ్ని శిక్షను విధించే అధికారం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ లేదు. (అబూదావూద్)

ఈ హదీసు కూడా యుద్ధ సమయానికి సంబంధించినది. యుద్ధ సమయంలో కూడా దహనకాండ నిషిద్ధం అయినప్పుడు, సాధారణ పరిస్థితులలో ఈ చేష్ట మరింత ఆసహనీయమైపోతుంది.

దోపిడి

ఇస్లామీయ షరిఅత్‌లో దోపిళ్ళు, నిషిద్ధం. యుద్ధ సమయంలో అయినా సరే న్యాయసమ్మతం కానటువంటి చేష్టల్లో ఇదీ ఒకటి. సాధారణ పరిస్థితుల్లో ఇది మరింత ఖండించదగ్గ చేష్ట.

ఓసారి కొందరు ముస్లిములు యూదుల వద్ద నుంచి ఆహార పదార్థాలను బలవంతంగా తీసుకొన్నారు. ప్రవక్త ముహమ్మద్ (స) కు ఈ విషయం తెలిసింది. ఆయన తీవ్రంగా ఆగ్రహించారు. ఇలాంటి చేష్టలు నిషిద్ధమని పేర్కొన్నారు. (అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం పేజి 226) బుఖారి షరీఫ్ హదీసు గ్రంథంలోని జిహాద్ అధ్యాయంలో ఒక కథనం ఉంది. ముస్లిములు కొన్ని మేకలను వాటి యజమానుల అనుమతి లేకుండానే జిబహ్ చేసుకున్నారు. ప్రవక్త (స) కు ఈ విషయం తెలిసి చాలా ఆగ్రహించారు. ఆ మాంసం అంతా పారవేశారు. (అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం పేజి 227). ఇలాంటి హదీసులు ఇంకా చాలా ఉన్నాయి. (అబూదావూద్). దోపిడి ఇస్లామీయ షరిఅత్‌కు వ్యతిరేకమని ఈ హదీసులు చాటి చెబుతున్నాయి. ఫికహ్ (ధర్మశాస్త్ర) గ్రంథాలలోనూ దోపిడీని కఠినంగా నిషేధించే ఆదేశాలు ఉన్నాయి.

లాకప్ మరణాలు

లాకప్ మరణాలు లేదా Custodial deaths కూడా ఇస్లాంలో నిషిద్ధం. ఖైదీలకు అన్నం పెట్టడం అల్లాహ్‌ను సంతోషపెట్టడంగా ఖుర్ఆన్ పేర్కొన్నది. విశ్వాసుల సుగుణాలను ప్రస్తావిస్తూ దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొన్నది:

"అల్లాహ్ పట్ల ప్రేమతో పేదలకు, అనాథలకు, ఖైదీలకు అన్నం పెట్టే వారు..." **(అద్దహ్ర్ : 8)**

లాకప్ మరణాల నిషేధాన్ని వివరించే ఉమవీ ఖలీఫాల కాలంలోని ఓ సంఘటన ఇక్కడ ప్రస్తావించదగింది. అప్పటి ప్రముఖ పాలకుడు, ఇరాక్ గవర్నర్ హజాజ్ బిన్ యూసుఫ్ ఒక ఖైదీని హతమార్చవలసినదిగా ప్రవక్త (స) సహచరులలో ఒకరైన అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)ని ఆదేశించారు. అప్పుడు అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఇలా బదులిచ్చారు.

"మనకు ఇలాంటి ఆదేశం లేదు. దైవాదేశం ఏమిటంటే, యుద్ధం ముగిసిన తర్వాత ఖైదీలను నిర్బంధించాలి. ఆ తర్వాత దయ చూపవచ్చు లేదా ఫిదియా తీసుకొని వదిలేయవచ్చు."

ఖైదీల పట్ల మంచిగా వ్యవహరించాలన్న ఆదేశం మరో హదీసులో ఇలా ఉంది : "ఖైదీల పట్ల మంచిగా మెలగండి".

ఇస్లాంలోని ఈ ఆదేశాలు సాధారణంగా యుద్ధ ఖైదీలకు సంబంధించినవి. యుద్ధ ఖైదీలేకాక ఇతర ఖైదీల పట్ల కూడా మంచి వ్యవహార శైలి అవసరం. సాధారణ నేరస్తుడిని నిజానికి చట్టానికి అప్పగించవలసి ఉంటుంది. అతడిని శిక్షించే లేదా విడిచిపెట్టే అధికారం చట్టాలకు ఉంది. పోలీసుల కస్టడీలో, లేదా మరో ప్రభుత్వ సంస్థ కస్టడీలో అతడిని ఒక అప్పగింతగా ఉంచడం జరుగుతుంది. అతడిని రక్షించడం ప్రభుత్వ బాధ్యత.

క్రూర వ్యవహార శైలి

క్రూర వ్యవహార శైలి కూడా ఒక విధమైన టెర్రరిజమే. యుద్ధం చేస్తున్న జాతి వారిపైగాని లేదా శాంతియుత పౌరులపైగాని క్రూర వ్యవహార శైలి కల్లోలాన్ని

రేకెత్తిస్తుంది, శాంతిభద్రతలు భగ్నం అవుతాయి. పంటలను నాశనం చేయడం, జాతి నిర్మూలనకు తెగబడడం, నిర్దోషులను హతమార్చడం, పళ్ళ చెట్లను నరికి వేయడం, ఆరాధానాలయాలు కూల్చడం, దహనకాండకు పాల్పడడం వగైరా అన్నీ ఈ కోవలోకే వస్తాయి. దివ్యఖుర్‌ఆన్ వీటన్నింటిని ధర్మవిరుద్ధంగా ప్రకటించింది.

"అతడికి అధికారం లభించినప్పుడు అతడు లోకంలో కల్లోల వ్యాప్తికి, పంట పొలాల విధ్వంసానికి, మానవ సంతతి వినాశానికి నిత్యం కృషి చేస్తాడు. నిజానికి అల్లాహ్ కల్లోలాన్ని ఏ మాత్రం సహించడు."

(అల్ బఖర : 205)

పంటలను నాశనం చేయడం, ఆరాధనాలయాలను ధ్వంసం చేయడం, జంతువులను చంపడం, పండ్ల చెట్లను నరకడం వగైరా చేష్టలన్ని ముస్లిములకు నిషిద్ధం చేయడం జరిగింది. ఈ ఆదేశం యుద్ధ సమయంలోనిది, సాధారణ పరిస్థితుల్లోనయితే ఈ విధంగా కల్లోలాన్ని రేకెత్తించడం అత్యంత నీచమైన నేరం. దివ్యఖుర్‌ఆన్ ఈ విషయమై ఇలా పేర్కొంది:"కల్లోలం అన్నది హత్య కన్నా తీవ్ర తరమైనది."

హతుల చిత్రవధ

మానవ ప్రాణాల హత్యను ఇస్లాం నిషేధించింది. అయినప్పటికీ యుద్ధ సమయంలో ప్రాణహాని అనివార్యం అవుతుంది. అక్కడ అనుమతి ఉంది. అయితే ఇస్లాం హతుల మాన మర్యాదలకు రక్షణ కల్పిస్తుంది. విజయగర్వంతో సాధారణంగా విజేతలు మానవత్వాన్ని మరచిపోతారు. యుద్ధ మైదానంలోని హతుల శరీరాలు కూడా దౌర్జన్యానికి గురవుతాయి. హతుల శరీరాలను అగౌరవపరచరాదని ఇస్లాం ఆదేశించింది. వారిని చిత్రవధ చేయరాదని వారించింది. ఒక హదీసులో ఇలా ఉంది:

"హతుల చిత్ర వధకు పాల్పడకండి, పిల్లవానిని చంపరాదు" (తిర్మిజి)

మరో హదీసులోనూ ఇలాంటి పదాలు ఉన్నాయి (అబూదావూద్). ఈ విషయాన్ని ధర్మవేత్తలు విశదీకరిస్తూ యుద్ధంలో హతుల చిత్రవధ చేయడం ధర్మ విరుద్ధమని తెలిపారు. **(వహబ్ జహేలీ అనారుల్ హరబ్ ఫిల్ ఇస్లాం - 143)**

అపహరణలు

సమస్యతో సంబంధం ఉన్న వ్యక్తులను గానీ, లేదా ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని గాని మోసంతో నిర్బంధించడం అపహరణ, కిడ్నాప్ అనబడుతుంది. ఇస్లాం దృష్టిలో ఇది తప్పు. ఏ వ్యక్తి స్వేచ్ఛనయినా హరించే హక్కు మరే వ్యక్తికీ లేదు. నిజంగా ఇది దొంగతనం, దోపిడి వంటి నేరం. దోపిడిలో దొంగ ఇతరుల సంపదను దోచుకుంటాడు. అపహరణలో ఇతరుల స్వేచ్ఛను దోచుకుంటాడు.

నేటి కాలంలో అపహరణలు, కిడ్నాపుల సంఘటనలు ఎక్కువయ్యాయి. న్యాయమైన లక్ష్యాల పేరిట కూడా ఈ సంఘటనలు జరుగుతున్నాయి. అందువల్ల అల్లామ యూసుఫుల్ ఖర్జావీ ఈ సమస్యను క్షుణ్ణంగా చర్చిస్తూ ఎలాంటి మంచి ఉద్దేశ్యంతో చేసింది అయినాసరే అపహరణ అన్నది ముమ్మాటికి ధర్మ విరుద్ధం అన్నారు.

ఆత్మాహుతి దళాలు

నేటి కాలంలో మరో ముఖ్యమైన సంక్లిష్టమైన సమస్య ఆత్మాహుతి దాడులది. అపార విధ్వంసాన్ని సృష్టించే ఆయుధాలు లోగడ ఉండేవి కావు. ఒక వ్యక్తి ప్రాణాలకు తెగించి ఇతరులు అనేక మందిని మృత్యు గుహ్వారంలో తోయగలడు నేడు. ప్రాచీన కాలంలో ఇలాంటి అవకాశం ఉండేది కాదు. అందువల్ల ప్రాచీన కాలంలో ఆత్మాహుతి దళాలు, ఆత్మాహుతి చేసుకొనే వ్యక్తుల ప్రస్తావన అంతగా కనబడదు. ఆత్మహత్య నిజానికి పూర్తిగా ధర్మ విరుద్ధమైనది. ఆత్మహత్యను తీవ్రంగా ఖండించే హదీసులు అనేకం ఉన్నాయి. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి నరకవాసి అని పేర్కొనడం జరిగింది. పరిస్థితుల పట్ల నిరాశ చెంది ఆత్మ హత్యలకు పాల్పడే వ్యక్తుల్లో అనేక రకాల వారున్నారు. కొందరు సరయిన ఆలోచనా విధానం లేక ఎటూ పాలుపోక ఇలాంటి పనికి పాల్పడే వారున్నారు. ఇలాంటి వారు ఒక్కోసారి తాము ఆత్మహత్యలకు పాల్పడి అనేక మంది ఇతరులను కూడా తమతో పాటు చంపుతారు. అభివృద్ధి చెందిన దేశాలలో ఇలాంటి వారు కనబడతారు. ఇలాంటి వారు చేసిన దాడుల వార్తలు పత్రికల్లో కనబడుతుంటాయి. వీళ్ళు చేసే

పని అత్యంత దుర్మార్గం. ఏ మతం, యే చట్టం కూడా ఇలాంటి దుర్మార్గాన్ని అనుమతించదు.

ఆత్మాహుతి దళాలు లేదా వ్యక్తుల్లో మరో రకం, పెద్ద పెద్ద ఆదర్శాలు, లక్ష్యాల కోసం – ఆ లక్ష్యాలు మంచివి కావచ్చు, చెడ్డవి కావచ్చు – ఆత్మాహుతులకు పాల్పడుతుంటారు. ఈ పద్ధతులు పాటించేవారిలో కూడా మనకు మూడు వర్గాలు కనబడతాయి. టెర్రరిస్టు సంస్థలు, ప్రభుత్వాలు, స్వాతంత్ర్య ఉద్యమాలు.

టెర్రరిస్టు సంస్థలకు బలప్రయోగం విషయంలో నైతికమైన న్యాయపరమైన ఏ కారణమూ ఉండదు. అందువల్ల వారి ఏ చర్యనైనా మరే సాయుధ కార్య కలాపాలనయినా న్యాయ సమ్మతమని చెప్పలేము. ఉదాహరణకు తమిళ తీవ్ర వాదులు శ్రీలంక ప్రభుత్వంపై సాయుధ పోరాటం చేస్తున్నారు, ఆత్మాహుతి దాడులకు కూడా పాల్పడుతున్నారు. ఇంకా చెప్పాలంటే నేడు ప్రపంచంలో అత్యధికంగా ఆత్మాహుతి దాడులకు పాల్పడుతున్నది తమిళ తిరుగుబాటుదారులే. ఇలాంటి దాడులకు ఏ విధంగానూ న్యాయ సమ్మతి లేదు. ప్రభుత్వం విషయానికి వస్తే, యుద్ధకాలంలో ఏదైనా భయానక దాడిని నిరోధించడానికి ఆత్మాహుతి దళాలను ఉపయోగించవచ్చు. దీనికి సంబంధించిన వివరాలు తర్వాత చర్చిద్దాం.

ఇక మూడవది, అన్నింటికన్నా సంక్లిష్టమైనది, స్వాతంత్ర్య ఉద్యమాలలో ఆత్మాహుతి దళాలు. స్వాతంత్ర్య ఉద్యమం అంటే భావం, ఒక దౌర్జన్యకర శక్తి ఏదైనా ప్రాంతాన్ని బలవంతాన ఆక్రమించుకొన్నప్పుడు స్థానిక ప్రజలు దురాక్రమణ నుంచి విముక్తి పొందాలని అభిలషించడం అన్న మాట. ఇలాంటి ఉద్యమాలు ఈమధ్యనే అనేక దేశాల్లో వెలిశాయి. కాని నేడు చాలా దేశాలు స్వతంత్ర దేశాలే. సాధారణంగా ఆ దేశాల్లో స్థానిక ప్రజల ప్రభుత్వాలే పని చేస్తున్నాయి. పాలస్తీనాను తీసుకొంటే, అక్కడ స్వాతంత్ర్య ఉద్యమం నడుస్తోంది. మధ్యాసియాలో అతి ముఖ్యమైన సమస్య ఇది. ఇస్రాయీల్ అన్ని విధాల దౌర్జన్యాలు, అత్యాచారాలు, ఉగ్రవాదం, టెర్రరిజానికి పాల్పడుతోంది. పైగా పాశ్చాత్య దేశాలు ఇస్రాయీల్ హింసా దౌర్జన్యాల పట్ల మౌనం వహించడం వల్ల ఇస్రాయీల్ మరింత పేట్రేగి పోతోంది. అనుదినం పాలస్తీనా స్థానిక ప్రజలైన ముస్లిములు, క్రైస్తవులపై ఏదో

ఒక టెర్రరిస్టు కార్యానికి అవి పాల్పడుతూ వస్తోంది. పాలస్తీనా యువకులు ఇస్రాయిల్‌పై ఆత్మాహుతి దళాలతో దాడులు చేసే విధానాన్ని అవలంబిస్తున్నారు. అయితే ఇలాంటి ఆత్మాహుతి దాడులు ఏ రూపంలో అయినా సరే ధర్మసమ్మతమా అన్నది ప్రశ్న. ఖుర్‌ఆన్ ఆయతుల వల్ల తెలిసేదేమిటంటే యుద్ధం చేస్తున్న జాతికి వ్యతిరేకంగా ఈ పద్ధతి పాటించవచ్చు. ఈ చర్యను ఆత్మహత్యలుగా పరిగణించడం జరుగదు. వీరోచిత కృత్యాలుగా పరిగణించడం జరుగుతుంది. ప్రాచీన కాలంలో ప్రాణాలకు తెగించి దాడులు జరిపేవారు. ఇలాంటి దాడులకు తెగించి వారు చివరకు ప్రాణాలు కోల్పోతారని అందరికీ తెలుసు. సాధారణంగా అదే జరిగేది కూడా. అయినా ఇలాంటి దాడులకు అనుమతి ఉంది. నేటి ఆత్మాహుతి దళాల దాడులను కూడా ప్రాచీన కాలంలో జరిగిన దాడులుగానే పరిగణించి ధర్మ సమ్మతంగా పేర్కొనడం జరుగుతోంది. ప్రాణాలకు తెగించి జరిపే దాడుల ప్రత్యేకతలు ఇవి:

సహీహ్ ముస్లిమ్ ప్రకారం: ఉహద్ యుద్ధంలో ప్రవక్త ముహమ్మద్ (స)ను శత్రువులు చుట్టుముట్టినప్పుడు ఆయనతోపాటు ఏడుగురు అన్సారీలు, ఇద్దరు ఖురైషులు ఉన్నారు. ప్రవక్త (స) వారితో: "ఈ అవిశ్వాసులను మా నుంచి తొలగించినవారు స్వర్గంలో నాతోపాటు ఉంటారు" అన్నారు. తక్షణం ఒక అన్సారీ ముందుకొచ్చి అవిశ్వాసులను ఎదుర్కొంటూ అమరగతులయ్యారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు ఏడుగురు అన్సారీలు అమరగతులయ్యారు. (సహీహ్ ముస్లిం)

ఈ భావం కలిగిన హదీసులు ఇంకా చాలా ఉన్నాయి. చరిత్రలో అనేక సందర్భాలలో ముస్లిములు ప్రాణాలకు తెగించి దాడులు జరిపిన ఉదాహరణలు ఉన్నాయి. నూటికి నూరు శాతం మరణం ఖాయంగా కనిపించే దాడులు చేసిన ఉదాహరణలు ఉన్నాయి. ఉదాహరణకు 'యమామా' యుద్ధంలో హజ్రత్ బిరా బిన్ ఆజిబ్ చేసిన దాడి. ఆయన ఒంటరిగా 'యమామ' శత్రువర్గంలోకి జొరబడి ప్రాణత్యాగం చేశారు. ఈరాన్ సైన్యంలోని ఏనుగులపై దాడి ఇలాంటిదే. ఒక సంఘటన కాన్‌స్టాంటినోపుల్ పై దాడి సందర్భంగా జరిగింది. ఒక ముస్లిం ముందుకురికి దాడి చేసినప్పుడు అతన్ని కొందరు ప్రవక్త (స) సహచరులు నిలువరించి క్రింది ఆయత్ చదివి వినిపించారు.

"మీరు చేతులారా మీ నాశనాన్ని కొనితెచ్చుకోకండి." అయితే హజ్రత్ అబు అయ్యూబ్ అన్సారి ఆ ఆయత్ భావం వారనుకొన్నది కాదని వివరించారు. (ఇబ్నె కసీర్) ఖుర్ఆన్, హదీసుల ఈ సాక్ష్యాధారాల దృష్ట్యా ధర్మవేత్తలు ఇలాంటి దాడులకు అనుమతి ఇచ్చారు. వీటిలో నూటికి నూరు శాతం మరణం ఖాయమే. ఉదాహరణకు ఇమామ్ ముహమ్మద్ రహ్మతుల్లా అలైహ్ తన పుస్తకం 'అస్సీరుల్ కబీర్'లో ఇలా రాశారు. "ఒంటరి వ్యక్తి వేయి మంది శత్రువుల గుంపుపై దాడి చేస్తే, అందులో అభ్యంతరం యేదీలేదు. అయితే, దాడిచేసి బయటపడగలనని లేదా శత్రువులకు తీవ్ర నష్టం కలుగజేసిన తర్వాతనే గాని మరణించనన్న విశ్వాసం అతడిలో ఉండాలి. అలాకాక శత్రువుకు తాను ఎలాంటి నష్టం కలుగజేయలేనని అతడు భావిస్తే, నా అభిప్రాయం ప్రకారం దాడి చేయకపోవడమే మంచిది."

('అసీరుల్ కబీర్' అల్లమా ఇమామ్ ముహమ్మద్)

ఇలాంటి అభిప్రాయాన్నే ఇబ్నె తైమియా కూడా వెలిబుచ్చారు.

"ముస్లిములు, తమ ప్రాణాలు పోతాయని నమ్మకంగా తెలుస్తున్నప్పటికీ అవిశ్వాసుల పంక్తుల్లో దూసుకుపోవడానికి ప్రముఖ ధర్మశాస్త్రవేత్తలు నలుగురూ అనుమతి ఇచ్చారు." (అబూదావూద్)

మీరు చేతులారా మీ వినాశాన్ని కొని తెచ్చుకోకండి అనే ఖుర్ఆన్ ఆయత్ క్రింద ప్రాణాలకు తెగించి జరిపే దాడులకు ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అందరూ ధర్మసమ్మతంగానే పరిగణించారు.

(ఇబ్నె కసీర్-228/229, అహ్కాములు ఖుర్ఆన్ 261-263, ఖర్తబీ 362-363)

ప్రఖ్యాత ఆధునిక ఇస్లామీయ ధర్మవేత్త యూసుఫ్ అలి ఖర్జావీ అభిప్రాయం కూడా ఇదే. ఆత్మాహుతి దాడులు నిజానికి ప్రాణాలకు తెగించి యోధులు జరిపే దాడులు. అందువల్ల ధర్మసమ్మతం. (యూసుఫ్ అలీ ఖర్జావీ వ్యాసం, "ఫలస్తీనుల్ ముస్లిమా" సెప్టెంబర్ 1996లో ప్రచురితమయ్యింది. దీనిని ప్రొఫెసర్ సౌదుర్రహ్మాన్ ఖాన్ నద్వీ ఉర్దూలో అనువదించారు. 'జిందగీ నవ్' మార్చి 1998లో ఇది ప్రచురిత మయ్యింది.)

అయితే ఆత్మాహుతి దాడులకు సంబంధించి ముఖ్యంగా దృష్టిలో ఉండ వలసిన అంశాలు : ఈ దాడులు ప్రభుత్వం తరఫున యుద్ధరంగంలో లేదా ఏదన్నా

దేశంలో దురాక్రమణదారులపై ప్రజలు సాగించే స్వాతంత్ర్య ఉద్యమంలో మాత్రమే వీటికి అనుమతి ఉంది. వేర్పాటువాద శక్తులకు ఇలాంటి అనుమతి లేదు. యుద్ధం చేయని ప్రజలపై ఈ దాడులు ధర్మవిరుద్ధం. యుద్ధంలోనేకాక, దురాక్రమికశక్తికి వ్యతిరేకంగా పోరాడే అన్ని దారులు మూసుకుపోయినప్పుడు, శత్రువు జీవన మార్గాలన్నింటిని అడ్డుకొంటున్నప్పుడు, ఈ దాడులకు అనుమతి ఉంది. అందువల్ల పాలస్తీనాలోనూ అనివార్య పరిస్థితుల వల్ల, మార్గాంతరంలేక ఈ దాడులు జరుగుతు న్నాయని భావించాలి. ఇలాంటి దాడులకు ఇష్టమొచ్చినట్లు పాల్పడడం సముచితం కాదని పనిచేసే పద్ధతులు ఇంకా చాలా ఉన్నాయని భావించడమే ఇస్లాం దృక్పథం. యూదులు దౌర్జన్యపరులన్నది నిజమే కాని ఇస్లామీయ సందేశం పొందవలసిన వారే కదా! వారి విషయంలో సందేశాన్ని అందజేసే ధార్మిక బాధ్యత నిర్వర్తించాలి. ఇలా చేయడం వల్ల ఒనగూడే ఫలితాలు ఇస్లామీయ సమాజానికి ప్రయోజనకర మవుతా యని చెప్పవచ్చు.

గమనించదగ్గ మరో వాస్తవమేమిటంటే, ప్రాంతీయ లేదా జాతీయ లేదా వర్గపరమైన ప్రయోజనాల కోసం జరిగే దాడులకు ఇస్లాంకు సంబంధం లేదు. అందువల్ల ఇలాంటి ప్రయోజనాల కోసం దాడులు చేసేవారు ముందుగా ఆచరణలు, సంకల్పాలను తరచి చూసుకోవాలి. వాటిలో లోపాలు ఉంటే సంస్కరించుకోవాలి. ఆచరణలను పునస్సమీక్షించవలసిన అవసరం కూడా రావచ్చు. ఈ సందర్భంగా క్రింది సంఘటన ప్రస్తావించదగ్గది.

పాలస్తీనాకు చెందిన ఒక ధర్మప్రచారకుడు, సందేశ ప్రచార బాధ్యతలను సుదీర్ఘ కాలం నిర్వహించిన తర్వాత పాలస్తీనా తిరిగి వెళ్ళారు. అక్కడ కస్టమ్స్‌లో, ఉన్న యూదు అధికారి అత్యంత తిరస్కారిగా చూస్తూ నువ్వు మమ్మల్ని పాలస్తీనా నుంచి గెంటేయాలని చూస్తున్నావా? అన్నాడు. దానికి జవాబిస్తూ ధర్మప్రచారకుడు "ఈ దేశం మీకే దక్కాలని మేము కోరుతున్నాము. అయితే మా మాటను అంగీకరించండి, అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడనీ, ముహమ్మద్ ప్రవక్త (స) అల్లాహ్ ప్రవక్త అని మీరు అంగీకరించాలి" అన్నారు. ఈ జవాబు విన్న వెంటనే యూదుడి వైఖరి మారింది. విద్వేషం స్థానంలో గౌరవభావం చోటుచేసుకొంది.

సాయుధ సంఘర్షణ-ఇస్లాం

టెర్రరిజంతో పాటు జిహాద్ ప్రస్తావన నేడు మామూలయ్యింది. ప్రచార ప్రసార సాధనాలు ఈ రెండు పదాలను కలగలిపి గజిబిజిగా వాడుతుంటాయి. ఏదో ఒక వర్గం టెర్రరిజానికి పాల్పడుతుందని ఆరోపిస్తూ వాళ్ళు 'జిహాద్' చేస్తున్నారనీ, ముజాహిద్‌లనీ పేర్కొంటూ ఉంటాయి. ఇస్లాంలో యే యే సందర్భాలలో బలప్రయోగానికి అనుమతి ఉంది? యే యే సందర్భాలలో అనుమతి లేదు? బలప్రయోగం యెలా జరుగాలి? యెలా జరుగరాదు? వగైరా వివరాల క్రోడీకరణ స్పష్టంగా లేనందు వల్ల కూడా ప్రచారప్రసార సాధనాలకు ఇలాంటి ప్రాపగాండ నిర్వహించే అవకాశం దొరుకుతోంది. జిహాద్ చేస్తున్నామని ఎవరన్నా ప్రకటిస్తే చాలు, అదే సత్యమని ఒప్పేసుకొంటున్నారు. ముస్లిముల ప్రమేయం ఉన్న ప్రతి సంఘటనను మీడియా టెర్రరిజంగా పరిగణిస్తోంది. ఆ సంఘటనకు పాల్పడినవారి ఉద్దేశ్యం 'జిహాద్' అయినట్లు ప్రచారం చేస్తుంది.

టెర్రరిజానికి సంబంధించి ప్రస్తుతం ఉనికిలో ఉన్న వివిధ రకాలు, వాటికి సంబంధించి ఇస్లామీయ దృక్పథం గురించి వెనుకటి పేజీల్లో చర్చించాము. ఇస్లాంలో బలప్రయోగం యే సందర్భాలలో సముచితం? దానికి సంబంధించిన నియమ నిబంధనలు యేవి? యే సందర్భాలలో బలప్రయోగం ఉచితమే అయినా బలప్రయోగం చేయకపోవడమే ఉత్తమం? వగైరా వివరాలు ఇప్పుడు చూద్దాం.

బలప్రయోగం అనేక విధాలుగా జరుగొచ్చు. ఒక వ్యక్తి మరో వ్యక్తిపై, ఒక వ్యక్తి మరో వర్గంపై బలప్రయోగానికి పాల్పడడం వ్యక్తిగత స్థాయిలో జరిగే బలప్రయోగం. మరో రకం ఏమిటంటే, ఒక వర్గం తమతో భావసారూప్యత ఉన్న మరో వర్గంపై బలప్రయోగానికి పూనుకోవడం. ఒకే నగరానికి చెందిన రెండు వర్గాల మధ్య, లేక ఒక దేశానికి చెందిన రెండు జాతుల మధ్య, లేక ఒకే మతానికి చెందిన రెండు విభిన్న పంథాల వారి మధ్య, లేక ఒకే ప్రాంతానికి చెందిన రెండు తెగల మధ్య జరిగే ఘర్షణ. ఈ ఘర్షణలో ప్రభుత్వ పాత్ర లేనట్లయితే అది సామూహిక స్థాయిలో జరిగే బలప్రయోగం వంటిది.

మూడవ రకం ఏమిటంటే, ప్రభుత్వ జోక్యం ఉండడం. ఒక ప్రభుత్వం మరో ప్రభుత్వంపై బలప్రయోగానికి పూనుకోవడం. క్లుప్తంగా చెప్పాలంటే బలప్రయోగం మూడు విధాలుగా ఉంటుంది. వ్యక్తిగత స్థాయిలో, సామూహిక స్థాయిలో, రాజ్యస్థాయిలో.

వ్యక్తిగత స్థాయి

ప్రతి ఒక్కరికి ఆయుధం చేపట్టే అనుమతి ఇస్లాం ఇవ్వదు. కాని, ఎవరైనా వ్యక్తి హింసా దౌర్జన్యాలకు గురవుతుంటే అతడు దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ కొరకు బలప్రయోగానికి పూనుకోవచ్చు. వ్యక్తికి అయినా, వర్గానికి అయినా ఈ అనుమతి ఉంది. షరిఅత్ ఈ బలప్రయోగాన్ని అంగీకరిస్తుంది. కాని ఈ హక్కు హింసాదౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆత్మరక్షణ చేసుకొనే హక్కు మాత్రమే. అంతే తప్ప దౌర్జన్యానికి ప్రతిగా దౌర్జన్యానికి పాల్పడే హక్కు అని భావించరాదు. బాధితుడయినా సరే తిరిగి దౌర్జన్యానికి పాల్పడే హక్కు లేదు. లేదా బాధితుడు తానే స్వయంగా న్యాయాధికారిగా మారి తనపై జరిగిన దౌర్జన్యానికి ప్రతీకారం తీర్చుకోవడం కుదరదు. ప్రతీకారం తీర్చుకోడానికి అతడు న్యాయస్థానానికి వెళ్ళవలసి ఉంది. న్యాయస్థానం అతడిపై జరిగిన దౌర్జన్యానికి సమానంగా బదులు తీర్చుకొనేలా చేస్తుంది. ఈ వైఖరి కేవలం ముస్లిం దేశాలలోనే కాదు, చట్టబద్ధమైన పాలన ఉన్న ముస్లిమేతర దేశాలలోనూ ఇదే వైఖరి అవలంబించవలసి ఉంది.

అయితే, ఒక్కోసారి సంక్లిష్టమైన న్యాయప్రక్రియ కారణంగా న్యాయం జరుగడంలో చాలా ఆలస్యం జరుగొచ్చు. అలాగే న్యాయ ప్రక్రియ రాజకీయ ఒత్తిళ్ళకు గురికావచ్చు కూడా. కాని ఇది మినహాయింపు. కాబట్టి యే వ్యక్తి అయినా న్యాయస్థానానిదే అంతిమ నిర్ణయం అని అంగీకరించడమే సముచితం. ప్రతీకారం, న్యాయం విషయంలో చట్టం పైననే ఆధారపడాలి. ఈ విషయాన్ని ఎవరైనా వ్యక్తి అంగీకరించకపోతే అతడు తనపై జరిగిన దౌర్జన్యం కన్నా పెద్ద దౌర్జన్యానికి గురికాడన్న హామి యేదీ లేదు.

ఇదంతా దౌర్జన్యపరుడు దౌర్జన్యం చేసిన తర్వాత ఏర్పడే పరిస్థితి; బాధితుడు

న్యాయస్థానాన్ని ఆశ్రయించే పరిస్థితి. అయితే బాధితుడు సరిగ్గా దౌర్జన్యాన్ని ఎదుర్కొంటూనే ఉన్నప్పుడు దౌర్జన్యపరుడికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ చేసుకొనే అధికారం ఉంటుంది. ఈ సందర్భంగా ఒకవేళ దౌర్జన్యపరుడు ఈ ఆత్మరక్షణలో హతుడైపోయినా ఈ హత్య క్షమార్హమే అవుతుంది. అయితే బాధితుడు దౌర్జన్యానికి గురవుతున్నంతసేపు మాత్రమే ఈ హక్కు ఉంటుంది. బాధితుడు తన సొంత బలంతో కాని, లేదా మూడవ వ్యక్తి జోక్యం వల్ల కాని దౌర్జన్యపరుడిని దౌర్జన్యం చేయకుండా నిలువరించిన తర్వాత ఈ ఆత్మరక్షణ హక్కు కూడా ముగిసిపోతుంది.

దౌర్జన్యపరుడు హతమయ్యేంత తీవ్రంగా సంఘర్షించడం సముచితం కాదు. ఉదాహరణకు ఎవరైనా వ్యక్తి దౌర్జన్యంగా మరో వ్యక్తిని చెంప దెబ్బ కొడితే దానికి ప్రతిగా అతడిపై తుపాకితో కాల్పులు జరిపే హక్కు అతనికి లేదు.

ఎదుటి వ్యక్తికి ప్రాణహాని కలిగే అవకాశం ఉన్నా ఆత్మరక్షణకు సంబంధించి ధర్మవేత్తలు పరిమితులు, హద్దులు నిర్ధారించారు. క్లుప్తంగా చెప్పాలంటే చట్టం దృష్ట్యా, షరిఅత్ దృష్ట్యా పవిత్రమైన హక్కులను దౌర్జన్యపరుడు కాలరాస్తున్నప్పుడు, అంటే ధన మాన ప్రాణాలపై, విశ్వాసంపై దాడి జరిపినప్పుడు ఈ విధంగా ఆత్మరక్షణ చేసుకొనే హక్కు ఉంది. అప్పుడు దౌర్జన్యపరుడి ప్రాణాలుపోయినా అది ధర్మసమ్మతమే అవుతుంది. దౌర్జన్యపరుడు ఎవరినయినా చంపదలిచితే, లేదా సంపద దోచుకో దలిచితే, లేదా మానభంగానికి ప్రయత్నిస్తే లేదా విశ్వాస సంపదను ధ్వంసం చేయదలిచితే, అలాంటి సందర్భాలలో ఆత్మరక్షణ ప్రయత్నాలలో దౌర్జన్యపరుడి ప్రాణాలుపోయినా అతని పట్టుకోవడం జరగదు.

బాధితులు, దౌర్జన్యానికి గురయినవారి వైఖరి విభిన్నం కావచ్చు. అవసరార్థం ఏదో ఒక వైఖరి అవలంబించవచ్చు. పరిస్థితుల దృష్ట్యా కూడా వైఖరిలో మార్పు ఉండవచ్చు. ఉదాహరణకు ఎవరైనా సంపద దోచుకోవాలనుకొంటున్నప్పుడు లేదా ఎవరినన్నా చంపదలిచినప్పుడు ఈ రెండు సందర్భాలలో దౌర్జన్యపరుడి వైఖరి వేర్వేరుగా ఉండవచ్చు. బాధితుడు అతడి ప్రాణాలు తీయవచ్చు. లేదా ప్రాణాలు తీయడానికి వెనుకాడి సంపద దోపిడి కానీయవచ్చు, దౌర్జన్యపరుడు ప్రాణాలు తీయదలిచితే బాధితుడు ఆత్మరక్షణకు అతడి ప్రాణాలు తీయవచ్చు

లేదా దౌర్జన్యపరుడు సంపద దోచుకోదలిచితే సంపదను వదలివేయవచ్చు. ఆత్మరక్షణ హక్కుకు సంబంధించి స్పష్టమైన సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఈ హక్కును చట్టం సయితం గుర్తిస్తుంది. ఈ మౌలిక హక్కుకు సంబంధించి ఇస్లామీయ షరిఅత్‌లో ఉన్న ఆధారాలు ఇవి:

ప్రవక్త (స) ఇలా అన్నారు: "తన సంపదను కాపాడుకొనే ప్రయత్నంలో హతమైన వ్యక్తి అమరుడు. తన ప్రాణ రక్షణ ప్రయత్నంలో హతమైన వ్యక్తి అమరుడు. తన ధర్మాన్ని రక్షించే ప్రయత్నంలో హతమైన వ్యక్తి అమరుడు. తన కుటుంబాన్ని రక్షించే ప్రయత్నంలో హతమైన వ్యక్తి అమరుడు." (అబూదావూద్)

తన సంపద, ప్రాణాలు, ధర్మం, మానమర్యాదలను కాపాడుకొనే ప్రయత్నాల్లో హతమైన వాళ్ళు, అమరులవుతారని ఈ హదీసు చెబుతోంది. దివ్య ఖుర్‌ఆన్ లోని ఒక ఆయతులో ఇలా ఉంది:

> **"దౌర్జన్యంగా హతమైన వ్యక్తి వారసులకు హత్యాప్రతీకారం కోరే హక్కు మేము ఇచ్చాము."**

మరో హదీసులో ఇలా ఉంది: "మీ యింట్లో తొంగిచూసే వ్యక్తి కళ్ళు పొడిచినా అది మీ అపరాధం కాదు."

ప్రముఖ న్యాయశాస్త్ర కోవిదుడు షహీద్ అబ్దుల్ ఖాదర్ ఔదా ఈ విషయమై ఇచ్చిన వివరణ వెనుకటి పేజీలలో ఇచ్చాము. ప్రస్తుత కాలంలోని ప్రముఖ రచయిత వహబలా జహేలీ ఈ విషయమై ఇలా రాశారు:

> ఎవరయితే ఆత్మరక్షణలో ఎదుటివారిని హతమారుస్తారో వారు షరిఅత్ ప్రకారం ఇచ్చిన ఆత్మరక్షణ నియమాల శరణ్యంలో ఉంటారు.

వ్యక్తిగత స్థాయిలో ఎవరిపైనయినా ప్రాణహాని కలిగే స్థాయిలో సంఘర్షించ డానికి సంబంధించిన సందర్భం ఇది ఒక్కటే. దాన్ని వదలి మరే సందర్భంలో అయినా ఆయుధాలు ఎత్తడానికి అనుమతి లేదు. ఈ హక్కును ఉపయోగించు కోవడంపై సాధారణంగా ఎలాంటి నిషేధాలు లేవు. ఇమామె ఆజం దృష్టిలో ఈ హక్కును ఉపయోగించడం విధి. చాలా మంది ఇతర ధర్మవేత్తలు కూడా ఇదే

అభిప్రాయం కలిగి ఉన్నారు. అయితే ఈ హక్కును ఉపయోగించు కోవడంలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవడం అవసరం.

ఉదాహరణకు: సమాజంలో అలజడి, కల్లోలాల వాతావరణం నెలకొని ఉంటే, ఇలాంటి పరిస్థితిలో ఎవరి ప్రాణహాని అయినా కల్లోలాన్ని మరింత రెచ్చగొట్టేలా ఉంటే అలాంటి సందర్భంలో దౌర్జన్యపరుడి నుంచి ఎలా ఆత్మరక్షణ చేసుకోవాలన్న విషయమై బాధితుడు వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకోవచ్చు. కాని కల్లోలం, అలజడి లేనట్లయితే అలాంటి పరిస్థితుల్లో తన హక్కును పూర్తిగా ఉపయోగించుకోవడం అవసరం. ఎందుకంటే అలా చేయడం కూడా కల్లోలానికి వ్యతిరేకంగా పనిచేయడం అవుతుంది.

సామాజిక కల్లోలానికి సంబంధించిన హదీసుల అధ్యయనం వల్ల తెలిసే దేమంటే ఈ హక్కు అసలు ఉద్దేశ్యం కల్లోలాన్ని అణచడం. సామాజిక కల్లోలం చెలరేగుతున్న పరిస్థితిలో ప్రాణహాని అన్నది కల్లోలాన్ని మరింత రెచ్చగొట్టడం అవుతుంది కాబట్టి అలాంటి పరిస్థితుల్లో ప్రాణత్యాగానికైనా సిద్ధమవడం అత్యుత్తమం. కాని శాంతియుత వాతావరణంలో దుండగుల పట్ల మెతకగా వ్యవహరించడం కల్లోలానికి ఊతమిచ్చినట్లు కావచ్చు. అందువల్ల సాధారణ పరిస్థితుల్లో తనపై జరిగే దాడుల నుంచి ఆత్మరక్షణ చేసుకోవడం అవసరం. ప్రత్యేక పరిస్థితులకు సంబంధించిన హదీసులను, వాటి నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధ్యయనం చేయడం అవసరం. ఇలాంటి అనేక హదీసులను ముమ్ముందు చూద్దాం. ప్రస్తుతం ఇలాంటి రెండు హదీసులు క్రింద ఇచ్చాము.

ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "రాబోవు కాలంలో కల్లోలాలు చెలరేగనున్నాయి. అప్పుడు కూర్చున్న వ్యక్తి నిలబడిన వ్యక్తి కన్నా ఉత్తముడు. నిలబడిన వ్యక్తి నడిచే వ్యక్తి కన్నా ఉత్తముడు. నడిచే వ్యక్తి పరుగెత్తే వ్యక్తి కన్నా ఉత్తముడు. అందులోకి తొంగిచూసే వ్యక్తి అందులోనే పడిపోతాడు. దీనినుంచి విముక్తి లేదా రక్షణ పొందగల వ్యక్తి రక్షణ పొందాలి." (సహీ బుఖారి)

ఇలాంటిదే మరో హదీసు అబుదావూద్‌లో ఉంది. అందులో పైన పేర్కొన్న పంక్తులకు అదనంగా క్రింది పంక్తులు ఉన్నాయి.

"ఎవరి వద్దనయినా ఒంటె ఉంటే తన ప్రాంతానికి వెళ్ళిపోవాలి అన్నారు ప్రవక్త (స). అలాంటిది యేదీ లేకపోతే ఏం చేయాలని అడిగినప్పుడు తన కత్తి బయటకు తీసి బండరాతిపై కొట్టి మొద్దు బారేలా చేయాలి. ఆ పిదప ఎలా పడితే అలా తనను తాను రక్షించుకొనే ప్రయత్నం చేయాలి" అన్నారు. (అబూదావూద్)

పైన పేర్కొన్న రెండు హదీసులు ముస్లిం సమాజానికి సంబంధించినవి. ఏదైనా ముస్లిం సమాజంలో అల్లరి శక్తులు చెలరేగితే సాధారణ పౌరులు సాధ్యమైనంత వరకు అల్లర్ల నుంచి దూరంగా ఉండాలి. అల్లరిశక్తులను ఎదుర్కోవడం పట్ల నిగ్రహం పాటించాలి. సాయుధ పోరాటం కాక ఆత్మరక్షణకు పూర్తి ప్రయత్నాలు చేయాలి. రెండవ హదీసులో మరింత స్పష్టంగా కత్తి ఎత్తకుండానే ఆత్మరక్షణ ప్రయత్నాలు చేయాలని స్పష్టమైన ఆదేశం ఉంది. ఎందుకంటే కల్లోలానికి వ్యతిరేకంగా ఆయుధాలు ధరిస్తే కల్లోలం మరింత విస్తరిస్తుంది. మరింత చెలరేగుతుంది.

మిశ్రమ సమాజాలలోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తవచ్చు. ఉదాహరణకు మిశ్రమ సమాజంలో మతపరమైన దురభిమానాలతో శాంతి భద్రతలు దిగజారే పరిస్థితి ఏర్పడవచ్చు. ఇలాంటి పరిస్థితిలో దౌర్జన్యానికి జవాబు ఇస్తే కల్లోలం మరింత పెచ్చరిల్లే ప్రమాదం ఉంది. దౌర్జన్యానికి జవాబు ఇవ్వనట్లయితే దౌర్జన్యపరుడికి నైతికంగానూ, భౌతికంగానూ ఎలాంటి మద్దతూ లభించకపోయే అవకాశాలే ఎక్కువ. కాబట్టి కల్లోలం మరింత పెచ్చరిల్లకుండా నిరోధించడానికి గాను వ్యక్తి తన ప్రాణాలను సయితం లక్ష్యపెట్టకుండా కల్లోలాన్ని ఆపే ప్రయత్నం చేయడం ఉత్తమం. ఈ విషయం ప్రాణహాని, ప్రాణత్యాగాలకు మాత్రమే సంబంధించినది కాదు. ప్రాణ ప్రస్తావన అన్నది చిట్టచివరన జరిగే చర్య. అంతకు ముందు కూడా చాలా దశలు ఉంటాయి. ఉదాహరణకు; ఒక వర్గం రెచ్చగొట్టే నినాదాలు చేస్తున్నప్పుడు ప్రతిగా జవాబు ఇవ్వక మౌనం వహించడం. విస్తృత ధార్మిక, సామాజిక ప్రయోజనాల దృష్ట్యా రెచ్చగొట్టే నినాదాలను పట్టించుకోక ఊరుకోవడం. మరో పద్ధతి ఏమంటే, రెచ్చగొట్టే నినాదాలకు, నినాదాలతో లేదా మరో రకంగా జవాబు చెప్పడం. కాని, అలాంటి నినాదాలకు జవాబుగా రాయి విసిరినా, ప్రతిగా తుపాకి గుళ్ళ వర్షం కురిసే పరిస్థితి ఉన్నప్పుడు సహనం

చూపడమే ఉత్తమం. ఈ దౌర్జన్యానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించడమే మంచిది.

సామూహిక స్థాయి

సామూహిక స్థాయిలో బలప్రయోగం అంటే అర్థం ముస్లిం సమాజంలో ఒక వర్గం మరొక వర్గంతో ఘర్షణ పడడం, లేదా మిశ్రమ సమాజంలో ముస్లిములకు, ముస్లిమేతరులకు మధ్య కలహాలు చెలరేగడం. ఇస్లామీయ బోధనల ప్రకారం, పై రెండు పరిస్థితులలోనూ ముస్లిములు ఆయుధాలు ఎత్తకపోవడమే కొన్ని సందర్భాలలో మంచిది, కొన్ని సందర్భాలలోనయితే ఆయుధాలు ఎత్తకపోవడం విధి అవుతుంది. ముఖ్యంగా మిశ్రమ సమాజాల్లో ముస్లిములకు ఏ విధంగానూ పోరుకు దిగే అనుమతి లేదు.

ముస్లిం సమాజంలో వివిధ వర్గాల మధ్య ఘర్షణకు సంబంధించిన ఉదాహరణ ప్రవక్త (స) కాలంలో లేదు. అయితే ఈ విషయమై మార్గాన్ని చూపించే అనేక హదీసులను ధర్మవేత్తలు సంకలనం చేశారు. ఇవి మాత్రమేకాక ప్రవక్త(స) సహచరుల సంప్రదాయాలు కూడా అనేకం మన ముందు ఉన్నాయి.

ఉస్మానీ ఖలీఫాల కాలంలో మదీనాలో ఇలాంటి పరిస్థితి తలెత్తింది. కొందరు అల్లరి మూకలు మదీనాను ఆక్రమించుకొన్నారు. ముస్లిముల ఖలీఫాను నిర్బంధించారు. ఈ పరిస్థితిలో ప్రవక్త (స) సహచరులు యుద్ధానికి దిగకుండా నిగ్రహం పాటించారు. ఎందుకంటే, ఆ పరిస్థితిలో ఆయుధాలు ఎత్తడమంటే కల్లోలానికి మరింత ఆజ్యం పోయడమే అవుతుంది. ప్రవక్త (స) సహచరులు ఈ క్రింది హదీసు ఆధారంగా ఆ నిర్ణయం తీసుకొన్నారు.

హజ్రత్ అబూజర్ గఫారి (రజి) ఉటంకించిన ప్రవక్త (స) ప్రవచనం: దైవప్రవక్త (స) "ఓ అబూజర్!" అని పిలిచారు. నేను "దైవప్రవక్తా హజరయ్యాను" అని జవాబిచ్చాను. ఆ పిదప ఆయన ఈ హదీసు చెప్పారు. "గోరి కూడా సేవకుని ద్వారా తప్ప దొరకని పరిస్థితిలో మృత్యువును ప్రజలు ఎదుర్కొంటున్నప్పుడు ఓ అబూజర్ నీ పరిస్థితి ఏమిటి?" "దైవానికి, దైవప్రవక్త (స)కు బాగా తెలుసు"

అని నేను జవాబిచ్చాను. లేదా "దేవుడు, దైవప్రవక్త (స) నా కోసం యిష్టపడిన పరిస్థితి" అన్నాను. ఆయన "నీకు సహనం తప్పనిసరి" అన్నారు. లేదా "సహనం వహించు" అన్నారు. మరలా ఆయన "ఓ అబూజర్!" అన్నారు. నేను "దైవప్రవక్త (స)! హాజరయ్యాను" అని జవాబిచ్చాను. ఆయన "జైతూన్ కొండలు రక్తసిక్తమయి నప్పుడు నీ పరిస్థితి ఏమిటి?" అన్నారు. "దేవునికి, దైవప్రవక్త (స)కు బాగా తెలుసు" అని అబూజర్ (రజి) జవాబిచ్చారు. "లేదా దేవుడు, దైవప్రవక్త (స) యిష్ట పడిన పరిస్థితి" అన్నారు. అప్పుడు ప్రవక్త (స) "నీవు ఎవరితో ఉన్నావో వారితోనే ఉండు" అన్నారు. (అంటే ఎవరితో చేతిపై ప్రతిజ్ఞ చేశావో వారితోనే ఉండు). హజ్రత్ అబూజర్ (రజి) ఇంకా ఇలా తెలిపారు: "ఓ దైవప్రవక్తా (స)! ఇలాంటి పరిస్థితిలో "నేను కత్తి భుజంపై పెట్టుకోనా" అని అడిగాను. దానికాయన "అప్పుడు నీవు కూడా వారిలోనే కలిసి పోతావు" అని జవాబిచ్చారు. "అయితే నేను ఏం చేయాలని ఆజ్ఞ" అని అడిగాను. "నీ యింట కూర్చుని ఉండు" అన్నారు. "వాళ్ళు నా యింట్లోకి కూడా ప్రవేశిస్తే" అని అడిగాను. దానికి ప్రవక్త (స) "కత్తి మెరుపు నిన్ను భయపెడుతుందని నువు అనుకొంటే ముఖంపై దుప్పటి కప్పుకో, హంతకుడు తన పాపం, నీ పాపం తన నెత్తిన వేసుకొంటాడు" అన్నారు.

(అబూదావూద్)

ఈ సుదీర్ఘమైన హదీసు ద్వారా తెలిసేదేమంటే: సామూహిక అల్లకల్లోలం చెలరేగినప్పుడు మనిషి పోరుకు దిగడంకన్నా ప్రాణం ఇవ్వడమే ఇస్లాం బోధన. ఎందుకంటే, పోరుకు దిగడం వల్ల ఘర్షణ సుస్థిరం, పటిష్ఠం అవుతుంది. అలాకాక ప్రతిఘటించకుండా ఊరుకొన్నట్లయితే అల్లర్లు వాటికవే తగ్గుముఖం పడతాయి.

ఈ హదీసులోని ఆఖరు పదాలు "కత్తి మెరుపు భయపెడుతుందని నువ్వనుకొంటే ముఖంపై దుప్పటి వేసుకో" అన్న పదాలు చాలా స్పష్టంగా, ఇలాంటి పరిస్థితిలో మనిషి అల్లర్లలో భాగం కారాదని చెబుతున్నాయి. ప్రాణం పోయినా సరే, ఆయుధం ఎత్తరాదని చెబుతున్నాయి. ఒకసారి ఆయుధాలు ఎత్తడం జరిగితే ఈ అల్లర్లు మరింత కాలం కొనసాగుతాయి.

హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబేర్ (రజి) ఖలీఫాగా తన యోగ్యతను ప్రకటించు

కొన్న తర్వాత కూడా హిజాజ్ ప్రాంతంలో ఇలాంటి పరిస్థితే తలెత్తింది. ముస్లిములు ఒకరితో మరొకరు ఘర్షణ పడ్డారు. ఈ పరిస్థితిని ప్రవక్త (స) సహచరులు సామూహిక ఉపద్రవంగానే పరిగణించి ఈ అల్లర్లకు దూరంగా ఉన్నారు. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి)కు సంబంధించిన ఉల్లేఖనం:

"ఇబ్నె జుబేర్ (రజి) సంఘటన తర్వాత ఇబ్నె ఉమర్ (రజి) వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. "ఇబ్నె ఉమర్ ప్రజలు పతనమైపోయారు. మీరు ప్రవక్త (స) సహచరులు. ఈ పరిస్థితిలో మీరు కల్పించుకోడానికి అభ్యంతరమేమిటి?" అని ప్రశ్నించారు. దానికాయన "నా సోదరుడి హత్య నాకు నిషిద్ధం. అందువల్ల కల్పించుకోలేదు" అన్నారు. దానికి వాళ్ళు "వారితో పోరాడండి, ఉపద్రవం ముగిసే వరకు" అన్న ఆయత్ పఠించారు. దానికి ఇబ్నె ఉమర్ (రజి) జవాబిస్తూ "మేము పోరాడాము. ఉపద్రవం సమసే వరకు, ధర్మం దైవం కొరకే ప్రత్యేకమయ్యింది. మీరు యుద్ధం చేస్తున్నారు. ఉపద్రవం చెలరేపడానికి ధర్మం దైవేతరులదై పోవడానికి" అన్నారు.

ఇబ్నె జుబేర్ (రజి) కాలంలో జరిగిన యుద్ధాన్ని ఇబ్నె ఉమర్ (రజి) ఉపద్రవంగా పరిగణించారు. ఆ పరిస్థితిలో తటస్థంగా ఉండడమే షరిఅత్ ఆదేశంగా భావించారు.

కల్లోలానికి సంబంధించి పైన పేర్కొన్న హదీసులో మరో సందర్భాన క్రింది పంక్తులు అదనంగా ఉన్నాయి.

హుసైన్ అబ్దుర్రహ్మాన్ అల్ అష్జయీ ఈ హదీసును ఉటంకించారు. ఆయన ఈ హదీసును సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ చెప్పగా విన్నారు. సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ ప్రవక్త (స) ద్వారా విని ఇలా ఉటంకించారు: "నేను ప్రవక్త (స)ను అడిగాను, 'ఓ ప్రవక్తా (స)! వాళ్ళు నా యింట దూరి నన్ను హత్య చేయదలిచితే' ప్రవక్త (స) ఇలా జవాబిచ్చారు. "అప్పుడు ఆదం (అ) ఇద్దరు కుమారుల్లో ఒకరు ఏం చేశారో అదే చేయి" అని చెప్పి ఖుర్ఆన్ ఆయత్ పఠించారు.

ఈ హదీసులో ఆదం (అ) ఇద్దరు కుమారుల మధ్య జరిగిన సంఘటన గురించి ప్రస్తావన ఉంది. ఈ సంఘటన దివ్యఖుర్ఆన్‌లో వివరంగా ఉంది:

"వారికి ఆదము ఇద్దరు తనయుల వృత్తాంతాన్ని కూడా పొల్లుపోకుండా వినిపించు. వారిద్దరూ ఖుర్బానీ ఇచ్చినప్పుడు ఒకరి ఖుర్బానీ స్వీకరించ బడింది. మరొకరిది స్వీకరించబడలేదు. రెండోవాడు ఇలా అన్నాడు: "నేను నిన్ను చంపివేస్తాను" సమాధానంగా మొదటివాడు ఇలా అన్నాడు: "భయభక్తులు కలవారి మొక్కుబడులనే అల్లాహ్ స్వీకరిస్తాడు. నీవు నన్ను చంపడానికి చేయి ఎత్తినా నేను నిన్ను చంపడానికి చేయి ఎత్తను."

(అల్ మాయిద : 27-28)

ముస్లిం సమాజాల్లో ఒక్కోసారి షరిఅత్ అభిలషించే ప్రమాణాలకు సరితూగని వారు అధికారం చేజిక్కించుకొనే పరిస్థితి రావచ్చు. అయినప్పటికీ వారి పట్ల కూడా విధేయత చూపాలనీ, వాళ్ళు దౌర్జన్యానికి పాల్పడినా, లేక వ్యక్తిగతంగా షరిఅత్ ఆదేశాల పట్ల ఉపేక్ష ప్రదర్శించినా కూడా వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేదా వారిని అధికారం నుంచి తొలగించే ప్రయత్నాలు చేయరాదనీ, ధర్మం ప్రకారం బ్రతకడం కష్టమయ్యే విధంగా పాలకుడు ఆంక్షలు విధించనంత వరకు ఇలాంటి ప్రయత్నాలు చేయరాదని బోధించే హదీసులు ఉన్నాయి.

ఒక హదీసు ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు: "నా తర్వాత నేను తీసుకువచ్చిన ఈ హితబోధకు విధేయత చూపని పాలకులు కూడా వస్తారు. నా సంప్రదాయం పట్ల కూడా వాళ్ళు విధేయత చూపరు. వారిలో కొందరి హృదయాలు ఎలా ఉంటాయంటే మనిషి శరీరంలో షైతాను హృదయంలా ఉంటారు. (హదీసును ఉటంకించిన వారి కథనం) నేను ప్రవక్త (స)తో "వాళ్ళు నాకు ఎదురయితే ఏం చేయాలి?" అని ప్రశ్నించాను. ఆయన బదులిస్తూ, "పాలకుడికి విధేయత చూపాలి, పాలకుడు నీ కడుపు కొట్టినా లేక మీ సంపద కబళించినా" (మరోచోట ఉటంకించిన వారి కథనం ఇలా ఉంది) " ఓ దైవప్రవక్తా (స)! మేము కత్తి పైకెత్తి వారిని ఎందుకు ఎదిరించరాదని" ప్రశ్నించినప్పుడు ప్రవక్త (స) "కుదరదు, వాళ్ళు మీలో నమాజును స్థాపిస్తున్నంత కాలం ఇలా చేయరాదు" అన్నారు. (సహీ ముస్లిమ్)

ఇంకో హదీసులో ఇలా ఉంది: "నా తర్వాత మీరు స్వార్థతను, ఇష్టంలేని అనేక ఇతర అంశాలు చూస్తారు." "ప్రవక్తా (స) అప్పుడు మేమేమి చేయాలి" అని

అడిగారు ప్రజలు. ప్రవక్త (స) జవాబిస్తూ "(పాలకుల) హక్కులు నిర్వర్తించండి. మీ హక్కులు నన్ను అర్థించండి" (బుఖారి)

ఈ భావం ఉన్న ఇంకా అనేక హదీసులు ఉన్నాయి. ఈ హదీసుల ద్వారా తెలిసేదేమంటే, పాలకుడు దౌర్జన్యపరుడయినప్పటికీ తిరగబడకపోవడంలోనే ముస్లిమ్ సముదాయం ప్రయోజనాలున్నాయి. పాలకుడు ధర్మాచరణల మార్గంలో ఆటంకాలు సృష్టించనంత కాలం అతడిపై తిరుగుబాటు ధర్మసమ్మతం కాదు. హదీసు వేత్తలు, ధర్మవేత్తల అభిప్రాయం ఇది. ఇమామే అబూ హనీఫా దౌర్జన్య పరుడయిన పాలకుడిపై తిరగబడాలన్న అభిప్రాయం కలిగి ఉన్నప్పటికీ మిగిలిన ధర్మవేత్తలు చాలామంది ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తున్నారు.

పైన పేర్కొన్న హదీసు మాత్రమేకాక ధర్మవేత్తలు, ఇస్లామీయ సమాజం సామూహిక ప్రయోజనాల దృష్ట్యా కూడా ఈ నిర్ణయానికి వచ్చారు. ఎందుకంటే, సాధారణంగా విప్లవాలు విజయం సాధించలేవు. విజయం సాధించిన విప్లవాల లోనూ, ఇప్పటి వరకు అనుభవాల వల్ల తెలుస్తున్నదేమంటే గతంలో వారిని మించిన దుర్మార్గులే పాలకులయ్యారు. అదీకాక విప్లవాలలో జరిగే రక్తపాతం, ప్రాణనష్టం, ఒకరి చేతుల్లో మరొకరు హతం కావడం సమాజానికి చాలా నష్టదాయకమవుతుంది.

దీనికి విరుద్ధంగా, ఏకపక్షంగా నిరాయుధ ప్రయత్నాలు చేయడం పైకి ప్రయోజన శూన్యంగా కనబడినప్పటికీ, ఫలితాల దృష్ట్యా చాలా ప్రయోజనకర మైనది. ప్రవక్త ముహమ్మద్ (స) నిర్వహించిన సత్యధర్మ సందేశ ప్రచారం కూడా ఒక విధంగా నిరాయుధ ప్రయత్నమే. ప్రవక్త(స) మక్కాలో ఉన్నంత కాలం కేవలం సందేశ ప్రచారాన్ని మాత్రమే నిర్వహించారు. ఆయన చేసిన ఈ ప్రయత్నాల వల్లనే తర్వాతి కాలంలో మదీనాలో ఇస్లామీయ రాజ్యం ఏర్పాటు అయ్యింది.

ఇస్లామీయ చరిత్రలోనూ ఇలాంటి అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఉదాహరణకు షేఖ్ అహ్మద్ సర్ హింద్ సాధించిన సందేశ ప్రచార విప్లవం నిరాయుధ ప్రయత్నమే. మొగల్ చక్రవర్తి అక్బర్ ప్రారంభించిన దీన్-యి-లాహీని ఈ విప్లవం చావుదెబ్బకొట్టింది. అలాగే ఆధునిక ఉద్యమాలలో ఈరాన్ విప్లవం పూర్తిగా నిరాయుధమైనది. నూటికి నూరుపాళ్ళు విజయం సాధించిన విప్లవం ఇది.

దౌర్జన్యపరుడైన పాలకుడిపై తిరుగుబాటు వద్దని చెప్పే హదీసులతోపాటు కొన్ని ఇలాంటివే ఇతర హదీసుల సర్వసాధరణ ప్రచారం పొందాయి. ముస్లిం మరో ముస్లింపై ఆయుధాలు దూయరాదని వాటిలో బోధించడం జరిగింది.

ఒక హదీసులో ఇలా ఉంది: "ప్రవక్త (స) ప్రవచనాన్ని అబ్దుల్లా బిన్ ఉమర్ ఇలా ఉటంకించారు: నా తర్వాత అవిశ్వాసులై పోయి ఒకరిని మరొకరు సంహరించుకోవద్దు." (బుఖారి)

సహీ బుఖారిలోనే మరో హదీసు ఇలా ఉంది: "మా పై ఆయుధం ఎత్తిన వారు మాలోని వారు కాదు." (బుఖారి).

మరో హదీసులో: "ముస్లిము తన సోదరుని వైపు ఆయుధంతో సైగ చేసే ఆ యిద్దరూ నరకం గట్టున ఉంటారు. తరువాత అతను ఆ వ్యక్తిని హత్య చేసి నట్లయితే యిద్దరూ నరకంలో పడతారు." (జామిఅ సగీర్)

క్లుప్తంగా చెప్పాలంటే, ముస్లిం సమాజంలో ఒకరిపై ఒకరు కత్తులు దూసే అనుమతి లేదు. అలాగే వ్యవస్థీకృత ప్రభుత్వంపై సాయుధ సంఘర్షణ చేసే అనుమతి కూడా లేదు. పై రెండు సందర్భాలలోనూ ఆయుధాలు ఎత్తడం ఉపద్రవానికి అల్లర్లకు తలుపులు తెరువడమే అవుతుంది.

మరొక పరిస్థితి ఏమిటంటే, ముస్లిములు ముస్లిమేతరులు ఒకేచోట నివసిస్తూ ఉంటారు. ఆ సమాజం ధార్మికంగా మిశ్రమ సమాజం. అలాంటి సమాజం సాయుధ ఘర్షణ విషయంలో ముస్లిం సమాజానికి భిన్నమైనది కాదు. ఇలాంటి సమాజంలోను ఒకరిపై ఒకరు కత్తులు దూయడానికి, సాయుధపోరు ప్రారంభించడానికి అనుమతి లేదు. దీనికి సంబంధించిన సాక్ష్యాధారాలు క్రింద ఇచ్చాము. ప్రవక్త (స) కాలంలో మక్కా నగరంలోని సమాజం ధార్మికమైన ఒక మిశ్రమ సమాజానికి ఉదాహరణ. ఆ సమాజంలో బహుదైవారాధకులతో పాటు ముస్లిములు నివసించేవారు. కొందరు అరబ్బు క్రైస్తవులు కూడా ఉండేవారు. ఈ సమాజంలో ప్రవక్త (స) అవలంబించిన వైఖరి శాంతియుతంగా సందేశప్రచారం చేయడం. ఆయుధాలు ఎత్తే అనుమతి ఎవరికీ ఇవ్వలేదు. వాస్తవానికి అక్కడ ముస్లిములపై హద్దుల్లేని హింసా దౌర్జన్యాలు జరుగుతున్న కాలం అది. కేవలం

సత్యమార్గం అనుసరిస్తున్నందున ముస్లిములను వేధిస్తున్న కాలం అది. అయినా ప్రవక్త (స) సహనం, ఓర్పు చూపాలని బోధించారు. ఎలాంటి ప్రతీకారానికి దిగకుండా ఓరిమి పాటించారు. కొందరు శక్తి సామర్థ్యాలున్న సహచరులు హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ హంజా (రజి) వంటి వారు బహుదైవారాధకులకు గట్టిగా బుద్ధిచెప్పాలని కోరేవారు. కాని ప్రవక్త ముహమ్మద్ (స) వారిని ఎల్లప్పుడు అడ్డుకొనే వారు. బలప్రయోగం వద్దని వారించేవారు.

హింసా దౌర్జన్యాల విషయంలోనూ క్షమాపణ మన్నింపు వైఖరితో వ్యవహరించేవారు ప్రవక్త ముహమ్మద్ (స). సహచరులకు కూడా అలాంటి శిక్షణ యిచ్చారు. మంచికి బదులు మంచి, దౌర్జన్యానికి బదులు క్షమాపణ, మన్నింపులు ఒకవేళ ప్రతీకారం తీర్చుకోవాలనుకొన్నా అత్యాచారాన్ని అనుమతించలేదు.

ఒక హదీసులో ప్రవక్త (స) ఇలా బోధించారు: "ప్రజలు మీతో మంచిగా వ్యవహరిస్తే మీరు మంచిగా వ్యవహరించండి. చెడుగా వ్యవహరించినా అప్పుడు కూడా దౌర్జన్యం చేయకండి. దీన్ని అలవరచుకోండి." (తిర్మిజి)

ఇలాంటిదే మరో హదీసు కూడా ఉంది : "నీ పట్ల బంధుత్వ ప్రేమను కనబరచని వ్యక్తి పట్ల నీవు బంధుత్వ ప్రేమ కనబరచు. నీపై దౌర్జన్యానికి పాల్పడిన వారిని క్షమించు, నీ పట్ల చెడుగా వ్యవహరించేవారి పట్ల మంచిగా వ్యవహరించు." (జామిఅసగీర్)

మక్కా జీవితం మొత్తాన ప్రవక్త ముహమ్మద్ (స) క్షమాపణ మన్నింపులు, సహనం ఓర్పుల వైఖరినే అవలంబించారు. దుర్మార్గులు చేసిన దౌర్జన్యాలకు హద్దేలేదు. అయినప్పటికీ ప్రవక్త (స) మూర్తీభవించిన సహనంలా నిలబడ్డారు. దుర్మార్గుల దౌర్జన్యాలు మరింత పేట్రేగి హజ్రత్ సుమయ్యా (రజి)ని కూడా హత మార్చడం జరిగింది. ఈ హత్యపై కూడా ఆయన సహనాన్ని కోల్పోయి వ్యవహరించలేదు. పైగా హజ్రత్ సుమయ్య (రజి), యాసర్‌ల సంతానానికి కూడా సహనమే బోధించారు.

"ఓ అలీ యాసర్! (యాసిర్ సంతానమా) సహనం వహించండి, నిస్సందేహంగా మీ నివాసం స్వర్గం." (జాదుల్‌మాద్)

మక్కాలో ఆయన అవలంబించిన వైఖరి ద్వారా మనకు మిశ్రమ సమాజాలలో యుద్ధానికి అనుమతి లేదని తెలుస్తోంది. ఎందుకంటే అలాంటి సందర్భంలో యుద్ధం సాధారణంగా ఫలవంతం కాదు. పైగా సందేశ ప్రచార మార్గంలోనూ అవరోధాలు ఎదురవుతాయి. ప్రస్తుత కాలంలోని మిశ్రమ సమాజాలలోనూ పరిస్థితి దాదాపు ఇదే. ప్రవక్త (స) మక్కాలో అనుసరించిన వైఖరి అందరికీ అనుసరించ దగ్గది. మౌలానా సయ్యద్ జలాలుద్దీన్ ఉమరి ఇలాంటి పరిస్థితుల వివిధ కోణాలను విశ్లేషిస్తూ ఇలా రాశారు.

"ఇస్లాం ప్రాబల్యాన్ని, ఉన్నతిని కోరుతుందన్నది నిజమే. కాని ఇస్లామేతర దేశంలో ధర్మప్రచార, సందేశ ప్రచార అవకాశాలు లభిస్తున్నప్పుడు, సందేశ ప్రచార కార్యకలాపాలు కొనసాగుతున్నప్పుడు ఈ మార్గంలో భరించరాని ఆటంకాలు ఏవీ లేనప్పుడు అక్కడి నుంచి హిజ్రత్ చేసే అవసరమూ ఉండదు. ఆ దేశంలో 'జిహాద్' కూడా జరగదు. ప్రవక్త (స) సాధించిన మహావిప్లవం మక్కా నగరంలో వ్యక్తిగత, సామూహిక సందేశ ప్రచారంతో మొదలయ్యింది. ఒక్కొక్క వ్యక్తి వద్దకు కూడా ప్రవక్త (స) దైవసందేశాన్ని చేరవేశారు. మక్కా వీధుల్లో ఆయన చేసిన సత్యధర్మ సందేశ ప్రచారం ప్రతిధ్వనించింది. మక్కావాసులు సందేశ ప్రచార మార్గాలను మూసివేయనంతకాలం, మక్కాలో ప్రవక్త (స)ను హతమార్చాలన్న ప్రయత్నాలు జరుగనంత కాలం ప్రవక్త (స) మదీనాకు హిజ్రత్ చేయలేదు (వలస వెళ్ళలేదు). అలానే మక్కాలో ఉండి శత్రువులతో పోరాడనూ లేదు.

(మౌలానా జలాలుద్దీన్ ఉమరి, తహ్‌కీకాతె ఇస్లామీ, జనవరి–మార్చి 2001)

మక్కాలో అసలు జిహాద్ ధార్మిక విధిగానే రూపొందలేదని అభ్యంతరం వ్యక్తం చేయడం సరయినది కాదు. ఎందుకంటే తన ప్రాణరక్షణకు, దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సంబంధించినంత వరకు జిహాద్ లేదా బలప్రయోగం ఎన్నడూ నిషిద్ధం కాదు. కాని మక్కాలోని పరిస్థితుల దృష్ట్యా ఈ హక్కును ఉపయోగించరాదనే నిర్ణయమైంది. అందువల్ల ఆ హక్కును ఉపయోగించడం జరగలేదు. మదీనాలో ఇస్లామీయ రాజ్యం ఏర్పడిన తర్వాత, వారి వద్ద ఆత్మరక్షణకు అవసరమైన సాధన సామగ్రి వచ్చిన తర్వాత అప్పుడు యుద్ధానికి అనుమతి ఇవ్వడం జరిగింది. అందువల్లనే 'జిహాద్' ఆయత్ 'అనుమతి' అన్న పదంతో మొదలవుతుంది.

రాజ్యస్థాయి

రాజ్యస్థాయి కేవలం ఇస్లామీయ ప్రభుత్వానికి, నిర్ధారిత షరతులతో 'జిహాద్'ను ప్రకటించే హక్కు ఉంది. ఆ షరతులలో కొన్ని :

మొదటి షరతు: ప్రజలపై మొత్తం సముదాయంపై పూర్తి పట్టు ఉన్న నాయకుడి నేతృత్వంలో యుద్ధం జరగాలి.

రెండవ షరతు: యుద్ధం కేవలం దేవుని కోసం జరుగాలి. జాతిపరమైన, ప్రాంతపరమైన పక్షపాతాలతో లేదా సంపద అధికారాల కోసం జరుగరాదు.

ఒక హదీసులో ఇలా ఉంది: "అల్లాహ్ వచనం ఔన్నత్యం కోసం ఎవరైనా వ్యక్తి జిహాద్ చేస్తే అది అల్లాహ్ కొరకు చేసిన జిహాద్". (బుఖారి)

మరో హదీసులో ఇలా ఉంది: "దురభిమానంతో పోరాడే వ్యక్తి మాలోనివాడు కాదు. దురభిమానంతో మరణించేవాడు మాలోని వాడు కాదు." (అబూదావూద్)

మూడవ షరతు : జిహాద్ ఒక లక్ష్యం కొరకు జరుగాలి. అంటే షరిఅత్ యే లక్ష్యాల కొరకు 'జిహాద్' అనుమతి ఇచ్చిందో కేవలం ఆ లక్ష్యాల కొరకు మాత్రమే జరుగాలి. ఏ పరిస్థితుల మేరకు అనుమతి ఇచ్చిందో ఆ పరిస్థితుల మేరకు మాత్రమే జరుగాలి.

నాలుగవ షరతు : జిహాద్‌లో ధర్మవిరుద్ధమైన పద్ధతి యేదీ అవలంబించరాదు.

ఈ షరతులతో ముస్లిములు హింసా దౌర్జన్యాలకు ప్రతిగా బాధిత ముస్లిములకు మద్దతుగా, సత్యధర్మ మార్గాన్ని ఆటంకపరిచే శక్తులకు ఎదురుగా జిహాద్ చేయవచ్చు.

ఈ విషయమై దివ్యఖుర్ఆన్‌లో దైవం ఇలా తెలిపాడు:

"ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయబడుతుందో వారికి (యుద్ధం చేసే) అనుమతి ఇవ్వబడింది. ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయిన వారు. నిశ్చయంగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు. వారు అన్యాయంగా తమ ఇళ్ళ నుంచి తరిమి వేయబడినవారు. వారి తప్పు కేవలం 'అల్లాహ్ మా ప్రభువు' అనడమే." **(అల్‌హజ్ : 39, 40)**

ఏదైనా దౌర్జన్యకరమైన, దుర్మార్గమైన శక్తి ముస్లిములపై దాడిచేస్తే అప్పుడు కూడా ఆత్మరక్షణ కొరకు ఈ అనుమతి ఉంది. ఈ విషయమై దివ్యఖుర్‌ఆన్ ఇలా పేర్కొంది:

"మీతో పోరాడే వారితో మీరు అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని, హద్దులు అతిక్రమించకండి." (అల్‌బఖర : 190)

దివ్యఖుర్‌ఆన్ పేర్కొన్న అవసరాల మేరకు ఈ రెండు పరిస్థితులలో 'జిహాద్' ధర్మసమ్మతం. అయితే ఈ సందర్భంగా సమాన స్థాయిలో మాత్రమే ప్రతీకారం తీర్చుకోవడం జరగాలి. దాన్ని మించి అత్యాచారానికి పాల్పడే అనుమతి లేదు. ఎందుకంటే పైన చెప్పిన అయత్‌లో "దౌర్జన్యం కూడదు" అన్న పరిమితి ఉంది. ఇదే విధంగా ఇతర ఆయతుల్లోనూ ఇలాంటి పరిమితులు ఉన్నాయి. అందువల్ల దౌర్జన్యం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మవిరుద్ధమే. బదులు తీర్చుకోవడం మాత్రమే ధర్మసమ్మతం. పై రెండు పరిస్థితులు రక్షణ కోసం జరిగే యుద్ధానికి సంబంధించినవి. మనిషి స్వేచ్ఛకు వ్యతిరేకంగా హింసా దౌర్జన్యాలు జరిగినా లేక మనిషి మత విశ్వాసాలకు వ్యతిరేకంగా జరిగినా రెండు సందర్భాలలోనూ నేరమే. ఈ హింసా దౌర్జన్యాల నుంచి ఆత్మరక్షణ చేసుకొనే హక్కు మనిషికి సహజమైన హక్కు.

పై రెండు సందర్భాలలోనూ 'జిహాద్' చేసే అనుమతి ఉన్నప్పటికీ జిహాద్ ఎట్టి పరిస్థితిలోనూ తప్పనిసరి కాదు. యుద్ధం జరుగకుండానే ఉద్దేశ్యాలు నెరవేరే మాటయితే, బాధితులకు వారి హక్కు ఇప్పించడం సాధ్యమయితే యుద్ధానికి దిగకపోవడమే మంచిది.

జిహాద్‌కు సంబంధించి పైన చెప్పిన రెండు రకాలు ఆత్మరక్షణకు సంబంధించినవి. మరొక రకం ఏమంటే, ఏదైనా ప్రాంతంలో ముస్లిములు బలహీనంగా ఉండడం, తమ ధర్మం కారణంగా విశ్వాసాల కారణంగా వారిపై హింసా దౌర్జన్యాలు జరుగుతుంటే, ఒక దౌర్జన్యపరమైన జాతి వారి జీవితం దుర్భరం చేసి వేస్తుంటే బాధితులకు సహాయపడడం ఇస్లామీయ ప్రభుత్వపు విధి.

దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది:

"అసలు మీరు నిస్సహాయులయిన ఆ పురుషులు, స్త్రీలు, పిల్లల కొరకు అల్లాహ్ మార్గంలో పోరాడకపోవడానికి కారణం ఏమిటి? బలహీనుల వడంచేత అణచబడి, వారు, 'మా ప్రభూ దుర్మార్గులైన ఈ నగరవాసుల నుంచి విమోచనం కలిగించు...' అని ఫిర్యాదు చేస్తున్నారే."

(అన్నిసా : 75)

అయితే ఇలా బాధిత ముస్లిములకు సహాయపడడంలోనూ ఒప్పందం లేని జాతికి వ్యతిరేకంగా అయితేనే సాధ్యం. ఒకవేళ దౌర్జన్యం చేస్తున్న జాతితో ఒప్పందం ఉన్నట్లయితే బాధిత ముస్లిములకు సహాయపడడం జరుగదు.

ఒప్పందం ఉన్నంతకాలం దాన్ని గౌరవించడం జరుగుతుంది. దివ్య ఖుర్ఆన్ ఈ విషయమై-

"ఒకవేళ వారు ధర్మ వ్యవహారాలలో మీ సహాయం కోరితే వారికి సహాయం చేయడం మీ విద్యుక్త ధర్మం. కాని మీరు ఒప్పందం కుదుర్చుకొన్న జాతికి వ్యతిరేకంగా మాత్రం కాదు." **(అల్ అన్ఫాల్ : 72)**

మరొక పరిస్థితి ఏమిటంటే, సత్యధర్మాన్ని స్వీకరించడానికి వీలులేదంటూ ప్రజలపై ప్రభుత్వాలు నిషేధం విధించినట్లయితే, ఆ నిషేధాన్ని తొలగింపజేయడానికి, సత్యధర్మాన్ని స్వీకరించే మానవ హక్కును పునరుద్ధరించడానికి ఇస్లాం యుద్ధానికి అనుమతి ఇస్తుంది.

యుద్ధం అన్నది మిథ్యా శక్తుల ఉపద్రవం ఉన్నంత వరకు మాత్రమే జరుగాలి. ఉపద్రవం చల్లారితే యుద్ధం కూడా ముగుస్తుంది. దివ్యఖురన్‌లో ఈ విషయమై -

" పీడన అంతమయ్యే వరకు, దైవధర్మం స్థాపించబడే వరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకొంటే, దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు." **(అల్‌బఖర: 193)**

ఉపద్రవం అణగి, దుర్మార్గులు సంధికి దిగివచ్చిన తర్వాత యుద్ధం ముగుస్తుంది. ఈ విషయమై గమనించదగ్గ ఖుర్ఆన్ ఆయతులు:

"యుద్ధంలో ఆయుధాలు క్రింద పారేసే వరకు (ఇలా జరగాలి).

(ముహమ్మద్ : 4)

"ప్రవక్తా! శత్రువు గనుక సంధి శాంతుల వైపునకు మొగ్గు చూపితే నీవు కూడా దానికి సిద్ధపడు." (అన్ఫాల్ : 61)

"కాబట్టి వారు మీ నుంచి వైదొలిగిపోతే, యుద్ధం చేయడం మానివేస్తే, సంధి కొరకు శాంతి కొరకు చేయిజాపితే అప్పుడు వారిపై దాడి చేయడానికి అల్లాహ్ మీకు యే కారణాన్ని వదలలేదు." (అన్నిసా : 90)

అనివార్య పరిస్థితుల్లో మాత్రమే ఇస్లాం యుద్ధం లేక జిహాద్కు అనుమతి ఇస్తుంది. ఆ పరిస్థితులు అంతరించిన మరుక్షణం అనుమతి కూడా రద్దవుతుంది.

ప్రవక్త ముహమ్మద్ (స) ఆయన సహచరులు (రజి) ఎల్లప్పుడు నిర్యుద్ధ స్థితికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రవక్త (స) ఎల్లప్పుడు యుద్ధానికి దూరంగా మసలుకునే ప్రయత్నం చేసేవారు. ఒక హదీసులో ఇలా ఉంది:

"శత్రువుతో తలపడడాన్ని తప్పించండి." (బుఖారి)

హుదైబియా సంధికి సంబంధించిన ఉదాహరణ మన ముందు ఉంది. యుద్ధాన్ని నివారించడానికి, శాంతి స్థాపించడానికి గాను శత్రువు కోరికలన్నింటినీ మన్నించి కుదుర్చుకొన్న ఒప్పందం హుదైబియా సంధి. శత్రువులు అనేక విధాలుగా శాంతి ప్రయత్నాలను భగ్నం చేయాలని ప్రయత్నించారు. కఠినమైన, అమర్యాదకరమైన షరతులతో సంధి కుదిరింది. అప్పుడే ఒక ముస్లిం– అబూ జందల్ బహుదైవారాధకుల హింసా దౌర్జన్యాలను భరించలేక పారిపోయి అక్కడకు వచ్చారు. తనను మక్కా నుంచి బయటపడేలా చేయమని అభ్యర్థించారు. మక్కా వాసులు ఒప్పందం ఆధారంగా అందుకు ఒప్పుకోలేదు. ముస్లిములకు అది తీవ్ర భావావేశాల విషయం; వారు మరోసారి సహన పరీక్షలకు గురయ్యారు. శాంతి స్థాపనకు ఈ భారీ మూల్యాన్ని కూడా చెల్లించారు. కాని తర్వాత పరిస్థితులు ఏ విధంగా మారాయంటే ముస్లిములు తాము చెల్లించిన భారీ మూల్యానికి మంచి ప్రతిఫలం పొందారు.

పై వివరాల ద్వారా ఇస్లాంలో జిహాద్ స్థానం ఏమిటో మనకు స్పష్టంగా తెలుస్తోంది. ఎలాంటి పరిస్థితుల్లో యే యే షరతులతో జిహాద్ చేయవచ్చునో అర్థం అవుతుంది. ఇస్లాం పేరిట, స్వచ్ఛమైన సంకల్పంతో జరిగే యుద్ధం జిహాద్ ఎందుకు కాదు అని కొందరు ప్రశ్నిస్తుంటారు. జిహాద్‌కు కొన్ని నియమాలు, నిబంధనలు, పరిమితులు, పద్ధతులు ఉన్నాయని ఇలాంటి వాళ్ళు గ్రహించాలి. వాటిని పాటించని యుద్ధం జిహాద్ కాదు.

వ్యాపార సామాగ్రిని సముద్రం పాలు చేసి తనకు లాభాలు రావాలని ఆశించడం, తాను చేస్తుంది వ్యాపారం అని భావించడం ఎలాంటిదో జిహాద్ కాని యుద్ధాన్ని జిహాద్‌గా భావించడమూ అలాంటిదే.

టెర్రరిజం- ఇస్లామీయ ఉద్యమాలు

టెర్రరిజం గురించి ప్రపంచంలో ఎప్పుడు చర్చ జరిగినా పాశ్చాత్య మేధావులు సాధారణంగా ఇస్లామీయ ఉద్యమాలే కారణమైనట్లు ఆరోపిస్తారు. వాస్తవానికి ఈ విషయమై ఎలాంటి సాక్ష్యాధారాలు వారు నేటి వరకు చూపలేక పోయారు. టెర్రరిజం వెనుక కొన్ని కారణాలు, పరిస్థితులు ఉంటాయి. వాస్తవ మేమంటే ఈ కారణాలు, పరిస్థితులకు ఆయా సంస్థలు, వ్యక్తులకు పాశ్చాత్య దేశాలతోనే ఏదో ఒక రూపంలో సంబంధం ఉంటుంది. ప్రాచ్య దేశాల్లోనూ, మధ్య ప్రాచ్యంలోనూ ఈ పాశ్చాత్య భావాల ప్రభావం వల్లనే టెర్రరిస్టు కార్యకలాపాలు జరిగాయి. ఈ కార్యకలాపాలకు కారణం ఇస్లాం పునరుజ్జీవనం కాదు. అదికాక, ప్రతి ముస్లిం చేసే ప్రతి పనికి కారణం ఇస్లామ్ అని భావించడం, ఆ పనికి ఏదో ఒక ఇస్లామీయ ఉద్యమంతో సంబంధం ఉందని అన్వేషించడం సరియైన పద్ధతి కాదు. నిజానికి పాశ్చాత్య దేశాల్లో అనేక టెర్రరిస్టు సంస్థలు చురుగ్గా ఉన్నాయి. ఇవి తప్పనిసరిగా క్రైస్తవ లేదా యూదు సంస్థలు. కాని ఈ విషయంలో క్రైస్తవం లేదా యూదు మతం ప్రస్తావన ఎన్నడూ రాదు!

ఇస్లామీయ ఉద్యమాలను, ఇస్లామీయ జాగరూకతను వ్యతిరేకించే వారి ఈ వైఖరి న్యాయానికీ సామంజస్యతకు వ్యతిరేకం. ఏదైనా వర్గం గురించి ఒక నిర్ణయానికి వచ్చేముందే ఆ వర్గం ఉమ్మడి ఆలోచనా ధోరణి, దాని అధికార ప్రణాళి ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. ఇదే సరయిన సశాస్త్రీయమైన పద్ధతి. ఇస్లామీయ ఉద్యమాల చరిత్రను అధ్యయనం చేస్తే- అనేక ఇస్లామీయ దేశాల్లో ఈ ఉద్యమాలు దురాక్రమక శక్తుల నుంచి తమ దేశాలను విముక్తం చేసే ఉద్యమాలుగా ప్రారంభమయ్యాయి. అందువల్ల ఇతర ఉద్యమాల మాదిరిగా ఈ ఉద్యమాలలోనూ బలప్రయోగం నిషిద్ధమూ కాదు. అది నేరం కూడా కాదు. దురాక్రమణదారులకు ప్రతిగా స్వాతంత్ర్యం కోసం పోరాడడం మానవుల జన్మహక్కు.

ఇస్లామీయ ఉద్యమ నేతల భావాలు

స్వాతంత్ర్యానికి ముందు ఇస్లామీయ ఉద్యమాలు కొద్దోగొప్పో బలప్రయోగానికి పూనుకొన్నాయి. కాని, స్వాతంత్ర్యం తర్వాత దాదాపుగా ఇస్లామీయ ఉద్యమాలన్నీ తమ తమ పాలసీల నుండి బలప్రయోగాన్ని తొలగించాయి. మౌలానా మౌదూదీ, హసనుల్ బన్నా షహీద్‌లు వ్యవస్థను బలవంతాన మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మొరాకోకు చెందిన రాషిదల్ గనోషీ, అల్జీరియాకు చెందిన అబ్బాస్ మదనీ, బోస్నియాకు చెందిన అలీజా ఇజ్జత్ బేగోదిబ్, టర్కీకి చెందిన నజ్మద్దీన్ అర్బకాన్ వంటి వారు కూడా ఏకగ్రీవంగా సైనిక విప్లవం ద్వారా, బలప్రయోగం ద్వారా వ్యవస్థను మార్చడాన్ని ఇస్లామీయ ఉద్యమాల ఉద్దేశాలకు, విధానాలకు పొసగని వైఖరిగా అంగీకరించారు.

మౌలానా అబుల్ ఆలా మౌదూది అనేక సందర్భాలలో, హింసాత్మక పద్ధతుల ద్వారా వ్యవస్థను మార్చడం తప్పు అని పేర్కొన్నారు. మౌలానా జీవితం కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో సాగే విప్లవానికి అద్దం వంటిది. ఒకసారి ఆయన్ను ఎవరో "జమాఅతె ఇస్లామీపై అతివాద ఆరోపణ ఎంతవరకు సబబు" అని ప్రశ్నించారు. అప్పుడు మౌలానా జవాబిస్తూ, "జమాఅతె ఇస్లామీ నేటి వరకు ప్రజలను ఆ విధంగా రెచ్చగొట్టలేదు. అది ఎట్టి పరిస్థితిలోనూ చట్టం పరిధిలోనే పని చేస్తుంది" అన్నారు. **(ఇస్తిఫ్‌సారాత్, పే.243)**

మక్కాలో అరబ్బు యువకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఇలా అన్నారు:

"నా ఆఖరు సలహా ఏమిటంటే, రహస్య ఉద్యమాలు నడుపడం, ఆయుధాల ద్వారా విప్లవం సాధించడం వంటి ప్రయత్నాలు చేయరాదు. అలా చేయడం ఓ విధంగా అసహనం, తొందరపాటునూ సూచిస్తాయి. ఫలితం రీత్యా కూడా ఇతర విధానాలను పోల్చినట్లయితే అవి ఘోరంగా ఉంటాయి."

(తఫ్‌హీమాత్, సం.3, పు.362)

ఒకసారి పాకిస్తాన్‌లో విప్లవం గురించి మాట్లాడుతూ ఆయన "రహస్య పద్ధతుల ద్వారా, రాజ్యాంగేతర మార్గాలను అవలంబిస్తే ఫలితాలు అంతకన్నా ప్రమాదకరంగా ఉంటాయి. రహస్య సంస్థలలో కొందరు వ్యక్తులు సర్వాధికారాలు హస్తగతం చేసుకొని ఉంటారు. అంతే ఇక పూర్తి ఉద్యమం వారి ఇష్టం ప్రకారమే నడుస్తుంది. వారిని విభేదించే వ్యక్తులను తక్షణం హతమార్చుతారు. వారి పాలిసీ పట్ల అసంతృప్తిని ప్రకటించడం వారికి అత్యంత అయిష్టం, భరించరానిది అవుతుంది. ఇక ఇలాంటి వ్యక్తులు అధికారంలోకి వస్తే ఎలాంటి నియంతలుగా మారుతారో మీరే ఆలోచించండి. ఒక నియంతను తొలగించి మరో నియంతను తెచ్చుకొంటే అందులో ప్రజలకు మేలు ఏముంది." **(తస్రీహాత్ : 253)**

మరో సందర్భంలో ఆయన తన ప్రతిజ్ఞను ఇలా వ్యక్తం చేశారు:

"అన్ని విధాల ప్రమాదాలు, నష్టాలు భరిస్తూ కూడా శాంతియుతంగానే సత్యవచన ఉన్నతికి పాటుపడే మార్గాన్ని అవలంబించాలి. ఫలితంగా నిర్బంధానికి గురయినా ఉరికంబం ఎక్కవలసి వచ్చినా సరే." **(తస్రీహాత్ : 57)**

రాషిదల్ గనౌషీ ఏమన్నారంటే

ముస్లిముల సుదీర్ఘ చరిత్రను అధ్యయనం చేస్తే అత్యధిక శాతం ముస్లిము ఉలేమాల ఈ వైఖరి ఆదర్శనీయమైనది కాదు. అయినా ముస్లిం సమాజానికి ఇది తక్కువ నష్టదాయకంగా రుజువు అయ్యింది. కాని, అందుకు విరుద్ధంగా, దౌర్జన్య పరులయిన పాలకులపై ప్రాణాలకు తెగించి పోరాడటం, వారి హత్యా ప్రయత్నం

ప్రారంభిస్తే లాభం ఏదీ ఉండదు. పైగా పెద్ద సంఖ్యలో నిరపరాధులైన ప్రజలు హతంకావడం, ప్రజాప్రయోజనాలు నాశనం కావడం ముస్లిం సమాజం బలహీనతలలో శత్రువు జోక్యం చేసుకొనే అనేక మార్గాలు తెరుచుకోవడం జరుగుతాయి. వీటన్నింటికీ మించిన నష్టం ఏమంటే, దురాక్రమక, దౌర్జన్యపరుడైన పాలకులనూ అంతమొందించిన తర్వాత, భారీ స్థాయిలో ధనప్రాణ త్యాగాల పిదప కూడా అసలు ఉద్దేశ్యం నెరవేరదని అనుభవాలు చెబుతున్నాయి. దుర్మార్గపు పాలకులపై ప్రజలు సాయుధ తిరుగుబాటు జరిపిన తర్వాత, పాలకులు గద్దె దిగినప్పటికీ ఆ తర్వాత అంతకన్నా పెద్ద నియంత ఆ స్థానంలో రావడం జరిగింది.

(ఇస్లామీయ తహ్రీకాత్, జిద్దొ జిహాద్ కిస్ తరాహ్, పు.53)

అల్లామా యూసుఫుల్ ఖర్జావీ టెర్రరిజాన్ని ఖండిస్తూ ఇలా రాశారు:

"ఈ అపరాధానికి పాల్పడిన వారు, తమ సంబంధం ఇస్లామ్‌తో వ్యక్తం చేసి తాము ఇస్లామ్ కోసం పోరాడుతున్నామని చెప్పినప్పుడు ఈ నేరంలోని హైన్యం మరింత తీవ్రతరమవుతుంది. వాస్తవానికి దైవగ్రంథం, ప్రవక్త (స) సంప్రదాయాలు, సహచరుల ఆచరణలు, అన్వయకర్తల సాధారణ వైఖరి అన్నీ ఈ దౌర్జన్యకర, పాశవిక చర్యలకు వ్యతిరేకంగా ఉన్నాయి." **(ఫతావా ముఆసిర పు.1,2)**

'అల్ ఇఖ్వానుల్ ముస్లిమూన్' సంస్థ అధినేత ముస్తఫా మష్‌హూర్ ఒక ఇంటర్వ్యూలో తమ విధానం గురించి వివరిస్తూ ఇలా అన్నారు:

"ఇఖ్వాన్ గతంలోనూ ఎన్నడూ టెర్రరిజాన్ని అనుసరించలేదు. నేడు కూడా దానితో ఇఖ్వాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదు." **(దావత్, 16 మార్చి 2000)**

డాక్టర్ ముస్తఫా ముహమ్మద్ అల్‌తహాన్ హింసాత్మక విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ ఇలా రాశారు:

"టెర్రరిజం వ్యక్తికి వ్యతిరేకంగా, సమాజానికి వ్యతిరేకంగా జరిగే నేరం. కారణాలు, ఫలితాలు ఏవయినా గాని, ఇస్లామీయ ఉద్యమం అన్ని విధాల హింసకు వ్యతిరేకం. ఎదో పాలిసీగా అవి హింసను వ్యతిరేకించడం లేదు. హింస ఇస్లామీయ బోధనలకు విరుద్ధం కాబట్టి వ్యతిరేకిస్తుంది.

భారత పాకిస్తాన్ ఉపఖండంలోని ఉలమాలు అందరూ టెర్రరిజాన్ని ఖండిం చారు. తమ దృక్పథాన్ని స్పష్టం చేస్తూ తాము అన్ని విధాల టెర్రరిజాన్ని వ్యతిరేకిస్తు న్నట్లు తెలిపారు. టెర్రరిజం ఇస్లామీయ స్ఫూర్తికే విరుద్ధం" అని ప్రకటించారు. (రాష్ట్రీయ సహారా: **14/3/2001)**

ఇస్లామీయ ఉద్యమం - హింస

గత పంక్తుల్లో సమకాలీన ఇస్లామీయ ఉద్యమాల నేతలు, ఇతర మేధావుల అభిప్రాయాల ద్వారా, ఇస్లామీయ ఉద్యమం తాను కోరే విప్లవం సాధించడానికి గాను హింసా మార్గాన్ని అనుసరించడాన్ని వ్యతిరేకిస్తుందని, కేవలం ప్రజాస్వామ్య పద్ధతులను మాత్రమే విశ్వసిస్తుందనీ, ప్రజాస్వామ్యేతర పద్ధతులన్నింటినీ ధర్మ విరుద్ధంగా ప్రకటిస్తోందని తెలుస్తోంది. ఇటీవలి చరిత్రలో కేవలం మూడు సందర్భాలలో ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు బలప్రయోగానికి పూనుకొన్నారు. ఈజిప్ట్, సిరియా, అల్జీరియా-ఇందులోనూ అల్జీరియా ప్రత్యేకత ఏమిటంటే అక్కడ జరిగిన ఎన్నికల్లో ప్రజలలో 80శాతం మంది ఇస్లామీయ ఉద్యమ ప్రతినిధులను ఎన్నుకొన్నారు. ఇస్లామీయ ఉద్యమం సాధించిన అఖండ విజయం చూసి పాశ్చా త్యులు భయసందేహాలలో మునిగిపోయారు. సైన్యాన్ని ఉపయోగించి ఈ విజయాన్ని కాలరాచి ఎన్నికలను రద్దు చేయించారు. ఇస్లామీయ ఉద్యమంపై అణచివేత ప్రారంభమయ్యింది. ఉద్యమ ప్రధమ శ్రేణి నేతలు సహనంతో, ఓర్పుగా వ్యవహరిం చారు. దౌర్జన్యాలను ఓరిమితో భరించారు. కాని, అగ్రనేతల నిర్బంధం జరిగిన తర్వాత అనుచరులు సహనం వహించలేకపోయారు. వారి ఓరిమి నశించింది. దౌర్జన్యానికి ప్రతిగా బలప్రయోగానికి పూనుకొన్నారు. దౌర్జన్యపరులకు కావలసింది అదే. వాళ్ళు అవకాశం కోసం చూస్తున్నారు. ఏదో ఒక సాకు దొరకగానే దౌర్జన్యాలు, అణచివేతలు అత్యాచారాల వికృత హేల కొనసాగింది. మానవత్వమే వణికిపోయింది. కేవలం కొన్ని నెలల కాలంలోనే యాభై వేల మంది అమాయకులు అసువులుబాసారు. దాదాపు అదే సంఖ్యలో ప్రజలు నేటికి కూడా బందీలుగా పడి ఉన్నారు. ఎన్నో యిళ్ళు దోచుకోబడ్డాయి. ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయి. ఎన్నో సంస్థలు అంతం అయ్యాయి. పనిచేసే అనేక అవకాశాలు వ్యర్థమయ్యాయి.

ఈజిప్ట్, సిరియాల పరిస్థితి వేరు. అక్కడ ఇస్లామీయ ఉద్యమాలు ప్రభుత్వంలో భాగాలుగానే ఉండేవి. కాని, ఈ సందర్భంగానే కొందరు ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు బలప్రయోగానికి దిగడం వల్ల వారిపై అణచివేతల పర్వం మొదలయ్యింది.

ఈ మూడు ప్రత్యేక సంఘటనలు తప్ప హింసాత్మక చర్యలకు ఉద్యమం పాల్పడిన సంఘటన మరొకటి లేదు. ఇస్లామీయ ఉద్యమం ప్రతిచోట ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా, మానవ సంస్కరణ ద్వారా మార్పులకు ప్రయత్నించింది. ఉద్యమం వల్ల చైతన్యవంతమైన ప్రజలు ఎన్నడూ పాలనా వ్యవస్థను వ్యతిరేకించలేదు. మిథ్యా ప్రభుత్వ వ్యవస్థను వ్యతిరేకంగాను, దైవాదేశాలను అనుసరించే వ్యవస్థ స్థాపనకు కృషి చేసింది. ఆ ప్రయత్నాలను కూడా శాంతియుతంగా, సందేశ ప్రచార పద్ధతుల ద్వారా కొనసాగించింది. అధికారాన్ని అందుకోగానే ప్రజాస్వామ్యాన్ని పెకలించి వేయడమూ జరుగలేదు. సిరియాలో ఇస్లామీయ ఉద్యమం ప్రభుత్వంలో పాలుపంచు కొన్నది. ఈజిప్ట్‌లో ఉద్యమం ప్రభుత్వంలో భాగంగా ఉండేది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలో కూడా ప్రభుత్వంలో పాలుపంచుకొన్నది. టర్కీలో రెండు పర్యాయాలు అధికారం ఉద్యమానికి దొరికింది. అప్పుడు కూడా ఉద్యమం ప్రజాస్వామ్య విలువ లను పూర్తిగా పాటించింది. ఈరాన్‌లో విప్లవం సంపూర్ణమయ్యింది. శాంతియుత పద్ధతుల ద్వారానే విప్లవం వచ్చింది.

ముస్లిం దేశాల్లో కొన్నిచోట్ల ముస్లిములు బలప్రయోగానికి పూనుకొన్న ప్రాంతాలు కూడా ఉండవచ్చు. సాయుధ సంఘర్షణలు జరిగి ఉండవచ్చు. కాని వాటిని ఇస్లామీయ ఉద్యమానికి ముడిపెట్టడం ఉచితం కాదు.

ఇస్లామీయ ఉద్యమం ప్రపంచం మొత్తానికి శాంతియుత సహజీవన సందేశాన్ని ఇస్తుంది. ఈజిప్ట్, అల్జీరియా, సిరియా అనుభవాలు, శాంతియుత సందేశం పట్ల దానికున్న విశ్వాసాన్ని మరింత బలపరిచాయి.

సాయుధ సంఘర్షణ - ప్రభావాలు

కొన్ని ముస్లిం ఉద్యమాలు జిహాద్ పేర, ఇస్లామ్‌పేర కొనసాగించిన సాయుధ

సంఘర్షణల వల్ల ముఖ్యంగా ఇస్లామీయ ఉద్యమం కఠిన పరిస్థితులకు గురయ్యింది. మానవ వనరులను అవకాశాలను సరిగా ఉపయోగించే వీలులేక చాలా వెనుకబడిపోయింది. అన్నింటికీ మించి ఇస్లామ్ అప్రతిష్ఠపాలయ్యింది. ఈ పరిస్థితుల్లో చాలామంది తమ వ్యక్తిగత స్పర్ధలను కూడా ఉద్యమానికి ముడిపెట్టారు. అల్జీరియా ఇందుకు ప్రస్ఫుటమైన ఉదాహరణ. అక్కడ యాభైవేల మంది ముస్లిముల ప్రాణాలు పోయాయి. మరో ఉదాహరణ, ఇటీవలి చెచెన్యా సంఘటనలు. అక్కడ కూడా అసంఖ్యాకంగా అమాయకులు నిహతులయ్యారు. సాయుధ సంఘర్షణల్లో మరణించే వాళ్ళు తాము మరణిస్తూ తమ వెనుక ఒక సమస్యల పరంపరను వదలిపోతారు. అనాథలు, వితంతువుల సమస్య తలెత్తు తుంది. తండ్రిలేని పిల్లలు చెడు అలవాట్లకు లోనయ్యే ప్రమాదం ఉంది. ఫలితంగా నేరాలు పెరగవచ్చు. యుద్ధం ఒక భయానక వినాశనాన్ని సృష్టిస్తుంది. అనేకానేక సమస్యలు తలెత్తుతాయి.

సాయుధ సంఘర్షణ వల్ల పెద్ద నష్టం ఏమంటే, అనవసరంగా ఇస్లాం అప్రతిష్టపాలవుతుంది. శత్రువులకు అవకాశం దొరుకుతుంది. ఇస్లాం శాంతి భద్రతలకు విఘాతంగా ప్రచారం చేసే సాకు దొరుకుతుంది. ఇస్లామీయ ఉద్యమాన్ని టెర్రరిస్టు ఉద్యమంగా ముద్రవేసే వీలు దొరుకుతుంది. ఈ ఆరోపణలకు వాస్తవాలతో ఏ మాత్రం పొంతన లేదు. దీనివల్ల మరో నష్టం ఏమిటంటే ఇతర ఇస్లామీయ ఉద్యమాలకు కూడా కార్యక్షేత్రం ఇరుకైపోతుంది. టెర్రరిస్టు సంఘటనలకు ఇస్లాంకు ఏ మాత్రం సంబంధం లేదని స్పష్టంగా రుజువైనప్పటికీ, ఇదంతా ఇస్లాం వ్యతిరేక శత్రుశక్తుల చేష్టలేనని తేలినప్పటికీ, అనేక సందర్భాలలో ఇస్లాంప్రియుల రూపంలో చేసిన చర్యలు కూడా ఉంటాయి. కొన్ని చోట్ల ఇస్లామ్ ప్రియుల చర్యలే వీరికి ఈ అవకాశాలనిచ్చాయి.

భవిష్యత్తు

ఈ సంఘర్షణల వల్ల ఇస్లామీయ ఉద్యమానికి చెందిన మానవ శక్తి చాలా నష్టపోయింది. వైరి శక్తులకు ఇస్లాంపై అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి, టెర్రరిస్టు,

ఏకసత్తాక మతంగా ఆరోపించడానికి అవకాశం దొరికింది. ఈ పరిణామాల నుంచి ఇస్లామీయ ఉద్యమం పాఠాలు గ్రహించింది. భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడంలో ఈ చేదు సంఘటనలను దృష్టిలో పెట్టుకుంది. ఈ అనుభవాల దృష్ట్యా అనేక సంస్థలు రాజకీయాలలో పాలుపంచుకోవడం ప్రారంభించాయి. సాయుధ సంఘర్షణలకు దూరమవడంతోపాటు, ప్రజాస్వామ్య వ్యవస్థలో బలం కూడదీసుకోడానికి, దానిని సమాజ సంస్కరణలో ఉపయోగించడానికి ప్రయత్నాలు ఆరంభించాయి.

పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో (సాయుధ కృషికి తొలినుంచే వ్యతిరేకమయిన) జమాఅతె ఇస్లామీ ఎన్నికలలో పాలుపంచుకొని ప్రభుత్వంలో భాగం అయ్యింది. టర్కీలో మొదట 'సలామా' పార్టీ, తర్వాత 'రిఫా' పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థతో చెయ్యికలిపి సెక్యులర్ పార్టీలతో కూటమికట్టి ప్రభుత్వాన్ని ఏర్పరిచాయి. టర్కీలో ఇస్లామీయ పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి వచ్చినప్పటికీ, రెండుసార్లు సైన్యం వల్ల నష్టాలు చవిచూడక తప్పలేదు. అయితే టర్కీలో ఇస్లామీయ పార్టీలు, అల్జీరియాలో మాదిరిగా సైన్యానికి ప్రతిగా సాయుధ పోరుకు పూనుకోలేదు. ప్రతి దౌర్జన్యాన్ని సహనంతో భరించే సంకల్పాన్ని ప్రదర్శించారు. దీనివల్ల మంచి ఫలితాలు ముందుకు వచ్చాయి. ఉదాహరణకు ఇస్లామీయ కార్యకర్తల సంహారం జరుగలేదు. ఇస్లామీయ కార్యకర్తల పట్ల ప్రజల్లో పలుకుబడి పెరిగింది. ఇస్లాం హింసాత్మకం కాదు, సహనశీల ధర్మం అని టర్కీలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా అందరికీ చెప్పే అవకాశం దొరికింది. దౌర్జన్యాల పట్ల సహనం చూపే అసలయిన మానవీయ లక్ష్యాల కోసం త్యాగాలు చేసే భావనలు ఇందులో ఉన్నట్లు చెప్పగలిగారు.

ఈ నేపథ్యంలో ఇస్లామీయ తత్వవేత్తలలో ఒక ఆలోచనా విధానం పెంపొందుతోంది. ఇస్లామీయ కారుణ్య వ్యవస్థను స్థాపించడానికి పరిస్థితులు అనుకూలంగా లేనట్లయితే ఇస్లామీయ సందేశ ప్రచారకార్యంతోపాటు ఒక మానవీయ ప్రభుత్వ స్థాపన గురించి ఆలోచించడం సాధ్యమే. ఒక ఇస్లామీయ తత్వవేత్త ముహమ్మద్ హుసైన్ ఫజులుల్లాహ్ ఇలా రాశారు:

"మనం ప్రపంచానికి ఇస్లాంను పరిచయం చేద్దాం. కాని, ఇస్లామీయ కారుణ్య వ్యవస్థ ఏర్పరడడానికి పరిస్థితులు అనుకూలంగా లేనట్లయితే మనం ఒక మానవీయ ప్రభుత్వం స్థాపనకు పిలుపునివ్వాలి. సమస్త మానవీయ విలువల స్వేచ్ఛ, న్యాయాల ప్రాతిపదికన ఆధారపడిన ప్రభుత్వం కొరకు, ప్రయోజనకరమైన వాటిని పొందే, నష్టకరమైన వాటిని దూరం చేసే సూత్రం ఆధారభూతమైన ప్రభుత్వం కొరకు పని చేయాలి." (మబల్ల, అల్‌వహదతుల్ ఇస్లామీయ : 99)

ముహమ్మద్ హుసైన్ ఫజలుల్లాహ్ చెప్పిన మాటలు అర్థం చేసుకోడానికి మరికొన్ని ఇతర అంశాలు కూడా గుర్తుంచుకోవడం అసవరం. ప్రస్తుత కాలంలో ముఖ్యంగా కమ్యూనిజం అంతరించిన నేపథ్యంలో పాశ్చాత్య ప్రపంచం ముందు సైద్ధాంతికంగా, క్రియాశీలంగా కనిపించే ఏకైక ప్రత్యామ్నాయం ఇస్లామ్ మాత్రమే. ఇంకా చెప్పాలంటే ఉత్తమ ప్రత్యామ్నాయం పాశ్చాత్యులకు అదృష్టం కొద్దీ, దాని ఉచ్ఛదశలో ఇస్లామీయ ప్రపంచం రాజకీయంగా దిగజారిన స్థితిలో ఉంది. అందువల్ల ఇస్లాం తన పూర్తి ప్రకాశంతో నేడు దర్శనమివ్వడం లేదు. ఈ కారణం వల్లనే పాశ్చాత్య ప్రపంచం, నేడు ప్రపంచ సాంస్కృతిక శక్తిగా ఎదిగింది. అందువల్ల సైద్ధాంతిక క్రియాత్మక స్థాయిలోను పాశ్చాత్యులు ఇస్లాంలోనే ప్రమాదం ఉందని అనుకుంటున్నారు. ప్రపంచంలోని ఇతర సంస్కృతులు ముందు వెనుకగా తమ గుర్తింపును కోల్పోయి పాశ్చాత్య సంస్కృతిలో కలిసిపోతాయి. నిస్సందేహంగా ఈ సంస్కృతులకు సదృశంగా పాశ్చాత్యులు సామూహిక నైతికతను కలిగి ఉన్నారు. పాశ్చాత్య ప్రభావం వల్ల వ్యక్తి స్వేచ్ఛ, మహిళల హక్కులను ఇతర సంస్కృతులన్ని అంగీకరించాయి. పాశ్చాత్యుల్లో ఎలాంటి విశ్వాస వ్యవస్థ లేదు. అందువల్ల యే సంస్కృతి అయినా, ఎలాంటి ప్రత్యేక విశ్వాసాలు కలిగి ఉన్నా పాశ్చాత్య సంస్కృతిలో కలగలిసిపోగలదు.

పాశ్చాత్యుల్లోని ఉన్నత మానవీయ నైతికత, విలువల కన్నా ఉన్నతమైన వ్యవస్థను, భావనలను ఇస్లాం ఆరంభంలోనే ప్రతిపాదించింది. కాలక్రమేణా అవి మసకబారిపోయాయి. సమాజంలో వీటి ప్రదర్శన పూర్తిస్థాయిలో ఆచరణాత్మకంగా కానరావడం లేదు. అయినప్పటికీ, ప్రస్తుత కాలంలో, తీవ్రమైన అంతర్గత,

బహిర్గత ఒత్తిళ్ళ మధ్య ఈ విలువలు సరికొత్తగా రాటుదేలుతున్నాయి. ప్రవక్త స్థాపించిన వ్యవస్థ మరలా పూర్తి స్థాయిలో ప్రాబల్యం పొందవచ్చన్న భయం పాశ్చాత్యులకు పట్టుకుంది. అందువల్ల ప్రస్తుతం ఇస్లాం ఎలా ఉందో అలానే ఉండాలని పాశ్చాత్యులు ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యం ఉన్న చోట ప్రజాస్వామ్యానికి, రాచరికం ఉన్న చోట రాచరికానికి, నిరంకుశత్వం ఉన్న చోట నిరంకుశత్వానికి పాశ్చాత్య వ్యవస్థ రక్షణ ఇస్తూ వస్తోంది కాని ఇస్లాం ఎక్కడయినా పూర్తి స్థాయిలో ప్రకటితమయ్యే పరిస్థితి ఉంటే తక్షణం దానిని అణచివేయజూస్తోంది.

ప్రవక్త (స) కాలం నాటి పరిస్థితులను అధ్యయనం చేస్తే, ముహమ్మద్ (స) రెండు సమాజులలో దైవ సందేశ ప్రచారాన్ని, తన ప్రయత్నాలను కొనసాగించారని అర్థం అవుతుంది. ఒకటి మక్కాలోని సమాజం. అక్కడ రాజ్యాధికారం అవిశ్వాసుల చేతుల్లో ఉండేది. రెండవది మదీనా సమాజం. అక్కడ రాజ్యాధికారం చాలా వరకు ప్రవక్త ముహమ్మద్ (స) ధార్మిక విశ్వాసంతో పాటు ఆ సమాజానికి సంబంధించిన ఇతర నియమాలన్నింటినీ గౌరవించారు. అరబ్బుల్లో ప్రచారంలో ఉన్న అనేక సంప్రదాయాలూ, ఆచారాలను ఆయన యధాతథంగా అంగీకరించారు. మక్కాలో శాంతిభద్రతలకు ఆయన వల్ల ఎలాంటి ప్రమాదమూ తలెత్తలేదు. ఆయన వల్ల శాంతిభద్రతలకు భంగం కలిగిందని ఎవ్వరూ ఆరోపించనూ లేదు. పైగా ఆయనలోని ఉన్నత నైతిక ప్రమాణాలను శత్రువులు సయితం ప్రశంసించారు. మరో విషయమేమిటంటే, ఆయన ఆ సమాజంలో జరిగిన ఒక శాంతి ఒప్పందం (హిల్ఫుల్ ఫిజూల్)ని నిర్యుద్ధం, శాంతి భద్రతల స్థాపన కోసం జరిగిన ఒప్పందాన్ని ఎంతో ఇష్టపడ్డారు. ఇస్లామీయ రాజ్యస్థాపన తర్వాత కూడా ఆ ఒప్పందం పట్ల తన యిష్టాన్ని వ్యక్తం చేశారు. ఒక హదీసులో, ప్రవక్త (స) ఇలా ప్రవచించారు. "నేను అబ్దుల్లా బిన్ జిదీన్ ఇంట ఒక ఒప్పందంలో పాల్గొన్నాను. ఆ ఒప్పందం నాకు ఎర్ర ఒంటెల కన్నా ఇష్టమైనది. ఇస్లాం వచ్చిన తర్వాత కూడా అలాంటి ఒప్పందాలకు నన్ను పిలిస్తే తప్పక వెళతాను."

(సీరత్ ఇబ్నె హషామ్)

ఇలాంటి ఒప్పందాలు అభిలషించదగ్గవి, మేలయినవి అనడానికి ప్రవక్త (స) వీటిని ఇష్టపడ్డారన్న మాట చాలు. కాని దీని సమర్థనలో ప్రవక్త (స) సహచరుల ఆచరణను కూడా ఎత్తి చూపవచ్చు. ఓసారి అమీర్ ముఆవియా (రజి) కాలంలో ఇమామ్ హుసైన్ (రజి)కు చెందిన స్థలం తనదని మదీనా పాలకుడు వలీద్ బిన్ ఉత్బా ప్రకటించాడు. అప్పుడు ఇమామ్ హుసైన్ (రజి) నాకు నా హక్కు లభించనట్లయితే నేను కత్తిదూసి మస్జిదె నబవీలో నిలబడతాను, హిల్ఫుల్ ఫిజూల్ మద్దతు కోరుతాను అన్నారు. తక్షణం అబ్దుల్లా బిన్ జుబేర్, మసూద్ బిన్ మఖ్‌జన్ "మీకు మేము తోడుగా ఉన్నాం" అని మద్దతు ప్రకటించారు. మదీనా సమాజంలో ప్రవక్త (స) సందేశప్రచారం ఇలా ఉండేది.

> **"గ్రంథప్రజలారా! మాకూ మీకు మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అదేమంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ దాస్యం చేయ రాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు."**
>
> **(ఆలి ఇమ్రాన్ : 64)**

ఈ విధమైన సందేశానికి సంబంధించిన ఆచరణాత్మక ప్రదర్శనలు అనేకం మనకు ప్రవక్త (స) జీవితంలో కనబడతాయి. ఉదాహరణకు ప్రతినిధి బృందాలకు మస్జిదె నబవీలో బస ఏర్పాటు చేయడం ఒకటి. నజ్రాన్ ప్రతినిధి బృందం వచ్చిన సందర్భంగా క్రైస్తవులకు మస్జిద్ నబవీలో తమ ప్రార్థనలు జరుపుకోనివ్వడం. ఒక సందర్భంలో యూదులు కూడా మస్జిద్ నబవిలో తమ ప్రార్థనలు జరుపుకొన్నారు.

మదీనాలో ప్రవక్త (స) యూదులతో చేసుకొన్న ఒప్పందంలోని కొన్ని అధికరణలు :

అధికరణ 25 : బనూ ఔఫ్ తెగ యూదులు ముస్లిములతో కలిసిన ఒకే సమాజం. యూదులకు వారి ధర్మం, ముస్లిములకు తమ ధర్మం. ఇదే హామీ వారి బానిసలకు కూడా వర్తిస్తుంది.

అధికరణలు : 26, 27, 28, 29, 30, 31, 32, 33, 35, 46లలో విభిన్న యూదు తెగలు బనూ హారిస్, బనూ నజ్జార్, బనూ సాలిబ వగైరాలకు కూడా ఇదే హామీ ఇచ్చారు.

అధికరణ 37లో యూదులు తమ ఖర్చులను - యుద్ధం సందర్భంగా తామే భరించాలని, ముస్లిములు తమ ఖర్చులు తామే భరించాలని ఉంది. వీరి మధ్య పరస్పర సహాయ సహకారాల ఈ ఒప్పందం, ఈ ఒప్పందంలో పాల్గొన్న వారిపై యుద్ధానికి దిగిన ప్రతి వ్యక్తికి వ్యతిరేకంగా కుదిరిన ఒప్పందం. ఈ ఒప్పందంలోని పక్షాల మధ్య నిజాయితీ, ఈ ఒప్పందంలోని నమ్మకం, శ్రేయోభావం, గౌరవాదరాల సంబంధం ఏర్పాటయ్యింది.

ప్రస్తుత కాలంలోని ప్రపంచ పరిస్థితులలో ప్రవక్త (స) జీవిత చరిత్రలోని ఈ ఉదాహరణ మనకు మార్గదర్శకత్వాన్ని ఇస్తుంది. సాయుధ సంఘర్షణ కాదు. అంతకన్నా ఉత్తమమయిన కార్యరంగాలు ఇస్లామీయ ఉద్యమానికి ఉన్నాయి. పాశ్చాత్యుల పోరాటం వల్ల పాశ్చాత్యులకే లాభం. పాశ్చాత్యుల పోరు మానితే ఇస్లామీయ ఉద్యమానికి లాభం. అది స్థానిక విభేదాలకు అతీతంగా, న్యాయ ప్రియులు, సారూప్య భావాలు కల వ్యక్తులతో, సంస్థలతో కలిసి ఉన్నత మానవీయ విలువల కోసం ఇస్లామీయ ఉద్యమం కృషిచేయగలదు.

-: సమాప్తం :-